AR
192

MADRAS
GOVERNMENT ORIENTAL SERIES

No. XCI

కుమారరామునికథ

KUMĀRA RĀMUNI KATHĀ

MADRAS GOVERNMENT ORIENTAL SERIES

**Published under the authority
of the
Government of Madras**

General Editor:
T. CHANDRASEKHARAN, M.A., L.T.
Curator, Government Oriental Manuscripts Library, Madras.

No. XCI

కుమారరామునికథ

PREFACE

The KUMARA RAMUNI KATHA is an anonymous ballad written in the spoken dialect by a person of little education and no learning. The verse has neither metre nor rhyme; and it is interspersed with prose passages which form nearly a third of the bulk of the ballad. The lines are uneven and rugged and the reciter has to follow his own devices by lengthening or shortening the syllables to recite them rhythmically. The language is simple, free from unnecessary ornamentation and descriptions, and the narrative direct. The refrain *tandana tana-tandanana*, to be recited by the chorus, occurs at the end of a few verses of varying length. Similarly, the exclamation *melu melu* occurs in the prose passages to break perhaps the monotony.

It is not possible to fix definitely the date of the composition of the ballad; but its language, containing as it does a large admixture of Persian administrative terms together with a few English words, seems to indicate the first half of the nineteenth century as the probable period of its composition, when English began to displace Persian as the language of the government.

The story of Kumararamanatha or Kumara Rama, as he is more generally referred to in the ballad, is well known both in the Karnataka and the Andhra countries, where he is regarded as a great hero who died in battle, while attempting to resist the Muslim conquest of his country. The kingdom of Kampili, over which his father ruled, was situated on the borders and between Karnataka and Andhra and included within its boundaries districts where both the languages were spoken. Naturally his fame spread in both the countries, the people of which still regard him as one of their national heroes.

The Telugu Kumararamunikatha now under publication is not unfortunately as historical as one would expect. The anonymous author has taken liberties with the contents of the story and obscnred considerably its historical charcter by introducting fictitious characters and false incidents. The kernel of the story, however, remains intact; and it can best be seen in the Kanarese ballads like the Kumara Ramuni Kathe of Gangayya, Paradara-sodara Ramana-kathe of Nanjunda and the Prose Bhattara Kaifiyat. Besides these Kannada accounts, two Kalajnana works in Sanskrit, the Vidyaranya Kalajnana and the Rajakala-nirnaya which refer to the flight, from Warangal to the court of Kumararamanatha, of Harihara and Bukka, the founders of the later Vijayanagara empire, their admission into his service, and their captivity at

Delhi, on Ramanatha's defeat and death at the hands of Sultan Muhammad in battle, deserve mention. The chronicle of the Portuguese horse dealer, Nuniz must also be taken into consideration in this context, as it embodies a tradition current in Vijayanagara in the sixteenth century, about the destruction of the Kingdom of Nagundy (Anegundi, the same as the kingdom of Kampili). More important than these are the Muslim historical works such as Isamy's Futuh-us-Salatin and Ibn-i-Battuta's Kitab-ur-Rihla as well as the much later Tarikh-i-Ferishta of Muhammad Qasim Ferishta. An important difference between these and the Telugu and the Kannada literary works mentioned above must be noted here. Neither Nuniz nor any of the Muslim writers know anything about Kumararamanatha. Strangely enough they attribute the exploits of Kumara Rama to his father Kampila Raya. This fact has led some scholars to doubt the historicity of Kumara Rama altogether.

The evidence of epigraphy has, however, established beyond the shadow of doubt that not only was Kumararamanatha a historical person but most of the events mentioned in the literary works were quite authantic. Kampili Raya was, even as stated in the Kumararamana-Sangatya and other literary works, the son of Mummadi Singeya.[1] He and his father before him ruled over the country around Anegondi in the Raichur Dt. of the Hyderabad State from Doravadi in the Hospet taluk of the Bellary Dt. and he was engaged in hostilities with Ballala III[2]. Kumara Ramanatha is mantoned in the inscriptions of early 15th century; of these the Sangur inscription dated A.D. 1407 which records the raising of a *viragal* in memory of Kumara Ramanathadeva is of special importance; for Madarasa who erected the memorial stone was the grandson of Bayichaverggede, 'the *bahattara-niyogadhipati* of Kampilideva.[3] The main events of the story of Kumararama, as described in the Kannada literary works, are thus seen to be authentic, and there is no reasonable ground for doubting the historicity of Kumara Ramanatha.

A detailed historical discussion of the contents of the Kumara Ramunikatha and other works mentioned is not called for in the introduction to a popular ballad. Those that are interested in the historical investigation of the subject may refer to Kampili and Vijayanagara, the Origin of the City and the Empire of Vijayanagara, the Further Sources of Vijayanagara history Vol. I, and the early Muslim expansion in South India by Dr. N. Venkataramanayya and the Studies in the Vijayanagara History by Mr. M. H. Rama Sarma (QJMS. XX).

10, Raman St.; T'Nagar,
Madras-17.
24—1—1953.

N. Venkataramanayya.

1. LR. 46. Hampi, I M P. I. By 335.
2 EC. VII. Ci. 24; XI. Hr. 37, 86, DG. 26; VIII. Nr. 19., MAR. 1913. P. 50, 1923, No. 21.
3. EI. XXIII. p. 185

కుమారరాముని కథ

ఉపోద్ఘాతము

★

కుమారరాముని కథ జనసామాన్యముయొక్క వినోదార్థము విరచించబడిన తందనాన పాటలలో నొకటి. దీని నెవ్వరెప్పుడు రచించిరో తెలియదు. సాధారణముగా నీ తందనాన పాటలన్నియు నజ్ఞాతకర్తృకములే; కర్త యెవ్వడైనను విద్యావంతుడుగాడు; భాషా పాండిత్యము గలవాడనియు జెప్పుటకు వలనుపడదు. పాటయంతయు జనసామాన్యమునందు వాడుకయందుండు పామరభాషయందె వ్రాయబడియున్నది. పామరుల వినోదార్థము వ్రాయబడిన పాట వారికి సులభగ్రాహ్యమైన వాడుకభాషయం దుండుట ఉచితమేకదా. కథకులు కథించుట కనుకూలముగ విరచింపబడిన పాటయైనను కొన్ని తందనానపాటలవలె నిది కేవలము గేయాత్మకముగాదు. ఈ కథయందు నాల్గింట నొకపాలు వచనరూపమున నున్నది. పాటయనియు, మాటయనియు గ్రంథవిషయము రెండుభాగములుగ విభజించపబడియున్నది. పాట ఛందోబద్ధముగాదు; గణనియమము గానరాదు; యతిప్రాసములు లేవు. పాడుట కనుకూలపడునట్లు చరణములందలి మాటలలోని యక్షరములను దీర్ఘముగనో హ్రస్వముగనో ఉచ్చరించవలసియున్నది. పాటయందు కొన్ని చరణముల కొకసారి 'తందన్నతాన' యను పల్లవి కలదు. ఇట్లే మాటలమధ్య అచటనచట, 'మేలు! మేలు!' అను హెచ్చరిక కానవచ్చును. హెచ్చైన వర్ణనలుగాని పేర్కొనదగిన శబ్దార్థాలంకార విశేషములుగాని లేవు; కాని లోకోక్తులందందు పొందుపఱుపబడి యున్నవి.

భాషయందు ఒక విశేషము గానవచ్చుచున్నది. అన్యభాషలనుండి—ముఖ్యముగ పార్సీనుండి—ఎరవుతెచ్చుకొనిన మాటలనేకములిందుగలవు. వీనియందు పెక్కు ఆంధ్రమున స్థిరముగ నిలిచిపోయినవి. ఈ యెరవుమాటలలో పెక్కింటి కిప్పుడు ప్రచారమందుండు నిఘంటువులలో దావులేదు. ఇట్టివాని ననేకములను సమకూర్చి యభినవాంధ్రనైఘంటుకపితామహులు, సి. పి. బ్రౌన్ దొరగారు 'మిశ్రభాషా నిఘంటువు'ను దయారుచేసి ప్రకటించిరి. కాని ఈ నిఘంటువు ఇప్పుడు దొరకదు. అందందు కాదాచిత్కముగ గ్రంథాలయములందు దీ నిఘంటుప్రతులు నిక్షిప్తములై యున్నను అవి సామాన్యపాఠకుల కందుబాటుకావు. కావున కుమారరామునికథలో గానవచ్చు ఎరవుమాటలను మఱికొన్ని యపూర్వపదములనుజేర్చి యర్థవివరణతోగూడ గ్రంథాంతమునం దనుబంధముగ జేర్చినాడను. పాఠకుల కది యుపయుక్తముగనుండునని తలంచెదను.

గ్రంథరచనా కాలము:— గ్రంథకర్త నామధేయాదులవలె గ్రంథరచనాకాలము గూడ తెలియరాదని మీద చెప్పియున్నాడ. సూక్ష్మముగ కాలనిర్ణయము సేయుటకు వలనుగాక పోయినను భాషాస్వరూపమునుబట్టి గ్రంథరచనాకాలమును స్థూలముగ సూచింపవచ్చును.

ఇందలి వాడుక భాష మెకంజీలిఖితపుస్తకసంచయములోని తెలుగు వంటిది. గేయమందు కంటె వచనభాగమునందే భాషాసామ్య మెక్కువగా గానవచ్చుచున్నది. ఇందునుబోలి యందును పార్సీమాటలు బహుళముగ గలవు. విశేషించి అందందు కుంభిణీ (company), తుకుపు (troop), రసీదు (reciept) మొదలగు నింగ్లీషుమాట లగపడుచున్నవి. కావున నీ కుమారరామునికథ యాంధ్రభాషయందు పార్సీ ప్రాబల్యము సన్నగిలి ఇంగ్లీషుతో సంపర్కము ప్రారంభమగుచుండిన కాలమున విరచింపబడెనని తోచుచున్నది. వాఙ్మయమున తొలుదొల్త నింగ్లీషుపదములు హంస వింశతియందు గానవచ్చుచున్నవి. కావున హంసవింశతినిబోలి కుమారరామునికథయు క్రీ. శ. ౧౮వ శతాబ్ద పూర్వార్థమున విరచింపబడియుండును.

కుమారరాముని కథ ప్రాశస్త్యము:— కుమారరాముని కథ యాంధ్ర కర్ణాట దేశములు రెంటియందును ప్రసిద్ధికెక్కినది. దీనికి రెండు కారణములు గానవచ్చుచున్నవి. అతని జన్మస్థానము ఆనెగొంది భూమియందలి వసవల్లిదుర్గము; కంపిలి గంగావతి యనునది యాయూరి దేవత. ఆనెగొంది, వసవల్లి, గంగావతి యనుస్థలములు రాయచూరు మండలమునను, కంపిలి బళ్లారి మండలమునను గలవు. ఇందువలన నాతని జన్మదేశము ఆంధ్రకర్ణాటకముల కూడలియందు నెలకొనియుండినది. మఱియు నతని తండ్రియేలుబడి క్రింద నాంధ్ర కర్ణాట సీమలు రెండునుగలసియుండినవి. కావున కుమారరాముని కథ యటు కర్ణాటకమునను నిటు తెలుగుదేశమునను వాసికెక్కెను.

కుమారరాముని చరిత్ర:— కుమారరాముని వృత్తాంతము బహుభాషలందు వర్ణింపబడినది. గీర్వాణాంధ్రకర్ణాటాది భారతీయ భాషలయందును, పారసీక పోర్చుగీసు మున్నగు విదేశ భాషలయందును అతని చరిత్రకు సంబంధించిన గ్రంథములు గలవు. శాసనములనుబట్టియు నతని సంగతి కొంత తెలిసికొనవచ్చును.

(క) సంస్కృతమున కాలజ్ఞాన గ్రంథములందు—ముఖ్యముగ విద్యారణ్యకాలజ్ఞానమున—కుమారరాముని వృత్తాంత మించుకంతకలదు. విద్యారణ్యయతీశ్వరునిపేర నది రచింపబడినను దాని వాస్తవరచయిత యాతండుగాడు. పురాణఫక్కి ననుసరించి, విజయనగర సామ్రాజ్య పతనమువఱకు గల చరిత్రయందు వర్ణింపబడియుండుటచేత క్రీ.శ. ౧౭వ శతాబ్దము తుదనో యాతుతర్వాతనో వెలసిన యనామధేయుడెవ్వడో దానిని వ్రాసి ప్రఖ్యాతినిగోరి విద్యారణ్యుల కంట గట్టినట్లున్నది. కుమారరాముని చరిత్రను వర్ణించుట విద్యారణ్య కాలజ్ఞానరచయితయొక్క ప్రధానోద్దేశము గాదు; విజయనగర రాజ్యస్థాపకులైన హరిహర బుక్కరాజుల కతడాశ్రయమొసగుటచేత ఆతని విషయ మనుషంగికముగ గొంత చెప్పవలసివచ్చినది. నాలుగనుష్టుప్ శ్లోకములలో రాముని చరిత్రనంతటిని సంగ్రహపఱచినాడు.

పురా ద్వౌ పురుషా వీరా భ్రాతరా తు యశస్వినా
కోశాగార ప్రతీహారా వీరరుద్ర మహీపతేః ||

సురత్రాణేననిర్జిత్య వీరరుద్రే ధృతే తదా
ఆగతౌ యవనాక్రాన్తా వసహాయా శిలాపురాత్ ||

రామనాథం నిక్షిపాతే రాజానం కోశపాలనే
ఆహవే తం నృపం హత్వా మహాన్ధేశ్వరయోధనైః ||

తస్మి న్నపి హతే పశ్చాత్ భ్రాతరా తు యశస్వినా
జ్యేష్ఠో హరిహరో నామ కనిష్ఠో బుక్కసంజ్ఞకః|| [1]

(చ) ఆంధ్ర కుమారరాముని కథయందలి వృత్తాంతమును సంగ్రహముగ నిట్లు చెప్పవచ్చును: ఆనెగొంది భూమియందు వసవల్లియను దుర్గముగలదు. దాని గ్రామదేవత కంపిలి గంగావతి. ఆదుర్గమును వీరకంభిణి మహారా జేలుచుండెను; అతని భార్య యరియాలదేవి; ప్రధాని యాభోజి పంతులు; ఏగునులవైరి ఎనపోతుల యెఱ్ఱన్న, గజ్జమూలకువైరి గుజ్జులపాపయ, పటాని పాగారౌతు ఆతని కొలువునందలి సర్దారులు.

అరియాలదేవికి సంతు కలుగలేదు; రాజు సమ్మతినొంది శ్రీరాములవారి కొండకు సంతానము బడయగోరి తపస్సునకు బయలువెడలినది; కాని యే కారణమువల్లనో యితరదాసీల వెంటబెట్టుకొని పోయినను తనకు పుట్టింటివా రరణముగ నిచ్చిన సంగయను నామాంతరముగల నీలవేణియను దాసిని తనతోగూడ రమ్మనిపిలువలేదు. నీలవేణి దుఃఖించుచు నింటియందె యుండినది. అరియాలదేవి తపస్సు చేసి శ్రీరాములవారిని ప్రత్యక్షముజేసికొని యొక అరటిపండు దెచ్చుకొని, సుముహూర్తమున దానిపై చర్మము నుల్చి పాఱవైచి భుజించెను. ఆమె యటనుండి పోయినపిమ్మట నీలవేణి యచటికివచ్చి యా చర్మమునుగైకొని సగము తా నారగించి తక్కిన సగభాగమును గొడ్డు వీగియుండిన రాజుగారి గోడిగకు బెట్టినది. అందఱకు వెంటనే గర్భము వచ్చినది. మూడుగడియలప్రొద్దు గడచునప్పటికి అరియాలదేవికి సుపుత్రుడొక్కడు పుట్టెను. వీరకంభిణి మహారాజు బ్రాహ్మణులను పిలువనంపించి కుమారుడు పుట్టిన గడియ నక్షత్రములెట్టివో విచారించి, వారు మంచి వనిచెప్పగనె, నామకరణ మహోత్సవమును గావించి, కుమారరాము డని నామకరణముజేసి, యుచితరీతిని బ్రాహ్మణులను సత్కరించి యంపి, తాను రాయమహలునకు విచ్చేసి యచట విశ్రమించెను. ఇంతటనె కచేరియందు సర్దారులు మువ్వురు నొండొరులతో వాదులాడి పోట్లాడ దొడగిరి. అఱునూర్గురు జనము మృతినందిరి; మున్నూర్గురికి గాయములు దగిలినవి. ఈవృత్తాంతము రాజుగారి కెఱుకపడినంతటనె యతడా వైపరీత్యము దనపుత్రుడు జన్మించిన దుర్లగ్నఫలిత మనియెంచి బ్రాహ్మణు లబద్ధమాడి రనితలచి వారిని తగు రీతిని శిక్షించుటకు దనసముఖమునకు రప్పించెను; బ్రాహ్మణులు జంకక తాము జెప్పినట్లు రాజపుత్రు డుద్భవించిన లగ్ననక్షత్రాదులు శుభకరమైనవనియు, దత్కారణమున వైపరీత్యమెద్దియు గల్గజాలదనియు, కచేరీయందు నడచిన హత్యకు వాస్తవకారణ మప్పుడాపట్టణమం దెచటనో కలిగిన 'మహా చెడ్డ కార్యవాది' జన్మమనియు బల్కిరి. ఆ విషయమును పరిశోధించి కనుగొనుటకు రాజు ఆభోజీపంతులను దగు పరివారముతోగూడ పట్ణములోని కంపెను. ఈ లోపల నగరినుండి దాసీ సంగకు బుత్రుడు పుట్టెనను వార్త వచ్చినది. ఆ పిల్లవాని జన్మకాలమును విచారించిచూడగా నది కచేరియందు హత్యలు జరిగిన కాలమునకు సరిపోయినది. ఇంకసంశయమున కవకాశ మెక్కడిది? కావున వీరకంభిణి మహారాజా బాలుని వధింప నుత్తరవిచ్చెను. ఈ సంగతి సంగకు తెలియవచ్చి

1, Mack Mass, 19-1-14, p 43.

నది. దుఃఖపడుచువచ్చి బ్రాహ్మణుల పాదములపైబడి తనపుత్రుని రక్షింపుడని వేడుకొన్నది. అప్పుడు వారు దయార్ద్రచిత్తులై రాజుగారితో,

‘మహాప్రభో! చిన్నవాని జంపడము భావ్యముగాదు. నాల్గుసంవత్సరములు తల్లిదండ్రాదుల అదుపులోనుండును; నాల్గుసంవత్సరములు చదువుచెప్పు బ్రాహ్మణుని హదుపులో నుండును; తరిమ్మా నాల్గుసంవత్సరాలు సాధనజెట్టీల అదుపులోనుండును. అక్కడికి దుర్గుణముపోయి సుగుణము వచ్చును. ఇప్పుడు చిన్నవాని జంపించిన శిశుహత్య చుట్టుకొనుచున్నది’.

అనిచెప్పి వారించిరి. అంతట రాజు ఆ పిల్లవానికి పోలికరాము డని పేరుపెట్టి తనకుమారునితోగూడ నొకతొట్లలోనె యుంచి యిద్దఱ నొక్కరీతిగ పెంచవలసినదని యాజ్ఞాపించెను.

కుమారరాముడును పోలికరాముడును అన్నదమ్ములవలె పెరిగిరి. నాలుగేండ్ల యీడువచ్చినది. రాచగనరునుండి యన్నదమ్ములిరువురు పట్టములోనిబోయి ఊరివారిపిల్లలతో నాడుకొనుటకు మొదలిడిరి; పోలికరాముని దుర్గుణములు దలచూపగడగినవి. ఆతఁడు ఊరివారిపిల్లలను జంపనారంభించెను. మొదట బ్రాహ్మణవారి బాలుని, కోమటివారి కుఱ్ఱవానిని, అటువెనుక పూజారివారి పిల్లల నిద్దరిని హత్యచేసి చంపెను. పట్ణమున రద్దియైనది. అంతట రాజు అరణ్యమున నొక చదువులబడిని గట్టించి యొక బ్రాహ్మణుని వారి కుపాధ్యాయునిగ నియమించి విద్యాభ్యాసముసేయ నచటికంపెను. వారికి పండ్రెండు సంవత్సరములకు వచ్చువిద్య పండ్రెండు గడియలకె వచ్చెను; కాని బ్రాహ్మణునికి జీవనాధారమును జెడనీయక నిలుపుటకై మఱి యాఱుమాసములు చదివినదానినే చదువుచు నచటనెయుండ నిశ్చయించిరి. కొన్నిదినము ల్గడచినవి. అంత పోలికరాముఁడు బ్రాహ్మణుని మడిసంచిని దొంగిలెను. అందు బ్రాహ్మణుడు విభూతిని జపమాలికను పుస్తకమును నిక్షిప్తము జేసియుండెను వానిలో బుస్తకము మిక్కిలి విలువగలది. దానిని ‘విప్పిచూచిన మూడామడ ముచ్చట యేడామడ ఏకాంతము కూడతెలియును.’ ‘ఆ పుస్తకము చూచినగాని బ్రాహ్మణుడు భోజనము చేయుటలేదు.’ కావున బ్రాహ్మణుడు శిష్యులనిద్దరి దోడ్కొని పట్ణమునకువచ్చి రాజున కొప్పజెప్పి తనకు రావలసినజీతము బుచ్చుకొని ద్వీపాంతరములందును బర్వతములందును నుండు ‘మునీశ్వరులనుచూచి మంత్రోపదేశమై యీ జపమాలిక పుస్తకము సంపాదనచేసికొన’ బయలువెడలిపోయెను.

తరువాత కుమారరాముడు పోలికరామునితో పెద్దబజారునకుపోయి యచట నాలుస్తంభముల ఆటనాడుకొనుచుండిన పిల్లలనుగూడి యాడుకొనజొచ్చెను. పోలికరాముడు కోమటివారి పిల్లవాని నొక్కని శూద్రబాలు నొక్కని జంపెను. ఈ సంగతి రాజునకు దెలియవచ్చినంతనె అతఁడు వారిని జెట్టీల కప్పగించి సాదన నేర్చుకొనుట కొఱకు అరణ్యములోని చదువులబడినె గరిడీగమార్చి యచటి కంపెను. పండ్రెం డేండ్లకు వచ్చు సాదన వారికి పండ్రెండు గడియలకె వచ్చినది; కాని జెట్టీలకు జీవనము జెడనీయక ఆఱునెలల పర్యంతము ‘చేసిన సాదనయే మళ్లీ చేయుచు’నుండిరి. ఒకానొక దినమధ్యాహ్న సమయమున భోజన మైనపిమ్మట కుమారరాముడు నిద్రపోవుచుండఁగ పోలికరాముడు గరిడిలోనికివచ్చి యచట గూర్చునియుండిన ముప్పదిముగ్గురు జెట్టీలను తగవునకు బిలచి యిరువదినాలుగుమూరల దండపగడచేత వారినందఱిని ఒకపెట్టుగొట్టి యేకకాలమున జంపెను.

తరువాత కుమారరాముని ప్రక్కకుబోయి పరుండి నిద్రబోవువానివలె దొంగగుఱకలు పెట్టుచుండెను; కుమారరాముడు మేలుకాంచి గరిడీలోనికి బోయి యచట ఱచ్చిపడియుండిన జెట్టీలనుగాంచి యబ్బురపడి పోలికరామునిలేపి వారట్లు చచ్చిపడియుండుటకు గారణమేమని యడిగెను. తనకేమియు దెలియదని వాడు జవాబుచెప్పెను. అంతట కుమారరాముడు పాతాళగంగనుండి యుదకమునుదెచ్చి శ్రీరామనామమును స్మరణజేయుచు వారిపై జల్లెను. నిదురనుండి మేల్కొనినట్లు జెట్టీ లందఱును లేచి కూర్చునిరి. అప్పుడు పోలికరాముఁడు వారిని తాను చంపితినని చెప్పెను.

అంతకుముం దొకనాడు పోలికరాముడు దొంగిలి డాచియుండిన బ్రాహ్మణుని మడిసంచిని రహస్యముగవిప్పి పుస్తకమునుజూచెను. అందువలన తనతండ్రి వీరకుంభిణి మహారాజు కంపిలి గంగావతి పట్ణమునకుబోయి యచట మద్దెల వీరసానికూతురు మలసానిని జూచి మోహించి దానిని తనవెంట వసవల్లి దుర్గమునకు దోడ్కొనివచ్చి కన్నెరికమునకు ముహూర్తమును నిశ్చయించి యా సుదినమురాక కెదురుచూచు చుండినట్లు తెలియవచ్చెను. జెట్టీలతో బోట్లాట యైనవెనుక నొక మధ్యాహ్నమున కుమారరాముని నిద్రపోనిచ్చి పోలికరాముడు బయలుదేరి ప్రొద్దుగ్రుంకువఱకు వసవల్లి దుర్గమునుజేరెను. ఆరాత్రి యతడు గుగ్గిళ్ళ పోలిసెట్టి యింటనుండిన సర్వపదార్థమును దోచుకొని మద్దెల మలసాని యింటికిబోయి దానిముందు పోగుబోసి దానిపొందు నపేక్షించెను. మలసాని మాయలమారి. పోలికరాముని కోరికదీర్ప నొడబడినట్లు నటించి రాత్రియంతయు బ్రొద్దుపుచ్చినది. మరుసటిరాత్రి మఱలి వచ్చేదననియు బెందలకడనె ముస్తీదుజేసికొని యుండవలయుననియు జెప్పి పోలికరాముఁడు గరిడికి బయలువెడలి పోయెను.

మరుసటి మధ్యాహ్నము పోలికరాముడు తనకు తనతల్లినిజూడ గోరిక కలిగినదని కుమారరామునితో జెప్పి యతని యాజ్ఞానుసారము వసవల్లి దుర్గమునుజేరెను. ఊరివెలుపటనుండు నీళ్లబావి కడకు వచ్చియుండిన దాసీలవలన గుగ్గిళ్ళ పోలిసెట్టి తనయింట దొంగతనముపోయెనని రాజుతో మొఱపెట్టుకొనెననియు, నందులకు దొంగ నారాత్రిపట్టకున్న ముగ్గురు సరదారులను ఫిరంగీవాతబెట్టించెదనని రాజు జెప్పెననియు, నందుమీద సర్దారులు ముగ్గురును స్వయముగ దామే కావలి కాచుచున్నారనియు దెలియవచ్చెను. చీకటిపడి పట్టణమంతయు మాటుమణుగు వఱకును పోలికరాము డచటనే దాగియుండి యటుపిమ్మట పట్టణమును బ్రవేశించెను. వాకట్టు సభకట్టుగట్టి, సాక్షువిభూతి మత్తుపొడులను జల్లి పారావాండ్ర స్తబ్ధులనుగావించి దర్వాజానుదాటి రాచనగరుజొచ్చి యరియాలదేవి యాభరణాదులను దోచుకొని రాజు పడుకొని నిద్రించుచుండిన పగడపుకోళ్ల మంచముయొక్క పట్టెలను కోళ్లను ఆతనికి నిద్రాభంగముగానీక దూసికొని సర్వముమూటగట్టి యెత్తికొని మద్దెల మలసాని యింటికి బోయెను. అచటనెవ్వరును గానరారైరి. పోలికరాముడు మఱల నాటిరాత్రి వచ్చునని వెఱచి మలసాని చెలికత్తెలతోగూడ పెరటిలో దట్టముగ నల్లుకొనియుండిన కాకరపాదయందు డాగెను; కాని రాము డామెను వెదకి ఇంటిలోనికి దోడ్కొనివచ్చి నగలనన్నిటిని నామెముందు పోగుబోసెను. ఆ భూషణాదులనుజూడఁగనే మలసానికి భయము గలిగినది. అవి సామాన్యులవి కావు; పట్టమహిషి యరియాలదేవి ధరింపదగినవి; ఆమెవనుటకు సందేహములేదు; రాజునకెఱుక పడిన తన తలయె పోవును. ఆత్మరక్షణమార్గమును జింతించి యామె రహస్యముగ నరియాలదేవికి చెప్పియంపినది. గుగ్గిళ్ళపోలిసెట్టి ఇంట దొంగిలినదొంగ తనయింట వచ్చియున్నాడనియు వానిని

KUMARA RAMUNI KATHA

Edited by
Dr. N. Venkataramanayya, M.A., Ph. D.,
Reader, Indian History and Archaeology, University of Madras (Retired).

Government Oriental Manuscripts Library, Madras.

1952

PRICE Rs. 2—8—0

PRINTED AT THE
SOLAR WORKS, MADRAS-1.

INTRODUCTION

The Government of Madras took up for consideration the question of publication of the various manuscripts in different languages on subjects like Philosophy, Medicine, Science, etc., early in May, 1948. Important Manuscripts Libraries in the Madras Presidency were requested to send a list of unpublished manuscripts with them for favour of being considered by the Government for publication. The Honorary Secretary of the Tanjore Maharaja Serfoji's Sarasvathi Mahal Library, Tanjore; alone complied with this request This list as well as a similar list of unpublished manuscripts in the Government Oriental Manuscripts Library, Madras, were carefully examined and a tentative selection of manuscripts suitable for publication was made. The Government in their Memorandum No. 34913/48-10, Education, dated 4-4-1949, constituted an Expert Committee with the Curator of the Government Oriental Manuscripts Library, Madras, as the Secretary, for the final selection of manuscripts suitable for printing and for estimating the cost of publication.

The following are the members of the Committee :—

1. Sri T. M. Narayanaswami Pillai, M.A., B.L.
2. ,, R. P. Sethu Pillai, B.A., B.L.
3. ,, C. M. Ramachandra Chettiar, B.A., B.L.
4. ,, R. Krishnamoorthy, (Kalki).
5. Dr. N. Venkataramanayya, M.A., Ph. D.
6. Sri M. Ramanuja Rao Naidu, M.A.
7. ,, V. Prabhakara Sastri.
8. ,, N, Venkata Rao, M.A.
9. ,, H. Sesha Ayyangar.
10. ,, Masti Venkatesa Ayyangar.
11. ,, M. Mariappa Bhat, M.A., L.T.
12. Dr. C. Achyutta Menon, B.A., PH. D.
13. Dr. C. Kunhan Raja, M.A., D. Phil.
14. ,, A. Sankaran, M.A., Ph.D., L.T.
15. Sri Polakam Rama Sastri.
16. ,, S. K. Ramanatha Sastri.
17. Dr. M. Abdul Haq, M.A., D. Phil., (Oxon.)
18. Afzul-ul-Ulama Hakim Khader Ahamed.
19. Sri P. D. Joshi.
20. Sri S. Gopalan, B.A., B.L.
21. ,, T. Chandrasekharan, M.A., L.T.

With the exception of Sri Masti Venkatesa Ayyangar, and Dr. C. Kunhan Raja, the above members continud to be members of the Expert Committee for 1950—51 also to which the following gentlemen were added in Govt. Memo. 7297-E/50-3, Edn., Dated 19—5—'50 and Govt. Memo No. 15875-E/50-4, Edn. Dated 7—9—'50.

1. Dr. A. Chidambaranatha Chettiar, M.A., Ph. D.
2. Sri S. Govindarajulu, B.A., B.L., LL.B., BAR-AT-LAW.
3. Capt. G. Srinivasamoorthy, B.A., B.L., M.B. & C.M.
4. Dr. Muhammad Hussain Nainar, M.A., Ph. D.
5. Sri T. V. Subba Rao, B.A., B.L.
6. Principal, College of Indian Medicine, Madras.

The members of the Committee formed into Sub-Committees for the various languages, Sanskrit, Tamil, Telugu, Kannada, Malayalam, Mahrathi and Islamic Languages. They met during the month of May, 1949, at Madras and at Tanjore to examine the manuscripts and make a selection. The recommendations of the Committee were accepted by the Government and they decided to call these publications as the "MADRAS GOVERNMENT ORIENTAL SERIES," and appointed the Curator, Government Oriental Manuscripts Library, Madras, as the General Editor of the publications under this series.

The following manuscripts were taken up for publication during 1949-50

"A" From the Government Oriental Manuscripts Library, Madras.

TAMIL

1. Kappal Sattiram
2. Anubhava Vaiddiya Murai
3. Attanakolahalam
4. Upadesa Kandam
5. Colan Purva Pattayam
6. Sivajnana Dipam

TELUGU

1. Ausadha Yogamulu
2. Vaidya Nighantuvu
3. Dhanurvidya Vilasamu
4. Yoga Darsana Visayamu
5. Khadga Laksana Siromani

SANSKRIT

1. Visanarayaniyam—(Tantrasarasangraha)
2. Bhargava Nadika
3. Hariharacaturangam
4. Brahmasutravrtti—Mitaksara
5. Nyayasiddhanta Tattvamrtam

MALAYALAM

1. Garbha Cikitsa
2. (a) Vastulaksanam
   (b) Silpavisayam
3. Mahasaram
4. Kanakkusaram
5. Kriyakramam
6. Kanakkusaram—(Balaprabodham)

KANNADA

1. Lokopakaram
2. Rattamatam
3. Asvasastram
4. Vividha Vaidya Visayagalu
5. Sangitaratnakara
6. Supasastra

ISLAMIC LANGUAGES

1. Jamil-Al-Ashya
2. Tibb-E-Faridi
3. Tahqiq-Al-Buhran
4. Safinat-Al-Najat

"B" From the Tanjore Maharaja Serfoji's Sarasvathi Mahal Library, Tanjore.

TAMIL

1. Sarabendra Vaidya Murai (Diabetes)
2. Do. (Eyes)
3. Do. (Anaemia)
4. Do. (Svasakasam)
5. Agastiyar
6. Konkanarsarakku Vaippu
7. Tiruccirrambalakkovsaiyar with Padavurai
8. Talasamudram
9. Bharatanatyam
10. (a) Pandikeli Vilasa Natakam
    (b) Pururava Cakravarti Natakam
    (c) Madana Sundara Vilasa Natakam
11. Percy Macqueen's Collection of Folklore in the Madras University Library
12. Ramaiyan Ammanai

TELUGU

1. Kamandakanitisaramu
2. Taladasapranapradipika
3. Raghunatha Nayakabhyudayamu
4. Rajagopala Vilasamu
5. Ramayanamu by Katta Varadaraju

MAHRATHI

1. Natyasastra Sangraha
2. (a) Book of Knowledge
   (b) Folk Songs
   (c) Dora Darun Veni Paddhati
   (d) Asvasa Catula Dumani
3. (a) Pratapasimhendra Vijaya Prabandha
   (b) Sarabhendra Tirthavali
   (c) Lavani
4. Devendra Kuravanji
5. Bhakta Vilasa
6. Sloka Baddha Ramayana

SANSKRIT

1. Asvasastra with Tricolour illustrations
2. Rajamrganka
3. Anandakandam
4. Ayurvedamahodadhi
5. Gita Govinda Abhinaya
6. (a) Colacampu
   (b) Sahendra Vilasa
7. Dharmakutam—Sundara Kanda
8. Jatakasara
9. Visnutattvanirnaya Vyakhya
10. Sangita Darpana
11. Bijapallava

During 1950, only the Sub-committee for TAMIL, TELUGU and KANNADA met in the month of July 1950 at Madras.

The following books were taken up for publication in the various languages during 1950—51.

TAMIL

1. Datcanayanar Vaiddiya Attavanai
2. Vaiddiyak Kalanciyam
3. Anubhava Vaiddiya Murai Vol. 3

TELUGU

1. Saivacarasangrahamu
2. Anubhava Vaidyam
3. Abhinayadarpanamu

SANSKRIT

1. Arogyacintamani
2. Tattvasara with Ratnasarini
3. Sutrarthamrta Lahari
4. (a) Ratnadipika
   (b) Ratnasastra

MALAYALAM

1. Asvacikitsa
2. Phalasarasamuccya

KANNADA

1. Vaidya Sara Sangraha

During 1951-52, only the Sub-committees for TAMIL, TELUGU and MALAYALAM met in the month of April 1951. The following books were taken up for publication in the various languages.

TAMIL

1. Saptarisinadi
2. Karnatakarajakkal Savistara Caritram
3. Bharata Siddantam
4. Pillaippinivakatam
5. Anubhava Vaiddiyam Vol. 4
6. Mattuvakatam

TELUGU

1. Brahmavidya Sudharnavamu
2. Ragatalacintamani
3. Vaidyacintamani
4. Kumararamuni Katha
5. Katamaraju Katha

SANSKRIT

1. Devakeralam—Candrakala Nadi
2. Patanjala Yogasutra Bhasya Vivarana by Sri Sankaracarya

MALAYALAM

1. Kilivandusamvadam
2. Advaita Vedantam
3. Barhaspatyasutra with Malayalam commentary
4. Karanapaddhati

KANNADA

1. Sadgururahasyam

ARABIC

1. Shawakil-Ul-Hur

It is hoped that the publication of most of the important manuscripts will be completed within the next four years.

Some of the manuscripts taken for publication are represented by single copies in the Library and consequently the mistakes that are found in them could not be corrected by comparing them with other copies. The editors have, however, tried their best to suggest correct readings. The wrong readings are given in round brackets and correct readings have been suggested in square brackets. When different readings are found, they have been given in the footnotes except in the case of a few books in which the corroct readings have been given in the footnote or incorporated in the text itself.

The Government of Madras have to be thanked for financing the entire scheme of publication although there is a drive for economy in all the departments. My thanks are due to the members of the Expert Committee who spared no pains in selecting the manuscripts for publication. I have also to thank the various editors, who are experts in their own field, for readily consenting to edit the manuscripts and see them through the press. The various Presses that have co-operated in printing the manuscripts in the best manner possible also deserve my thanks for the patience exhibited by them in carring out the corrections made in the proofs.

The present work is based upon a paper manuscript preserved in the Government Oriental Manuscripts Library, Madras, described under D. No. 2516 in the Descriptive Catalogue Volume XII. The size of the volume is $12\frac{3}{8}$ x $8\frac{1}{2}$ inches. It contains 149 pages having 22 lines on a page.

This work, Kumararamuni Katha is a popular ballad written in colloquial Telugu. It gives an account of Kumara Rama, son of Vira Kumbhini (Vira Kampiliraya) who was the king of Vasavalli (Hosamale) and his battle with Asanalli Khan, King of Delhi in which Kumara Rama died, overpowered by his enemies. The name of the author is not known. This is a beautiful composition describing the valiant deeds of a hero enshrined in the hearts of the people. The work is in an easy flowing style bringing literary flavour to almost all and giving an exceptionally exciting experience of a past era. More briefly, it sings about a human episode in the tragical notes of a sub-terranian musical extravaganza It is hoped that the public, the scholars as well as the layman, will receive it warmly.

Govt. Oriental Mss. Library,
Triplicane, Madras,

T. Chandrasekaran,
General Editer.

బట్టుకొన నదియె వంచితతయనియు దెలియజేసినది. దాదు లరియాలదేవిని నిద్రలేపి యీ వర్తమాన మామెకు నివేదించిరి. అప్పుడామె తనయాభరణములన్నియు దోపిడిపోయెనని కనుగొన్నది. రాజును లేపెను; అతడు తన పగడపుకోళ్ల పట్టెమంచముగూడ పోయెనని తెలిసికొనెను. దొంగను పట్టుడని నిజపరివారమున కాజ్ఞాపించెను; పరివారము మద్దెలమలసాని మహలును జుట్టు ముట్టెను; పోలికరాము డంత దొంగిలించితెచ్చిన పదార్థము నంతటిని పెద్దమూటగట్టి వీపుపైవేసికొని, యా మూటపై మద్దెలమలసాని నెక్కించుకొని, చేత నొకపెద్ద వెదురుగడనుబూని తన్ను బట్టుకొన వచ్చిన రాజపరివారమున జాలమందిని హతముజేసెను. అంతట రాజు పోలికరాముని బట్టుకొనువారికి మూడుగ్రామములను జాగీరుగ నిచ్చెదనని ప్రకటించెను; జెట్టీల పినతండ్రులు ముగ్గురును ముందుకువచ్చి పోలికరాముని యుక్తిచేసి పట్టుకొనిరి. రాజాజ్ఞ ననుసరించి పోలికరాముని వధ్యస్థానమునకు గొనిపోయిరి; కాని కుమారరాముని యెఱుకలేక వానిని వధించుట యుక్తముగాదనియెంచి యరణ్యములోని గరిడీకడకు గొనిపోయిరి, కుమారరాముడు పోలికరాముని వధింపనీయక కట్లువిడిపించి కావు నందు నిక్షిప్తముగావించి వాని కన్నపానీయాదులకు దగిన యేర్పాటులను గావించెను. అంతట తుపాకిని తీసికొని అడవికివెళ్లి అడవిమేకను ఒకదానిని పడవేసి, దానికను గుడ్లురక్తము దొప్పనుపట్టుకొని తిరిగి గరిడికివచ్చి, జెట్టీలనుబిలచి, 'ఇవి పోలికరాముని కనుగ్రుడ్లునురక్తమునని రాజుగారికి చూపుడని చెప్పి' పంపెను. వారట్లుచేసిరి. వీరకుంభిణి మహారాజు సంతసించి తాను ప్రకటించినప్రకారము వారికి మూడు గ్రామములను జాగీరిచ్చి పంపివేసెను.

పోలికరాముడు గతించినవెనుక కుమారరాముం డరణ్యవాసము జేయవలసిన యావశ్యకతలేక పోయెను; కావున వీరకుంభిణి మహారాజు కుమారరాముని పట్టణమునకు రా నాజ్ఞాపించెను. అతడు వచ్చుచుండగా వసవల్లి దుర్గసమీపమున రాజుగారిది మదముదిగిన యేనుగుయొక్కటి యాతని మార్గమున కడ్డపడెను; కుమారరాముడు దానిజంపెను; మావటివాడాసంగతిని రాజుగారి కెఱింగింపగా నాతఁడు కోపించి కూళివాడు దున్నపోతు తనగాము సాటువను జెప్పెను. ఆ సాటువను విన్నంతనె కుమారరాముఁడు కోపము జెంది రాజుముఖము జూడనొల్లనని దేశాంతరగతు డాయెను.

మొదట కుమారరాముడు ఎఱ్ఱభూపతిరాజుపట్టణమునకుబోయి యాతని నిర్జించి, ఢిల్లీకి బదులు వసవల్లి దుర్గమునకు జమాబందికి వచ్చున ట్లేర్పాటు గావించెను; అచటినుండి తరలి సుల్తాన్ భూపతి సింగు రాజధానిబోయి యతనిగూడ నోడించి వసవల్లికి జమాబందికి రానొడబఱచెను. తరువాత ఓరుగంటికి బోయెను; ప్రతాపరుద్రు డతని నెదుర్కొని సత్కరించెను; ఎఱభూపతిరాజు సుల్తాన్ భూపతిసింగులవలె నతడును వసవల్లికి జమాబందికి రా నొప్పుకొనెను; అంతట కుమారరాముడు ఎఱభూపతిరాజు సుల్తాన్‌భూపతిసింగుల నోరుగంటికి రప్పించెను. వారువచ్చి చేరినంతట నే కుమారరాముడును ప్రతాపరుద్రుడును వారితోగూడ జమాబందికి వసవల్లి దుర్గమునకు బయలుదేరిరి.

ముందుగ వారి బాహుబలము వసవల్లిదుర్గముజేరి చుట్టును డేరాలువేయించి ఢంకాలు మ్రోయించెను. కుంభిణి మహారాజుకు దిగులుపుట్టినది. మూలబురుజునెక్కి పాఱజూచినాడు. పోలికరాముడు మృతినందెను; కుమారరాముడు దేశాంతరగతుఁడై పోయెను; పగవారు పైకొనిరి. తానొక్కడేమిచేయగలడు? ఇట్లు చింతించుచుండ జెట్టీల పినతండ్రులు రాజుకడకువచ్చి తాము

సంజీవి మంత్రప్రయోగమువలన పోలికరాముని బ్రతికించి తోడ్కొనివచ్చెదమని చెప్పిరి. వాస్తవముగ వారు చెప్పినట్లు తోడ్కొని వచ్చినచో నతనికి రాజ్యమిచ్చివేయుదనని చెప్పెను.

జెట్టీలు గరిడికిపోయి విషయమును పోలికరామునికి విశదపఱచి యాతని వసవల్లిదుర్గమునకు గొనివచ్చిరి. వీరకుంభిణిరాజు రాజ్యమును పోలికరాముని కొప్పజెప్పి శత్రులనుండి దాని రక్షించు భారము నాతనిపై మోపెను. మరుసటియుదయమున నతఁడుకోటచుట్టును దిగియుండిన ఫౌజుపైబడి నఱక నారంభించెను. వారు యుద్ధమునకు వచ్చినవారు గాకపోవుటచే, నాయుధములులేక భోజనాది ప్రయత్నములందుండిరి. కావున పోలికరాముని ధాటి కాగజాలక పరువిడిపోయి వెనుకవచ్చుచుండిన కుమారరామున కావృత్తాంతమును నివేదించిరి. అతడంతట తన శిఖామొహరును వారిచేతికిచ్చి పోలికరామునకు దాని జూపుడని నియోగించెను. వారట్లే శిఖామొహరును గొనిపోయి యతనికి జూపిరి. పోలికరాముడా శిఖామొహరును జూడగనే గుఱ్ఱమునుండి నేలకుదుమికి నడచి కుమారరామునికడు బోయి పాదాక్రాంతుఁడాయెను. కుమారరాముడు ముగ్గురు జమీందారులను వసవల్లి దుర్గమునకు జమాబందికి దోడ్కొని వచ్చితినని తమ్మునికి చెప్పెను. అందఱు నేకమై వసపల్లి జేరిరి. ముగ్గురు జమీందారులును వీరకుంభిణిమహారాజు సముఖమున జమాబంది తీర్మానము జేసికొనిరి. వీరకుంభిణి మహారాజు యథోచితముగ వారిని సత్కరించి వారి రాజ్యములకంపెను; పుత్రులకు వివాహప్రయత్నములు సేయదొడగెను.

ఢిల్లీసుల్తాను ఎఱ్ఱభూపతిపట్టణమునకు అర్థము నిమిత్తము గుఱ్ఱపుసవారులనంపెను; కాని యాతఁడు వారిని సరకుసేయ లేదు; తాను వసవల్లికి జమాబందికి పోయియుంటిననియు డిల్లికి బోనావశ్యకత లేదనియు జెప్పి వచ్చినవారికి భత్యమునైనయీక పంపివేసెను. ఈ సంగతి తెలియవచ్చినంతనె పాదుశాహు క్రోధపరవశుఁడై పండ్రెండువేల లష్కరులతోగూడపోయి హసనల్లీ ఖానుని వసవల్లిదుర్గమునుగొట్టి జమీందారులను దర్బారునకు దోడ్కొనిరమ్మని యుత్తరువుజేసెను. హసనల్లీ పాదుశాహు ఆజ్ఞానుసారము సైన్యముతో గదలివచ్చి వసవల్లిని ముట్టడించెను; కాని కుమారరాముని ధాటి కాగజాలక, యుద్ధమున దండు విశేషముగ నాశమగుటవలన హసానల్లీఖానుడు ఢిల్లీకి పాఱిపోయెను. కుమారరాముడును పోలికరాముడును అతని వెన్నంటి తఱుముచుబోయి ఢిల్లీ కోటకు బైట తాళమువేసి తాళముమీద శిఖామొహరువేసి, తిరిగివచ్చుచు ఎఱ్ఱభూపతి పట్నము ఉత్తరభాగమున చెఱువుచెంత వనములోదిగి స్నానముజేసి భోజన ప్రయత్నములు జేయుచుండిరి. అప్పుడు సీతాదేవి వారిద్దఱికంతటి బలమునిచ్చి వ్యర్థముగ జనక్షయముజేయించుటకు కారణమేమని శ్రీరాములవారి నడిగినది. అప్పుడు శ్రీరాము డాంజనేయులను బిలచి మాఱువేసమునబోయి వారి నొసటివ్రాలను దుడిచిరమ్మని యాజ్ఞాపించెను; అప్పుడు అతడు స్వామి యాజ్ఞను నెఱవేర్చి మాయమైపోయెను.

అంతట ఢిల్లీకోటనుండి దిడ్డి త్రోవగుండ బయలుదేరి హసానల్లీ, షుఖురుల్లాఖాను లిరువదివేల బలమును వెంటబెట్టుకొనివచ్చుచు, నెఱ్ఱభూపతిపట్టణముచెంత విడిసియుండిన కుమారరామ పోలికరాములపై గలపడమైరి. యుద్ధమునందన్నదమ్ములిద్దఱును నిహతులైరి. అప్పుడు స్వామివారు

పూవులరథమునంపి వారిని కైలాసమునకు గొంపోయిరి. పాచ్ఛావులుచూచి యాశ్చర్యపడి వంగి సలాముజేసిరి; వీరకుంభిణి మహారాజును దమయెదుటికి బిల్పించి యతని నూగడించి,

'జడియకుమోయి! మహారాజా
వసపల్లి భూములను
నీకు జాగీరుగ నిచ్చితిమి
నీవే యేలుకోమన్నారు'.

వీరకుంభిణి మహారాజు వసపల్లిదుర్గమునకు మఱలిపోయి పుత్రులకు దినవారములనుజేసి యనేక దానములనొనర్చి సుఖముగ రాజ్యము నేలుచుండెను.

(చ) కర్ణాటకభాషయందు కుమారరామునికథను విపులముగవర్ణించు గ్రంథములు రెండు కలవు. ఒకటి గంగయ్యకృత కుమారరామన సాంగత్య; మఱియొకటి నంజుండకృత పరదార సోదర రామనకథ. నంజుండకృతమైనది యాద్యంతములులేనిది, కుమారరామునికథను వర్ణించు గ్రంథమొకటి చెన్నపురి ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున గలదు. ఇందు వర్ణింపబడిన విషయము బల్లాలరాయలకు గుమారరామునితో జరిగిన యుద్ధమగుటచే భాండాగారాధికారులు దీనికి బల్లాళరాయనయుద్ధ మని నామకరణముజేసిరి [2]. ఒకవేళ నిదియు నంజుండకృత పరదారసోదరరామనాథుని కథలోనిభాగమై యుండవచ్చును. రెండు గ్రంథములయందును వర్ణింపబడిన విషయము వ్యత్యాసములేక యొక్కరీతిగనేయున్నది. ఇవిగాక కుమరరామునికథనుజెప్పు కైఫీయతులు రెండు గలవు. కంపిలి కైఫీయతు ఒకటి, భట్టర కైఫీయతు మఱియొకటి. వీని యన్నిటియందును చరిత్ర కుపయుక్తమగు విషయము జాలకలదు; కాని యది కల్పనాకథతో మిళితమైయుండుటవలన చరిత్రకారులు వానియందలి సత్యాసత్యములను వేర్పఱచుట యందత్యంతము జాగరూకతతో వర్తింపవలసియున్నది. బల్లాలరాయనియుద్ధమున గల్పనాకథకంటె జరిత్రాంశము హెచ్చుగనున్నది. కంపిలి రాయలకును బల్లాలరాయలకును గలిగిన వైరకారణమును, యుద్ధాంశములును వాస్తవమున కెడముగాకుండ వర్ణింపబడియున్నవి. కైఫియతులలో భట్టరు కైఫియతు శ్రేష్ఠమైనది. అందు కుమారరాముని కథ సంగ్రహముగ నతిశయోక్తులులేక వివరింపబడినది.

ప్రస్తుతము ముద్రితమగు తెలుగుకు కుమారరామునికథయందు చరిత్రాంశ మల్పము, కల్పనాకథ యధికము. చరిత్రకారుల కది యంతగ నుపయుక్తమైనది కాకపోయినను, బామరవాఙ్మయమున దానికి తావుకలదు. ఇందలికథ కన్నడగ్రంథములయందలి దానికంటె భిన్నమైనదైనను, రెంటికిని గాఢమైన పోలికలును గలవు. కావున, రెంటియందలి పోలికలను భేదములను గుర్తించుటకొఱకు కన్నడ కావ్యములలోని కుమారరామునికథను ఇట సంగ్రహముగనైన వివరించుట యవసరము.

దేవగిరి యాదవరాజుల నాశ్రయించియుండిన మలెనాటి సామంత కుటుంబములలో నొక దానికిజెందిన ఇమ్మడి సింగయయను నతడు జ్ఞాతుల పోరాటమునకు దాళజాలక దేశత్యాగముజేసి

2. Madras Government Oriental Manuscripts Library 19-2-14.

దేవగిరి పట్టణమునకుబోయి రామదేవరాయల సంస్థానమున గొలువుకు కుదిరెను [3]. చిరకాలము గడచినపిమ్మట నతని కొక నిధి దొరకెను. తరువాత నతఁడు వర్ధిల్లి సంస్థానమున బేరు ప్రఖ్యాతులు బడసెను. కంపిలి సోమేశ్వరస్వామి కృపవలన నతనికి పుత్రుడు బుట్టెను; ఆ పిల్లవానికి కంపిలిరాయ లని పేరుబెట్టి పెరిగి పెద్దవాడైనంతట నతని యంతస్తుకు దగినవిధమున విద్యాబుద్ధులుగఱపి, రామదేవరాయల నాయకులలో నొక్కడగు గుజ్జలకట్టి నాయకుని కుమార్తెను, హరిహర లేక యరియాలదేవి యను కన్యతో వివాహమొనర్చెను. అరియాలదేవి కంపిలి రాయల పట్టమహిషి. ఆమెకాక పలువురితర భార్యల నాతఁడు ద్వాహముజేసికొనెను. రన్నతాజి అనునామె యాతని భార్యలలో చిన్నది. అందగత్తె. ఆమెయందు కంపిలిరాయలకు మక్కువ యెక్కువ.

ఉత్తరాదినుండి తురకల దండయాత్ర వచ్చినది; ఢిల్లీసుల్తాను నేమియను దండనాయకుని కొకగొప్ప సైన్యమునిచ్చి దక్షిణాపథమునందలి హిందూరాజులను జయించిరమ్మని పంపెను. అతఁడు దేవగిరిదుర్గమునకు ముట్టడివేసి కైవసము జేసికొనెను.; రామదేవరాయలు బందీకృతుడై ఢిల్లీకి గొంపోబడెను. నేమి దేవగిరినుండి బయలువెడలి రామేశ్వర పర్యంతముగల దేశమునుజయించి ఢిల్లీకి మఱలిపోయెను.

దక్షిణాపథమునుండి ఢిల్లీసైన్యము వెనుదిరిగిపోయిన పిమ్మట రామదేవరాయలు చెఱజిక్కుటకు వ్యథజెంది ముమ్మడి సింగయ దేవగిరియం దుండనొల్లక తన యనుచరులతోగూడ మలెనాటికి మఱలి వచ్చి హొసెయదెర యనుచోట నెల వేర్పఱచుకొని, రాయదుర్గమును పాలించుచుండిన మల్లని దర్శింపబోయెను. అతడు సింగయను పూర్వమాతడనుభవించుచుండిన సీమకు దళనాయకునిగ నియమించి మఱి కొన్నిగ్రామముల నొసగెను. అంతట ముమ్మడిసింగయ సంతృప్తుడై హొసెయదెరకు తిరిగివచ్చి సుఖముగ కాలము గడపుచుండెను.

ఇట్లుండ రామదేవరాయలు కీర్తిశేషుఁడాయెను; దేశమందు ప్రబలియుండిన యరాజకస్థితి తన కడక కనుకూలపడగా, రామదేవరాయల మేనల్లుడు, మల్లిదేవుఁడు, సింహాసనము నాక్రమించుకొనెను; ముమ్మడిసింగయ యాతని యాధిపత్యము నంగీకరిపంలేదు; తనవలెనే యతనిచర్య నొప్పక యసంతృప్తులైయుండిన దొరల నందఱ నేకముజేసి యతనిపై నడచి యుద్ధమునందు అతని వధించెను. అటుతరువాత ముమ్మడిసింగయ స్వతంత్రుడై కొంతకాలము దనసీమను పాలించి కాలగతినందెను.

ముమ్మడిసింగయ మరణానంతరము అతనిపుత్రుని కంపిలిరాయని ప్రధాని బైచప్ప గద్దెనెక్కించెను. పట్టాభిషేకమైనపిమ్మట అచిరకాలముననె జతంగి రామేశ్వరదేవుని కృపవలన పట్టమహిషి యరియాలదేవి యొక పుత్రుని గనెను; రామేశ్వరదేవుని వరప్రసాదమున బుట్టినవాడగుటచే నాపుత్రునికి కంపిలిరాయలు రామనాథుడని నామకరణము జేసెను. తరువాత నొకప్పుడు కంపిలిరాయలు

3. పరదార సోదరరామనాథుని కథయందు ముమ్మడి సింగయ వృత్తాంతము వేఱువిధముగ నున్నది. దేవగిరిరాజు రామదేవరాయలకు నలుగురు పుత్రులుండిరి. వారియందొక్కడు పులిందస్త్రీని వివాహమాడి కులభ్రష్టుడాయెను. దేవగిరిని తురుష్కులు సాధించినపిమ్మట నతఁడు చిత్రదుర్గ ప్రభువు నాశ్రయించి యతని కొలువునుబ్రవేశించెను. అతనివంశమున ముమ్మడి సింగయ జననమందెను.

వేటకుబోయెను. అరణ్యమునం దొకానొకచోట నొకకుందేలు వేటకుక్కల నెదుర్కొని వాని మిక్కుటముగ గఱచుట గాంచెను. అది యాస్థలమహత్వమని యెఱిగి మూరానెయసంధి యను తావున కోటగట్టించి హొసమలెదుర్గమని దానికి పేరుబెట్టెను. హొసమలెదుర్గము మంచి ఆయపట్టుస్థానమున నిర్మింపబడినదగుటచేత, కంపిలిరాయ లదిమొదలు దానిని ముఖ్యనివాసస్థానముగ జేసికొని తన యేలుబడి క్రింది దొరలను నాయకులను అచటికే వచ్చిచేరు నట్లాజ్ఞాపించెను.

బలిష్ఠమైనకోటను నిర్మించినవెనుక కంపిలిరాయలు దనయేలుబడిక్రింది రాజ్యవైశాల్యమును వెంపందింప నారంభించెను ఈ కార్యమున నతని కుమారుఁడు రామనాథుఁడును ప్రధానిబైచప్పయు మిక్కిలి తోడ్పడిరి. రాముని పరాక్రమ మద్వితీయమైనది. బైచప్ప కార్యము నందెంత మేధావియో ఖడ్గమునందంత నిపుణుడు. వీరిరువురును దనకు రెండుచేతులవలె వర్తిలుచుండ కంపిలిరాయలు విజయుడగుటలో వింత యేమికలదు? మొట్టమొదట నతనికి తొరకల్లు, బాదామి, ముదుగల్లు, పానుగలుదుర్గము లొకదానివెనుక నొకటి స్వాధీనమైనవి. ఈదుర్గములు గైవసమగుటవలన కృష్ణా తుంగభద్రల నడిమి యంతర్వేదియంతయు నతని చేతిక్రిందికి వచ్చినది. తరువాత కంపిలిరాయలు కందనవోలుసీమను జయించి నిడుగలు పెనుగొండ దుర్గములను సాధించెను. ఈ విజయమువలన తుంగభద్ర యుభయతటముల రాష్ట్రమంతయు గంపిలిరాయలకు లోబడెను.

కంపిలిరాయల జోరావరితనము పరమండల ప్రభువుల క్రోధమును బ్రజ్వరిల్లజేసినది. గుత్తి పాలకుడగు జగతాపిరాయ లతని బ్రతిఘటించెను; కాని యుద్ధమునం దోడి కుమారరామునిచే బట్టువడెను; కాని కప్పముగట్టుట కొడంబడుటవలన రాముడాతని విడిచిపెట్టి నిజరాజ్యమునేల ననుజ్ఞ యిచ్చెను. ఈ విజయములవలన కంపిలిరాయలు ప్రబలుడాయెను. తత్కారణమున నతని కటు కర్ణాటకమున బల్లాలరాయలును నిటు తెనుగుదేశమున యోరుగంటి ప్రతాపరుద్రుడును శత్రువులైరి.

ఆ చిరకాలముననె కంపిలిరాయలకు గర్ణాటాంధ్రదేశాధిపతులతో బోరుపొసగినది.

బల్లాలునితో యుద్ధమునకు గారణము వేటకుక్కలు. కంపిలిరాజ్యముయొక్క సరిహద్దునం దుండిన యగ్రహారము నందొకదానియందు, మంచివేటకుక్కపిల్లలుండెను. వానిని దనకిమ్మని కుమారరాముడు చెప్పిపంపెను. బల్లాలుని యాశ్రితులగు నా యగ్రహారికు లందుకు సమ్మతింపరైరి. రాముని యనుచరు లాయగ్రహారమును బరశురామప్రీతిగావించిరి. అందుపై నిరుతెగలవారికి యుద్ధము సంప్రాప్తమైనది. బల్లాలు డోడెను. సంధిని కోరెను. బైచప్ప సలహామీద కంపిలిరాయలు సంధి కొడబడెను; కాని బల్లాలునితో సమాధానపడుటకు కుమారరాముఁ డొప్పుకొనలేదు; అతనికి తండ్రిపై గోపమువచ్చి 'బల్లాలుని నిర్మూలము జేయకమాన'నని ప్రతిజ్ఞ జేసి యచటనుండి పోయెను.

బల్లాలునితో యుద్ధమునకు సహాయ మడుగుటకు గుమారరాముడు ఓరుగంటికి బోయెను, ప్రతాపరుద్రుఁడాతని చక్కగాగౌరవించి సత్కరించెను; కాని బల్లాలునిమీద యుద్ధమునకు దోడు రాజాలననెను; కుమారరామునికి కోపమువచ్చినది; ఓరుగంటినుండి మఱలి తండ్రియాస్థానమునకు వచ్చి కాకతీయుల బిరుదుల గొన్నింటిని స్వీకరించి ప్రతాపరుద్రునిపై గయ్యమునకు గాలుద్రవ్వెను. ఈ సంగతి ప్రతాపరుద్రుని కెఱుకపడినది. అతడు దళములను సమకూర్చుకొని కంపిలి

రాయలపై దండెత్తివచ్చెను; ఘోరసంగ్రామము సంప్రాప్తమైనది. కాని ప్రతాపరుద్రుడు పరాజితుడై సంధిచేసికొనెను.

ఈ విజయవార్త చెవిసోకగనే గజపతి కపిలేశ్వరునికి భయముకలిగినది; కాని పాత్రసామంతు లాతనికి ధైర్యముసెప్పి యుద్ధమునకు బురికొల్పిరి. సైన్యముతోగూడ కపిలేశ్వరుఁడు కంపిలి రాయలపై దాడివెడలెను. కపిలేశ్వరుడు యుద్ధమునకు వచ్చుచున్నాడని తెలియవచ్చినంతనె కంపిలిరాయలును గుమారరాముఁడును దమ సైన్యమును వెంటబెట్టుకొని యతని నెదుర్కొనుటకు పెనుగొండ ప్రాంతమునకు నడచిరి; యుద్ధమున గపిలేశ్వరుఁ డోడి కంపిలిరాయలతో సంధిచేసికొనెను.

కుమారరాముని యశస్సు దశదిశల బ్రాకినది; ఢిల్లీవఱకు వ్యాపించినది. సుల్తానును ఖానమలుకవజీరులును అబ్బురపడిరి. సుల్తానుకు పెండ్లికి ఈడువచ్చిన కుమారిత యొక్కతె యుండెను; తగిన వరు నారయుటకొఱ కాతడు దేశదేశములకు నౌకర్ల నంపియుండెను; కుమారరాముని యద్భుత ధైర్యపరాక్రమములను విన్నపిమ్మట నతఁడు కొందఱు మాగధులను కంపిలిరాయలకడ కంపెను. వారు హొసమలదుర్గమునుండి వెనుదిరిగి పోవునపుడు రాముని చిత్రపటమును దమవెంట గొనిపోయిరి. దానిని గాంచినంతటనె సుల్తానుపుత్రిక రామునిమీద మరులుకొన్నది; వానిదప్ప అన్యులను బెండ్లాడనని పట్టుపట్టినది. సుల్తానంతట కంపిరాయలకు, కుమారరాముని దనయొద్ద కంపవలసినదనియు, నతనికి దనకూతునిచ్చి యుద్వాహము జేయుదుననియు, బిదురె, సాగరు, నింబాపుర, జంబుఖండి, రాయచూరు దుర్గముల నరణమిచ్చెద ననియు జెప్పియంపెను; కంపిలిరాయలు సుల్తాను సందేశమును నమ్మలేదు. అందులో మోసముగలదని శంకించి సుల్తాను కోరినట్లు రాముని డిల్లీకి నంపలేదు. సుల్తానాగ్రహపరవశుఁడై రామునెట్లైన బట్టుకొనివచ్చెదనని శపథముజేసెను. ఇట్లుండ బహదూరఖానుఁడు డిల్లీనుండి పరారియాయెను. ఇతఁడు సుల్తాను కొలువునందలి శూరాగ్రణి. ఒకానొకప్పుడు సుల్తాను దన కొలువుననున్న ఖానమలుకవజీరులలో నెవ్వడు నేర్పరియైన గురికాడో కనుగొన నిశ్చయించి వారి నందరిని బిలువనంపి మైదానమున నొకలక్ష్యమును నిలిపి దానిని భేదించినవాని కపారమైన ధనమొసగెదనని ప్రకటించెను. బహాదూరుఖా నొక్కడుదప్ప మఱియెవ్వరును లక్ష్యమును భేదింపజాలక పోయిరి. సుల్తా నతని కేడు పెద్ద పాత్రలనిండ ధనమును బెక్కుసీమల నిచ్చుటయేకాక యాతనినొక మల్లికుగ జేసెను. సుల్తాను నాశ్రయించియుండిన దొరల హృదయములయం దీర్ష్యాగ్ని రగులుకొన్నది. అతని హత్యజేసి చంపదలఁచిరి; కాని యంతకంటె సుల్తానునకు అతనియెడ ద్వేషమును బుట్టించి యతని నచటనుండి పాఱద్రోలుట యుక్తమని నిశ్చయించిరి. కొందఱు సుల్తాను కడకుపోయి బహదూరుఖానుఁడు సింహాసనముపై గన్నువేసి యున్నాడనియు నందుచే నతఁడు జాగ్రతతోనుండుట మేలనియు హెచ్చరించిరి. మఱికొందరు బహదురుఖానుని గాంచి సుల్తా నతని బహిరంగముగ నాదరించి సత్కరించినను లోలోపల జంప బ్రయత్నముసేయు చున్నాడనియు జెప్పిరి. వారిమాటలను విశ్వసించి బహాదూరుఖానుఁడు సకుటుంబముగ డిల్లీనుండి దక్షిణదేశమునకు బాఱిపోయెను. బహాదూరుఖానుని పలాయనము సుల్తాను కెఱుకపడగనే నేమి ఖానుని దండుతోబోయి యాతని బట్టితెమ్మని యాజ్ఞాపించెను. కాని యాతఁడు మార్గమధ్యమున బహాదూరుచే పరాజితుడై మఱలి వచ్చెను.

బహాదూరు ఖాను కృష్ణానదిని దాటి కంపిలిరాజ్యమును ప్రవేశించెను; కుమ్మటమునకు వచ్చి కంపిలిరాయలకు దన స్థితిగతులను దెల్పి యాశ్రయము వేడెను. బలవద్విరోధనకు జడిసి కంపిలిరాయ లాతని కాశ్రయ మొసగుటకు జంకెను; కాని కుమారరాముడు శరణాగతులను రక్షించుట రాజధర్మమని చెప్పి తండ్రి నొప్పించి బహాదూరుఖానుని సంరక్షింప నీయకొల్పెను. ఈ సమాచారము సుల్తానుకు దెలియవచ్చినది. అతనికోపము మఱియును ప్రజ్వరిల్లి, కంపిలిరాజ్యమును నిర్మూలముసేయ నిశ్చయించి ప్రచండ సైన్యముతో నేమిఖానుని గంపిలిపై దండయాత్ర సేయ నంపెను.

దండు నంపినంతటనె సుల్తానుకు జయము చేకూడలేదు; నేమి ఖానుడు కుమ్మటదుర్గమును ముట్టడించెను; కాని కుమారరామునిచే పరాజితుడై వచ్చినదారినె తిరిగిపోవలసి వచ్చెను. ఆతని పాళెమును రాముడు చూఱబట్టెను. అతని ఏనుగులు గుఱ్ఱములు రస్తు సామగ్రి ధన సంచయమును రామునికి హస్తగతమాయెను. కంపిలిరాయల శౌర్యపరాక్రమమును భరత ఖండము నందెల్ల యెడలను ప్రకటితము లాయెను; కంపిలిరాయల అధికారము పెచ్చుపెరిగెను. ఈ స్థితియందు కుమారరామునికొకగొప్ప యాపద వాటిల్లెను.

ఒకానొకప్పుడు కంపిలిరాయలు వేటకుబోయి అడవులలో కొన్ని దినములకాలము దిరుగాడుచుండెను. తండ్రితోగూడ కుమారరాముడు వేటకు బోలేదు. పట్టణమునందె సహచరులతోగూడ నతడు ప్రాసాద ప్రాంగణమున జెండాడుచుండ, నతని పినతల్లి రత్నాజి ప్రాసాదోపరితలమున నిలచి తిలకించుచుండినది; ఆమె దృష్టి నవయౌవన సంపన్నుడైన కుమారరామునిపై బర్వినది. అతని యంగసౌందర్యమున కబ్బురపడి మరులుకొన్నది; తాళజాలకపోయినది. దాసి సంగళ నంపి యా చెండు నపహరించి దాచినది; కుమారరాముని దన మందిరములోని కెలయించినది; వలపును బ్రకటించి తన హృదయతాపమును దీర్పుమని వేడుకొన్నది; కుమారరాముడు నిరాకరించి పోగా నతనిపై బగపట్టినది. ఆమె వలపంతయు వైరముగ మాఱినది.

ఇంతలోపలనె కంపిలిరాయ లరణ్యమునుండి మఱలివచ్చెను; రత్నాజి దొంగవేషము వేసి కుమారరాముడు దన్ను బలాత్కరించి మానభంగము గావించినాడని మొఱపెట్టెను; ఇక తానా పాడుబ్రదుకు బ్రదుకజాలననియు నాత్మహత్య జేసికొని దేహము దొఱగెదననియు బెదరించెను. కంపిలిరాయల హృదయమునందు క్రోధానలము రగులుకొన్నది. తన కంతటి ప్రేమపాత్రుడైనను మాతృద్రోహియైన రాముని శిక్షింపకపోవచ్చునా? కావున ప్రధాని బైచప్పను రావించి రాముని తల దత్క్షణమే కొట్టివేయింపుమని యుత్తరవిచ్చెను. రాముని జంపుటకు బైచప్పకు మనసొప్పలేదు; విషయమునంతటిని చక్కగ విచారించెను; రాముడు నిరపరాధియని తెలిసికొనెను. నిరపరాధిని దండించుటయెట్లు? అందును రాముడు సామాన్యుడు గాడు. జగదేకవీరుడు; రాజ్యమును బెంపొందించి బల్లాలుని, నవలక్ష ధనుర్ధరుల కధిపతియగు వీరరుద్రుని నిర్జించిన మేటి. డిల్లీ దళములను పటాపంచలుగావించి నేమిఖానుని వెన్నడచిన యోధుడు. దేశసంరక్షకుడు; హిందూధర్మత్రాత; మేచ్ఛులమారి; స్వాతంత్ర్యాభిమాని. కావున దనయింట నొక నేలమాళెమున రాముని దదనుచరులు నలువురితోగూడ డాచి మరణదండార్హులగు నేవు రపరాధుల శిరములను ఖండించి కొనివచ్చి కంపిలిరాయల ముందుంచి యవి

కుమారరామునియొక్కయు నతని మిత్రులయొక్కయు శిరములని చెప్పెను. కుమారరాముని శిరచ్ఛేదము విన్నంతనె దుఃఖపరవశుడై కంపిలిరాయ లా శిరములవంక దేఱిచూడ నోడెను; తత్క్షణమె వానిని దన సముఖమునుండి కొనిపో నాజ్ఞయొసగెను.

కుమారరాముని దుర్మరణము దెలియవచ్చినంతనె కంపిలిరాజ్యమున గళవళము పుట్టినది. ప్రజలందఱును రాజును దూఱ నారంభించిరి. వేగులమూలమున సుల్తానుకు సర్వమును దెలియవచ్చినది. కంపిలిరాజ్యమును జయించుటకదియే మంచితఱియని నిశ్చయించి నేమి ఖానునకు గొప్పదండిచ్చి కంపిలిరాజ్యముమీది కతనినంపెను. నేమిఖానుడు కూచిచేసివచ్చి కుమ్మటము చుట్టును ముట్టడిదిగెను. పట్టణపు జనులు భీతావహచిత్తులైరి. కంపిలిరాయలు ధైర్యము గోల్పోయెను; కుమారరాముని జంపించినందుకు చింతించెను; కాని బైచప్ప ధైర్యము చెప్పెను. కుమారరామునికి దుల్య పరాక్రముడైన రాహుతు డొకడు దనకడ నున్నాడనియు, నతడు శత్రులనిర్జించి పాఱదోల గలడనియు, యుద్ధప్రయత్నముల నేమరక జేయుట మేలనియు బ్రోత్సహించెను. కంపిలిరాయ లతని వాక్యములను విశ్వసించి కోటకొత్తళములను బలపఱచి ముట్టడికాండ్రను బ్రతిఘటించుట కావశ్యకమైన సామగ్రుల నన్నిటిని సేకరించెను.

యుద్ధము ప్రారంభమైనది. కుమారరాముడు స్వర్గసీమ నలంకరించెనను నమ్మకమువలన దురకలొక హుర్మత్తున కోటపై బడిరి. కోట వారికి గైవసమగునని తోచినది. అప్పుడు బైచప్ప కుమారరాముని మిత్రులతోగూడ నేలమాళెమునుండి వెలువరించి వారితో గలసి తురకలపై గవసెను. పోరు ఘోరముగ జరిగినది. రాముని ధాటి కాగజాలక తురకదండు యథాయథలై విఱిగి పాఱెను. నేమిఖానుడు మరల పరాజితుడై డిల్లీమార్గమును బట్టెను.

పరాజయవార్త డిల్లీకి దెలియవచ్చినది; సుల్తాను క్రోధానలము ప్రజ్వరిల్లెను. రాణివాసములతోడ గొప్ప దర్బారు చేసి కంపిలిరాయల గెలువజాలిన దళనాయకుడు దన కొలువున లేడాయని విచారించెను. మాతంగి ముందుకు వచ్చినది; కంపిలిరాయని నిర్మూలము గావింతునని శపథము జేసినది; తాంబూలము పట్టినది. మాతంగి మాదిగవారింటి యాడబడుచు; సుల్తాను అంతఃపుర సంరక్షకురాండ్రలో నొక్కతె; గొప్ప సైన్యముతో బయలుదేరివచ్చి కుమ్మటమును ముట్టడించెను. మాతంగి వచ్చుచున్నదని విని, కుమ్మటదుర్గసంరక్షణమును కుమారరామున కప్పగించి కంపిలిరాయలు హొసమలె దుర్గమునకు బోయెను; ముట్టడి ప్రారంభమాయెను; మూడుదినముల పర్యంతము యుద్ధము సాగినది; మొదటి రెండురోజుల యుద్ధమునను రామునికె విజయము గలిగెను; మాతంగి రెండు పర్యాయములు, సుల్తానుకు వశవర్తియై బహాదూరుఖాను నాతని కొప్పగించుటమేలని రామునికి రాయబారమంపినది. రాము డామెను దిరస్కరించెను. మూడవనాడు మాతంగి ప్రబలమైన ప్రయత్నము గావించినది. మొదట వెలుపటికోట పట్టుబడినది; తరువాత లోపలికోటను లగ్గలు పట్టుట కారంభించినది. ఇక కోటను సంరక్షించుటకు సాధ్యముగాదని యెఱిగి కుమారరాముడు రాజమందిరమునకు బోయెను. అప్పటికె లోపల నొకగొప్ప కుండమునం దగ్ని నాలుకలు జాపుచు భగభగ మండుచున్నది. రాణివాసస్త్రీలెల్ల దానిచుట్టును మూగియుండిరి. రాముని జూడగనె వారతని చెంతకువచ్చి సెలవడిగిరి. అతడు సెలవన్నంతటనె యందఱు నగ్నిప్రవేశ మొనర్చి తమ భర్తలకు స్వాగతమీయ స్వర్గమునకు దరలిరి.

ఇఁక రాముని కచట పనియేమి కలదు? కోట గవని దెఱపించి యనుచరులతోఁగూడ శత్రుసైన్యముపై బడి నిహతుఁడాయెను. అతని శిరమును ఖండించి మాతంగి ఢిల్లీ కంపెను; ఆ శిరమును జూడఁగనే సుల్తాను దుఃఖాక్రాంతుఁడాయెను; సుల్తాను కుమార్తె ప్రాణము విడిచెను. తరువాత రాముని శిరమును మంత్రుల సలహా ప్రకారము సుల్తాను కుమ్మఠమున కంపెను. అచట నది లింగైక్యము నందినది. కుమార రాముడు శివగణశ్రేణి గూడెను.

పై వివరింపఁబడిన ఆంధ్ర కర్ణాటక కుమారరాముని కథల నొండొంటితోఁ బోల్చిచూచిన వానికిగల తారతమ్యములు దేటపడగలవు. ప్రప్రథమమున నవి రెండును భిన్నకథలను తలంపు గల్గినను, నిశితదృష్టిచే బరిశీలించిచూచిన నవియొక్క కథయొక్క రూపాంతరములని తట్టకపోదు. మొదట కథయందు వచ్చు వ్యక్తుల విషయమారయుదము. ఆంధ్ర కుమారరాముని కథయందలి వీరకుంభిని మహారాజు కర్ణాటక కథలోని వీర కంపిలి మహారాజే కాని యన్యుఁడుగాడు. కుంభిణి కంపిలికి యాభాసరూపము; వీరకుంభిణి మహారా జేలినది విరూపాక్షి ఆనెగొంది భూమి; రాజధాని వసవల్లి దుర్గము; కంపిలి గంగావతి యనెడు పట్టణములతనియేలుబడిలోనివి. కంపిలిరాయల రాజ్యముగూడ నచ్చటిదే. అతని ముఖ్యదుర్గము కుమ్మఠము; రాజధాని హొసమలె దుర్గము. ఇదియె తరువాత వసవల్లియాయెను. మఱియు కంపిలిమహారాజు పట్టమహిషివలె కుంభిణిమహారాజు పట్టపుదేవి పేరును అరియాలదేవియే. ఇద్దఱును సంతానములేక దేవుని (జతంగి రామేశ్వరునైననేమి శ్రీరాములవారినైన నేమి) దపముచే మెప్పించి పుత్రుని బడసిరి. ఇద్దఱును, ఏ దేవుని వరమువలన పుత్రుని గనిరో ఆ దేవుని పేరనే యతనికి కుమారరాముడని నామకరణము గావించిరి. ఆంధ్ర కుమారరాముని కథయందలి కుమారరామునివలె కర్ణాటక కథలోని కుమారరాముడును శూరశిఖామణియె; తండ్రియొక్క శత్రుల నెల్ల బోర జయించి యతనికి పేరుదెచ్చినవాడే; కాని యతఁడు జయించిన శత్రువుల విషయమున రెండు కథలకును గొంత వ్యత్యాసము గానవచ్చుచున్నది. కర్ణాటక కథయందు పేర్కొనబడిన గుత్తి గంగరాజు మొదలగు చిల్లర శత్రువుల ప్రస్తావము తెలుగు కథయందు లేదు; మఱియు ప్రబల శత్రుఁడగు బల్లాలరాయ ప్రతాపరుద్ర ఢిల్లీ సుల్తానులలో మొదటి యాతనికి దెలుగు కథయందు తావులేదు; అతనికిబదులు ఎఱ్ఱభూపతిరాజు సుల్తాన్ భూపతిసింగులను నిద్దఱు ప్రభువులు పేర్కొనబడి యున్నారు. ఇందు ఎఱ్ఱభూపతిరాజు కుంభిణి మహారాజు రాజ్యమునకు దక్షిణమునను సుల్తాన్ భూపతిసింగు పశ్చిమునను రాజ్యము సేయుచుండినట్లు చెప్పబడినను వారేదేశములను బాలించుచుండిరో, వారి రాజధాను లెవ్వియో తెలియదు. ఓరుగంటి ప్రతాపరుద్రుఁడును ఢిల్లీసుల్తానును ఆంధ్ర కర్ణాటక కథలకు సామాన్యులే; ఇట్లే రెండు కథలయందును గానవచ్చు వ్యక్తి మఱియొకటి కలదు. అది సంగళి; తెనుగు కథయందు దానికి నీలవేణియను నామాంతరముండినట్లును, దానిని హరియాలదేవి కాపుట్టింటి వారరణ మిచ్చినట్లును జెప్పియున్నది. ఇట్లు అరణమిచ్చిన దాసియైనను హరియాలదేవి కేలనో దానియందు స్పర్ధ కలిగినది; కర్ణాటక కథయందు సంగళకు నీలవేణి యను నామాంతరము లేదు; అచట నది యరియాలదేవి సపత్నియగు రత్నాజికి జెలికత్తెగ పేర్కొన బడినది. కుమారరాము నెలయించి రత్నాజి మందిరమునకు దోడ్కొని పోయినది సంగళయే.

కర్ణాట కుమారరాముని కథయందు వచ్చు తక్కిన ప్రధానపాత్ర లాంధ్ర కథయందు రావు.

ప్రధాని బైచప్ప, కాటణ్ణ, రత్నాజి, బహాదూరుఖాన, నేమిఖాన మున్నగువారల ప్రస్తావము తెనుగు కథయందు లేదు. బైచప్పకు బదులు ఆభోజి పంకులిందు ప్రధాని పదమునకు నియుక్తుఁడాయె. ఇతఁడు ప్రధాని దుస్తులు దొడుగుకొనిన యంబేద; ప్రధానికుచితమైన గుణము లితనికి లేవు. న్యాయముమీద దృష్టిలేదు; పోలికరాముని దుష్కృత్యములవలన పీడితులైన జనుల నదలించి బెదరించి నూఱు రూపాయలిచ్చి వారి నోరుమూయుటయందె యితనికిగల శక్తిసామర్థ్యములు వినియుక్తమైనవి. బైచప్పకును నితనికిగల భేదము హస్తిమశకాంతరము. పోలికరాముఁడు గాటణ్ణస్థలమును తెనుగు కథయందలంకరించినాడు. కాటణ్ణ కంపిలిరాయల కుమారుడని యొకచోటను పెంపుడుకొడుకని మఱియొకచోటను కర్ణాటక కథయందు జెప్పబడి యున్నది. కాటణ్ణ శూరుఁడు, పితృభక్తుడు గుణవంతుఁడు. కార్యఖడ్గములందు కుమారరాముని దక్షిణహస్తము; పోలికరాముఁడు దాసీపుత్రుఁడు; దుర్మార్గుఁడు; అనృతవాది; దౌర్జన్యప్రియుఁడు, దొంగ, హంత. అతనివల్ల రాజునకు అపకీర్తియు గుమారరామునికి కళంకమును గల్గినవి. కర్ణాటక కథయందలి కుమారరాముడు సత్యప్రియుడు; ఉదారుఁడు; ఆర్తత్రాణ పరాయణుడు; తెనుగు కథయందలి కుమారరాముఁడు పోలికరాముని దుష్కృత్యములందు భాగస్వామి. అతఁడు స్వయము అనృతవాదియు, దొంగయు, హంతయుగాక పోవచ్చును. కాని పోలికరాముని రాజు కోపమునకు గుఱికానీక తప్పించుటకొఱకు బొంక వెనుదీయలేదు; ఊరివారి పిల్లలను పోలికరాముఁడు జంపుచుండినను వారింపక గన్నుల జూచుచుండెను; పూజారి వారి బిడ్డలను వట్టివాగులో బాతిపెట్టుటకు దోడ్పడెను; రాజుచే శిక్షితుఁడైన దొంగను డాచెను; కావున నతని నడవడిక నిష్కళంకమైనదికాదు. రత్నాజి తెలుగు కథకందు రాకపోయినను మద్దు మలసాని యామెకు గ్రీనీడ యని చెప్పనొప్పును; రాజున కది భార్య కాదు, వలచి తెచ్చుకొనిన భోగకాంత; కుమారరామునితో దానికి సంబంధము లేకపోయినను పోలికరాముని హృదయమును చూఱగొన్నది. మలసానికొఱకే యతఁడు దొంగిలినది. ఆత్మరక్షణార్థమది పోలికరాముని చౌర్యము నరియాలదేవి కెఱుకపఱచినది. కర్ణాటక కథయందు రత్నాజి పాతివ్రత్యమును జెఱచెనని రాజు కుమారరామునికి మరణదండన విధించిన, ఇందు దొంగిలినందుకు పోలికరాముని వధింప నాజ్ఞాపించెను; అందు బైచప్ప కుమారరాముని నేలమాలెమునడాచి సంరక్షించిన నిందు కుమారరాముడు పోలికరాముని కావున దాఁగురించి కాపాడెను. ఆంధ్ర కర్ణాట కుమారరాముని కథం లదలి ఇతివృత్తమిట్లు భిన్నముగ గాన్పించినను, వానికి గాఢమైన పోలిక లేకపోలేదు.

ఇఁక నీ రెండు కథలలో నేది వాస్తవమో కనుగొనవలసి యున్నది; కాని వాని వాస్తవికతను పరిశీలించుటకుముందు చరిత్ర గ్రంథములలో గానవచ్చు కంపిలిరాయ వృత్తాంతమును దెలిసికొనుట యుక్తము. న్యూని జను పోర్చుగీసు వర్తకుఁడు కృష్ణదేవరాయల కాలమున విజయనగరమునకు వచ్చి యుండెను; అప్పుడతఁడు జనశ్రుతివలన దెలియవచ్చిన కంపిలిరాయ వృత్తాంతమును దాను రచించిన విజయనగర చరిత్రయందు సంగ్రహముగ జెప్పియున్నాడు.

(త) తోగామామిద (మహమ్మదు తుఘ్లూకు) అను తురుష్కరాజు ఢిల్లీని పాలించుచుండెను. క్రీ. శ. ౧330 వ సంవత్సరమున నతడు గుజరాతు దేశమును జయించెను. అప్పుడు నగుంది నదీ

(తుంగభద్ర) తటమున నగుంది యను పట్టణమున హిందూరాజొకడు రాజ్యము సేయుచుండెను. అతని రాజ్యమును జయింప దలచి గొప్ప సైన్యముతో గుజరాతు దేశమునుండి బయలుదేరివచ్చి బాలఘాటు రాజ్యమును జయించి యా రాజ్యమునకును నగుంది రాష్ట్రమునకును మధ్య ప్రవహించుచుండిన దుట్టి నదిని దాటి నగుందిపై నడచి యా పట్టణమునకు ముట్టడివేసెను. డిల్లీసుల్తాను బలాతిశయమునుగాంచి యచట నతనితో బోర సదనుశక్తి చాలదని యెఱిగి నగుందిరాజు తన రాజధానిని త్యజించి బలిష్ఠమైన క్రిన్మటదుర్గమునకు బోవుట యుక్తమని తలచెను. నంగుది యందలి యేబదివేల ప్రజలకును క్రిన్మటమున దావులేదనియు, వలసిన భోజన సామగ్రి చాలదనియు దలంచి ముఖ్యుల నైదువేలమందిని మాత్రము వెంటబెట్టుకొని యచటికిబోయి చేరెను; కాని సుల్తాను సైన్యములు దరువాత యల్పకాలమున నచటికి వచ్చి యా దుర్గమును సైతము ముట్టడించెను; ఇంక శత్రువులకు స్వైవసము గానీయక కోటను గాపాడుట సాధ్యముగాదని యెఱిగి నగుందినుండి తాను దోడ్కొనివచ్చిన యైదువేల మందిని సమక్షమునకు రప్పించి, తన యేలుబడిక్రింది రాష్ట్రమంతటిని దురికలాక్రమించిరనియు, దన స్వాధీనమందు మిగిలియున్న దా కోట యొక్కటియే యనియును, వస్తుసామగ్రియంతయు ఖర్చుపడిపోయెననియు, మహమ్మదీయులతో బోరి రణరంగమున నిహతుడగుటకు దాను సిద్ధపడితిననియు, దనతోగూడ యుద్ధమునకు నడువ సంసిద్ధులై యుండవలసినదనియు జెప్పెను. వారంద రేకగ్రీవముగ దమ యంగీకారమును దెల్పిరి. అంతట రాజిట్లనెను:—— ‘రణరంగమున శత్రువుల నెదుర్కొనుటకు ముందు, మనము ఆలుబిడ్డలపై కత్తిదూయవలసి యున్నది; వారిని శత్రువులచే జిక్కనిచ్చుట మేలు గాదు. తొలుదొల్త నేను నా భార్యాపుత్రులను జక్కబెట్టెదను’. అప్పుడు కోటవెలుపలి పెద్ద మైదానమునం దంతఃపుర కాంత లందఱును నిలచియుండిరి; రాజు తన చేతితో నేబది భార్యలను గొందఱు పుత్రులను బుత్రికలనువధించెను; అతని యనుచరులందఱును అట్లే తమ భార్యలను యుద్ధము సేయజాలని పసిబాలులనుబట్టి వధించిరి.

భయంకరమైన మారణకర్మ ఇట్లు ముగియగనే కోట బోరుకల్పులను దెఱచిరి; శత్రువులు దక్షణమ కోటలో ప్రవేశించి యొక గృహమున డాగియుండిన నాల్గురు జనులనుదప్ప తక్కిన వారి నందఱిని వధించిరి. 4

న్యూనిజు తోగామామిడితో యుద్ధముజేసి నిహతుడైన రాజుపేరు చెప్పలేదు; కాని యతని రాజధాని నగుంది పట్టణమనియు ముఖ్యదుర్గము క్రిన్మటమనియు దెల్పినాడు; నగుంది యానెగొంది; క్రిన్మటము కుమ్మఠము. వీరకంపిలి (కుంభిణి) మహారాజేలినది యానెగొంది భూమి యనియు నతని ముఖ్యదుర్గము కుమ్మఠమనియు నాంధ్ర కర్ణాట కుమారరాముని కథలవలన విదితమగు చున్నది. న్యూనిజు పేర్కొనిన నగుంది రాజు వీరకంపిలిరాయలగునేమో విచారింతము.

(ప) ఈ విషయమునునిశ్చయించుటకు ఈ సామీ విరచిత ఫుతూహు స్సలాతీ నను డిల్లీ సుల్తానుల చరిత్ర చాలావఱకు దోడ్పడగలదు. ఈ సామీ జన్మస్థానము డిల్లీ పట్టణము. క్రీ. శ. ౧౩౨౬–౨౭ వ సం॥ న సుల్తాన్ మహమ్మదు బిన్ తుఘ్లకు తన రాజధానిని డిల్లీనుండి దేవగిరికి మార్చినపుడు డిల్లీ వాస్తవ్యు లనేకులవలె నతడును దేవగిరికి వచ్చి యందె స్థిరముగ నిలచిపోయెను.

4. Nnniz, Forgotten Empire pp. 291-95

క్రీ. శ. ౧౩౪౭ వ సంవత్సరమున గుల్బర్గయందు బహమనీ రాజ్యమును స్థాపించిన సుల్తాన్ అల్లావుద్దీన్ హసన్ గంగూ బహమనీ కత డాశ్రితుడు. క్రీ. శ. ౧౩౫౦ వ సం॥ నం దనగా కంపిలి రాజ్యము నశించిన యిరువది నాలుగవ సంవత్సరము నం దతడు తన ఫుతూహు స్సలాతీ నను చరిత్రను వ్రాసి ముగించెను; కావున నతడు కంపిలిరాజ్య వినాశన కాలమున డిల్లీయందును మరుసటి సంవత్సరమునుండి దేవగిరియందును నివసించుచుండిన సమకాలిక రచయిత. అతని చరిత్రయందు గానవచ్చు కంపిలి వృత్తాంతము వాస్తవ మని మనము గ్రహింపవచ్చును.

అల్లావుద్దీన్ ఖిల్జీ కడపటి రోజులలో దేవగిరి యాదవరాజ్యమును డిల్లీ సామ్రాజ్యమందు గల్పుకొని మల్లిక్ నాయబు కాఫూరును దాని కి పాలకుని గనియమించెను. అతడు దేవగిరి జేరిన పిమ్మట రామదేవుని యేలుబడి క్రిందనుండిన రాజ్యమునంతటిని తన యధికారము క్రిందికి దెచ్చుకొనుటకు ప్రయత్నమొనర్చెను. ఒకానొకప్పు డతడు కుమ్మఠము పైకెత్తిపోయి యొక వారము రోజు లచట నాగెను; చుట్టుప్రక్కల దేశమును పాడుచేసి దుర్మార్గులను నిర్మూలము గావించి మఱల యాతడు దేవగిరి జేరెను. మల్లిక్ నాయబు కాఫూరు కుమ్మఠమును ముట్టడించి నప్పు డచట నెవ్వరు రాజ్యము సేయుచుండిరో ఈ సామీ చెప్పలేదు; కాని యతడు కంపిలిరాయలని నిస్సంశయముగ జెప్పవచ్చును. మఱియు మల్లిక్ నాయబు కాఫూరు కుమ్మఠమును ముట్టడించెనేకాని సాధింపలేదు; కావున నతడు పరాభూతుడై వెనుకకుదిరిగిపోయెనని మన మనుకొనవచ్చును.

సుల్తాన్ మహమ్మదు బిన్ తుఘ్లకునకు మేనత్త కుమారుడు బహావుద్దీన్ గర్షాస్పుడను నతడు కృష్ణాతటమందలి సాగరుప్రాంతము నేలుచుండెను; అతడు గొప్ప శూరుడు. మొగలాయి యుద్ధములందు పరాక్రమ ప్రదర్శనమువలన పేరు ప్రఖ్యాతులను సంపాదించెను. అతడు డిల్లీ సింహాసనము నధిష్ఠింపగోరి రాజద్రోహమును దలపెట్టెను. సుల్తా నతనిపై దండంపి గోదావరి యుద్ధమున పరాభూతుని గావించెను. డిల్లీ సామ్రాజ్యము నందుండిన దనకు ప్రాణములు దక్కవని బహావుద్దీను దన యాలుబిడ్డలతోగూడ కృష్ణనుదాటి కంపిలిరాజ్యమును ప్రవేశించి, కుమ్మఠమున కరుదెంచి కంపిలిరాయని దర్శనము జేసికొని శరణము వేడెను. కంపిలుం డాతనికి దన రాజధానియం దాశ్రయమొసగి మిక్కిలి సౌహార్దముజూపి, ‘ఓయి! ధైర్యవంతుడా! నీవు పరాజయము నందినందులకు శోకాగ్నికిం ధనముగావలదు. యుద్ధమునం దపజయము నందని ప్రభువెందును లేడు; లోకమర్యాద యట్టిదె కదా; కొన్ని సమయము లందచల ధైర్యముతో నిలువ వలెనగును; మఱికొన్ని యెడల శత్రులకు వెన్నుజూపి పాఱిపోవలసివచ్చును. యావజ్జీవమును ఒక్కస్థితి యందె యుండగల జను లరుదు. వీరోత్తమా! నా రాజ్యమునకు భవదీయాగ మనము క్షేమకరమే. సూర్యచంద్ర గాయత్రుల సాక్షిగను నే గొలుచు దైవము సాక్షిగను నిన్ను సంరక్షించెదను. ఈ ప్రపంచ జనులందఱు నేకమై నీపై వచ్చినను నీకు గోరంత యేనియు గీడొనర్పజాలరు, దుఃఖింపకుము; నిరపాయ స్థలమునుజేరితివి. సంతోషస్వాంతుడవై సుఖముగ నుండుము’ అని యూరడించెను.

కొన్ని రోజులు గడచినవి; సుల్తాను సైన్యములు సముద్రమువలె నుప్పొంగివచ్చి కుమ్మఠ దుర్గము నావరించినవి సుల్తాను డిల్లీనుండి వచ్చి దౌలతాబాదు చేరెను. అహమదు అయాను మల్లికు జాదను దన సముఖమునకు రప్పించెను. మల్లిక్ రుక్ నుద్దీను, మల్లిక్ కుత్బుల్ ముల్కు లను

వారి నాయకత్వము క్రింద రెండుమారులు, సైన్యములను గుమ్మటముపై నంపెను; కాని రెండు పర్యాయములును సుల్తాను సైన్యములు ఓటమందినవి; మూడవ పర్యాయము సుల్తాను మల్లిక్ జాదనే స్వయముగ నా దుర్గముమీది కంపెను; మల్లిక్ జాద సూటిగ గుమ్మటమునకు గూచిచేసిపోయి ముట్టడి వేసెను. కంపిలుడును గర్షాస్పుడును రెండుమూడు పర్యాయములు కోట వెలువడివచ్చి పరాజితులై మరల కోటకు బోయిరి; తరువాత మల్లిక్ జాద కోటను లగ్గలుపట్ట బ్రయత్నము జేసెను. మహమ్మదీయ సైనికులు విజృంభించి యెల్లయెడలను గాన్పించుచు, ఖడ్గసహాయులై కోట తలుపుల నెట్టుకొని లోపల బ్రవేశించిరి.

కంపిలుడును గర్షాస్పుడును కోట యన్యాక్రాంతమగునని తెలిసికొని యచటినుండి బయలువెడలి పర్వతారణ్యముల దారి బట్టిరి. సుల్తాను సైన్యము వెన్నంటి తఱుమ నారంభించినది; మిక్కిలి శ్రమపడి యెట్లో హొసదుర్గమునజేరి యొక నెలదినములు పోరిరి; ఒకనాడు శత్రుసైన్యమంతయు నొక్క హుమ్మత్తున కోటపై బడెను; భూమి యంతయు గళగళపడినది; వాతావరణము దుమ్ముతో నిండిపోయినది. ఈ వైపరీత్యమునకు జడిసి గర్షాస్పుడచటినుండి పాఱిపోవుట యుక్తమని తలచెను. రెండుమూడు గుఱ్ఱములను జేర్చికట్టి కోటక్రిందికి దోల్కొనివచ్చి వానిపై దన స్త్రీలను గూర్చుండబెట్టి, తాను వేఱొక గుఱ్ఱముపైనెక్కి యచటినుండి పాఱిపోయెను. మిత్రత్రాణ పరాయణుడగు నా హిందువు కంపిలుడు శూరధర్మమును వీటిబోనీక యచటనె నెలకొనెను. మిత్రుని యాపద యతని నెత్తిపై బడినది. అతని కుటుంబము శావరించినది. కాని యతడు జంకుగొంకులేక శత్రువుల నెదుర్కొని ఘోరముగ బోరాడెను; చిట్టచివర కాతడు శూర పురుషోచితమైన రణశయ్యనలంకరించెను; హేతిఘాతలచే నతని దేహము విరియబూచిన గులాబిపొదవలె శోభాయమానముగ గన్పట్టెను.

సుల్తాను సైనికులు కోటను బ్రవేశించి యందలి ధనధాన్యాది పదార్థములను చూఱగొన నారంభించిరి. హిందువు లనేకులను వధించిరి. కొందఱను బందీకృతుల జేసిరి; ఒక్కొక్కభటుడును ధనము మిక్కుటముగ సేకరించెను. మల్లిక్ జాద హొసదుర్గమును గైవసము గావించుకొనుచుండగా నాతని సముఖమునకు సజీవుడైన హిందువునొక్కని బట్టితెచ్చిరి. యుద్ధనిహతులైన హిందూ వీరుల శిరముల నొక్కొటొక్కటి నాతని ముందుబెట్టించి యా శిరములెవ్వరివో గుర్తింపవలసినదని యతనికాజ్ఞాపించెను; వాని గాంచినప్పుడా హిందువునకు గలిగిన దుఃఖమును వర్ణించుట కలవిగాదు. అమ్మపోట్లచే నెఱ్ఱబారిన యొక శిరమును జూడగనే యతడు గొల్లున నేడ్వసాగెను. దుఃఖాతిశయముచే నతడు నెత్తిపై మట్టిబోసికొని తలవెండ్రుకలను బీకివేసెను. అప్పుడు, 'ఏల యింతటి క్షోభ; ఎవ్వరి తల యిది? నీ యేడ్పునకు గారణమేమి?' యని మల్లిక్ జాద యతని పృచ్ఛించెను. మిక్కుటముగ నేడ్చుచు నా హిందువు, 'ఎవ్వరి మరణమువలన మా దిగులును దుఃఖమును బెంపొందినవో ఆ మారాజు తల యిది', అని బదులు చెప్పెను. అది వినగనె 'ఆ శిరము చర్మము నొలిచి పైడి పల్లెమున బెట్టుడు, శత్రు గుండెలు బ్రీలుగాక, మిత్రుల హృదయము రంజించుగాక,' యని మల్లిక్ జాద పలికెను. 5

5. The Futuh-us-Salatin (Madras Edn.) pp 33-34, 420-31

ఈ సామీవలె కంపిలిరాయ చరిత్రను వర్ణించిన సమకాలిక మహమ్మదీయ రచయిత మఱియొకడు గలడు. ఇతడు ఇబ్నె బత్తూతాయను యాత్రికుడు. ఇతడు మొరాకో జనపద వాస్తవ్యుడు; మహమ్మదీయ ప్రపంచమును జూచు వేడ్కతో నిబ్నెబత్తూత మాతృభూమిని విడిచి నానా దేశముల గ్రుమ్మరిలుచు క్రీ. శ. ౧333 వ సం|| మున హిందూదేశమునకువచ్చి యది మొదలు క్రీ. శ. ౧3౪౨ వఱకును డిల్లీ పట్టణ కాజీగ సుల్తాన్ ముహమ్మదు బిన్ తుఘ్లూకు కొలువునందుండెను. అవ్వల సుల్తానతనిని చైనా దేశమునకు రాయబార మంపెను. ప్రపంచయాత్ర ముగించుకొని యతడు నిజదేశమునకు బోయినపిమ్మట తన యనుభవములను వర్ణించుచు నొక గ్రంథమును రచించెను. ఇబ్నె బత్తూతా గ్రంథమున గానవచ్చు కంపిలిరాయల వృత్తాంతము సంగ్రహముగ నిచట బొందుపఱచు చున్నాడను.

సుల్తాన్ (ఘియాజుద్దీన్) తుఘ్లూకునకు బహావుద్దీన్ గుస్టాస్పను నొక మేనల్లుడుండెను; సుల్తానతనినొక మండలాధిపతిని గావించియుండెను. అతడు తన మేనమామ కాలగతి నందిన పిమ్మట నతని కుమారుని యాధిపత్యము నంగీకరింపక నిరాకరించెను. గుస్టాస్ప ధైర్యశాలియైన యోధుడు, శౌర్యసంపన్నుడు. సుల్తాన్ (ముహమ్మదు బిన్ తుఘ్లూకు) మల్లిక్ మజీరు, వజీరు ఖ్వాజా జహాను మున్నగు సుప్రసిద్ధ దళనాయకుల నతని శిక్షించుటకై పెద్ద సైన్యముతోగూడ నంపెను. ఇరువాగుల అశ్వదళములును దారసిల్లెను. భయంకరమైన యుద్ధము సంప్రాప్తమాయెను. ఇరుపక్షములవారును నసాధారణ పరాక్రమముజూపి పోట్లాడిరి. కాని కడపట విజయము సుల్తాను సైన్యమునకు జేకూడెను; బహావుద్దీను రాయ్ కంపిలుడు అను హిందూరాజుకడకేగి యతని నాశ్రయించెను. క్రైస్తవులందువలె హిందూ ప్రజలయందును 'రాయ' శబ్దమునకు రాజను నర్థము చెల్లును; కంపిల యనునది యతడేలు దేశము పేరు. ఈ ప్రభువేలు దేశము దుర్గమపర్వతారణ్యమయము; అతడు ప్రముఖ హిందూ నరపాలకులలో నొక్కడు.

బహావుద్దీను కంపిలిరాయలకడకు పాఱుతెంచెను; వెనువెంటనె అతని దఱుముచు వచ్చినవి సకల భారతావనీ నాథుని బలములు. కోటలో సేకరించియుండిన ధాన్యమంతయు వ్యయమైపోయినది. శత్రువు లేనిమిషమునందైన లగ్గలు బట్టవచ్చును. తనకు సంప్రాప్తమైన విపత్తును జక్కగ గ్రహించినాడు కంపిలిరాయడు; కావున నతడు బహావుద్దీనుని బిలచి, 'మా దుస్థితినిజూచుచున్నావు కదా; నా కుటుంబముతోడను ననుచరులతోడను నిచట ప్రాణముల నర్పించుటకు నిశ్చయించినాడను. (ఒక హిందూరాజుపేరుజెప్పి) నీవు ఫలాని సుల్తానుకడకు బొమ్ము; అతని నాశ్రయింపుము. అతడు నిను సంరక్షింప దక్షుడు' అని చెప్పి యాతని కడకు దోడ్కొనిపో నొక భృత్యునిచ్చి పంపించెను.

తరువాత కంపిలిరాయలొక గొప్ప గుండమునం దగ్నిని బ్రజ్వరిల్లజేసి తన పదార్థమంతటిని నందువైచి తగులబెట్టెను. అతని భార్య పుత్రికలతో నిట్లనెను. 'నేను చచ్చుటకు సిద్ధపడినాడను; నా మార్గము ననుసరించుటకు మీలో నెవ్వరికైన నిష్టమున్న నట్లు చేయవచ్చును'. అటుపిమ్మట నతని భార్యలందఱును స్నానమొనర్చిరి; ముకసరి చందనమును దేహముల కలదుకొనిరి; ఒక్కరొక్కరుగవచ్చి కంపిలిరాయల పాదములముందు సాగిలబడి మ్రొక్కి లేచిపోయి యగ్నిగుండమునందుఱికి యందఱును మసియైరి. అమీరులు వజీరులు దొరలు మున్నగువారి కాంతలెల్లరును రాజస్త్రీల ననుగమనించిరి; సామాన్య స్త్రీ లనేకులట్లే మడిసిరి. రాజువంతు వచ్చినది; అతడును స్నానమాడి దేహ

మునకు చందనము నలదుకొనెను; కవచమును విసర్జించి కైదువులను ధరించెను. అతనితోగూడ చావునకు సిద్ధపడిన యనుచరులెల్ల నట్లే చేసిరి. తరువాత, కోటను వెలువడి సుల్తాను సైన్యముపై బడిరి; గతాసువులై నేలగ్రాలువఱకు శత్రులతో బోరి యందఱును నిశ్శేషముగ నిహతులైరి. సుల్తాను పౌజులంతట పట్టణముపై గవిసి యచటి జనుల బందీకృతుల గావించెను; కంపిలిరాయని పుత్రులేకాదశ సంఖ్యాతులు బట్టువడిరి. వారిని సుల్తానుకడకంప వారందఱిని బలాత్కరించి యతఁడు మహమ్మదీయ మతమున గలిపెను". 5

న్యూనిజు ఈసామి యిబ్నెబత్తూతాలు చెప్పు కంపిలిరాయ వృత్తాంతమును వివరించినాడను. న్యూనిజు చెప్పినది యనుశ్రుతముగ జనానీకమందు పరంపరగ వచ్చుచుండిన గాథ; ఆంధ్ర కర్ణాట కుమారరాముని కథలవంటిదే. న్యూనిజు కృష్ణరాయల సమకాలికుఁడని పై నుడివి యున్నాఁడను. కావున యతఁడు గ్రంథస్తము చేసిన కథ క్రీ. శ. ౧౬ వ శతాబ్ద పూర్వార్థమున విజయనగర ప్రాంత దేశమున వాడుకయందుండెనని చెప్పవచ్చును.

ఈసామీ యిబ్నె బత్తూతాలు కంపిలిరాయలకు సమకాలికులు. కాని తాము వర్ణించిన యంశములను వారు ప్రత్యక్షముగ జూచియుండలేదు. ప్రత్యక్షానుభవము దమకు లేకపోయినను, ప్రత్యక్షానుభవముగల వారినడిగి సంగ్రహించిన చరిత్రాంశములను వారు గ్రంథస్తము గావించిరి. కావున వారు చెప్పు వృత్తాంతము సత్యాత్మకమని మన మంగీకరింపవచ్చును. కాని వీరు వర్ణించిన కంపిలిరాయ చరిత్ర సంపూర్ణమైనది కాదు; కంపిలిరాయ చరిత్రను జెప్పుట వారి యుద్దేశము గాదు; బహావుద్దీన్ గర్షాస్పు వారి యభిమానమునకు పాత్రుడైన వీరుడు; అతని యుదంతమున కానుషంగికముగ వారు కంపిలిరాయాఖ్యానమున జెప్పవలసి వచ్చినది; కావున బహావుద్దీనుకు కంపిలిరాయలతో సఖ్యము గుదిరినప్పటినుండియే యతని కథను వారు వివరించిరి. అతని పూర్వ చరిత్రతో గాని కుటుంబ వృత్తాంతముతో గాని వారికి బనిలేదు. కావున కంపిలిరాయల చరిత్రను సంపూర్ణముగ దెలిసికొనుటకు వారి రచనలు తోడ్పడవు. 7

న్యూనిజు చెప్పు కంపిలిరాయ వృత్తాంతము సైత మసంపూర్ణమైనదే; మఱియు కొన్ని ముఖ్యాంశములయందతని కథ సమకాలిక మహమ్మదీయ రచయితలు చెప్పు దానికంటె భిన్నముగ నున్నది. (1) కంపిలిరాయలపై సుల్తాను పండ్రెండు వర్షములనుండి యుద్ధము సల్పుచుండెనని

6. Foreign Notices of South India, pp. 216-17.

7 మల్లిక్ నాయబు కాఫూరు కంపిలిపై దండువెడలి దేశమునంతయు పాడుగావించి యొక వారముదినములు కుమ్మటదుర్గమును ముట్టడించి వెడలిపోయెనని ఈసామీ వక్కాణించి యున్నాడు; కంపిలిరాయని కొడుకులు పదునొక్కరు తండ్రి మరణానంతరము తురకలచే బందీకృతులై బలవంతముపై మహమ్మదీయమతమును స్వీకరించిరనియు వారియందు నస్ర్, బఖ్తియార్, అబు ముస్లిమను ముగ్గురును దనకు మిత్రులనియు నిబ్నెబత్తూతా వచించియున్నాడు; కాని వారి పూర్వ హిందూ నామములను దెలుపలేదు; కావున వారిని ఆనవాలుబట్టి గుర్తించుటకు వీలుగాదు. ఇట్లు మహమ్మదీయ లిరువురును కంపిలిరాయల పూర్వచరిత్రకు సంబంధించిన యంశమునొక్కరును పుత్రుల విషయ మొక్కరును వచించియున్నను నందుమూలమున కంపిలిరాయల చరిత్ర విదితమగుట లేదు.

న్యూనిజు వ్రాయుచున్నాడు. 7 ఇందు కొంత సత్యము లేకపోలేదు. మల్లిక్ నాయబు కాఫూరు మహారాష్ట్ర ప్రాంతమును దేవగిరినుండి పాలించుచుండినప్పుడు కంపిలిరాజ్యముపై దండెత్తిపోయి కుమ్మటదుర్గమును ముట్టడించి యుండెను కదా! ఈ ముట్టడి రామదేవుని మరణానంతము క్రీ. శ. ౧౩౧౪-౧౫ లో నడచినది. ముహమ్మదు బిన్ తుఘ్లూకు కంపిలిరాయని వధించి హొసమలదుర్గమును సాధించినది ౧౩౨౬-౨౭వ సంవత్సరమునందు. కావున సుల్తాను కంపిలిరాయలపై బండ్రెండు సంవత్సరములుగ యుద్ధ సల్పుచుండెనని చెప్పవచ్చును. కాని ఇట్లు యుద్ధము సాగించిన సుల్తానొక్కఁడు కాఁడు. మల్లిక్ నాయబు కాలమున ఢిల్లీని పాలించుచుండినది అల్లావుద్దీను ఖిల్జీ; కంపిలిరాయని జంపి యతని రాజ్యము నాక్రమించినది ముహమ్మదు బిన్ తుఘ్లూకని పై జెప్పియున్నది కదా. ఈ మధ్యకాలమున ఢిల్లీ సింహాసనముపై నలుగురు సుల్తానులు గూర్చుని రాజ్యపాలన మొనర్చిరి. వీరి యందెవ్వరును కంపిలిరాయలతో యుద్ధముజేసి నట్లగపడదు. (2) ఢిల్లీసైన్యములు మొదట పైకొని వచ్చినప్పుడు కంపిలిరాయ లానెగొందియం దుండె ననియు, నచట నిభాయింపజాలక కుమ్మటమునకు బోయెననియు, నచటనే సుల్తాను దళములచే నిహతుఁడాయెననియు న్యూనిజు వ్రాసియున్నాడు. ఇది ఈసామీ వ్రాతకు ప్రత్యక్ష విరుద్ధము. మొదట కంపిలిరాయ లొకటి రెండు మాసముల పర్యంతము కుమ్మటమున ముట్టడి నిలచెననియు, నచట నుండుట క్షేమకరముగాదని యెంచి యవ్వల హొసదుర్గమునకుబోయి యచటనే తన వెంటవచ్చి యా కోటను సైతము ముట్టడించిన ఢిల్లీ దళములచే నిహతుడాయెననియు ఈసామీ పల్కుచున్నాడు. (3) తురకలచే బరాజయముగల్గుట నిశ్చయమని యెఱిగిన పిమ్మట గంపిలిరాయలు దన యంతఃపుర కాంతల నేబదిమందిని బిడ్డలతో స్వయముగ దెగటార్చెనని యున్నది; కాని యిబ్నెబత్తూతా కంపిలిరాయల యంతఃపుర స్త్రీలెల్ల రగ్నిప్రవేశ మొనర్చిరని వ్రాసియున్నాడు. వీరిలో నెవ్వరు చెప్పునది సత్యమో నిర్ధారించి కనుగొనుటకు దగిన సాక్ష్య మన్యత్ర లభ్యము గాకపోయినను, యర్వాచీనుల సాక్ష్యముకంటె సమకాలిక సాక్ష్యము గరము విశ్వాసపాత్రమను చరిత్రపరిశోధన సిద్ధాంతము ననుసరించి న్యూనిజు వాక్యములకంటె ఈసామి యిబ్నెబత్తూతాల మాటలె సత్యాత్మకములని యంగీకరించుట యుక్తము.

ఈసామి యిబ్నెబత్తూతా న్యూనిజు గ్రంథములవలెగాక కన్నడ కుమారరాముని కథ కంపిలిరాయని చరిత్రను సంపూర్ణముగ వర్ణించుచున్నది. కాని పై గ్రంథములవలె నది చరిత్రయుగాదు, ప్రపంచపర్యటన వృత్తాంతమునుగాదు. జనానీకమును వినోదపెట్టుటకొఱకు రచియింపబడిన పాట. అందు చరిత్రాంశములతోపాటు మిథ్యాకల్పనలును గలవు. ఈసామి ప్రభృతుల గ్రంథములలో వర్ణింపఁబడిన కంపిలిరాయల కృత్యములన్నియు నిందతని పుత్రుఁడగు కుమారరాముని కారోపింపబడి యున్నవి. కావున తొలుదొల్త వాస్తవముగ కంపిలిరాయలకు గుమారరాముఁడను పుత్త్రుఁడుండెనో, ఉండిన నతఁడు తండ్రి ఖడ్గమునకు గర్తయై యతని యుద్ధకార్యములను నిర్వహించెనో కనుగొనుట యుక్తము. ఏలన, కుమారరామునికథ యెంతవఱకు సత్యమో యందుమూలమున దెలియగలదు. కుమారరామునికథ ప్రకార మతనితో బోరాడిన శత్రులు ముగ్గురు, హొయ్సళ బల్లాళుఁడు, ఓరుగంటి ప్రతాపరుద్రుఁడు, ఢిల్లీసుల్తాను. ఈముగ్గురును కంపిలిరాయలతో బోరినట్లు అన్య చరిత్రాధారముల వలన దెలియ వచ్చుచున్నది. కుమారరాముఁడు రాజ్యాధిపతిగాఁడు ; కంపిలిరా

7. Nuniz, Forgotten Empire p. 294

యులకు యువరాజు; తండ్రిపక్షమున అతడు పై మువ్వురు శత్రులతో బోరెను; కావున వారితో గంపిలిరాయలు చేసిన యుద్ధములును కుమారరాముని యుద్ధములును భిన్నములై యుండజాలవు; తండ్రియు బుత్త్రుడును నేకకాలముననె వారితో బోరియుండవలయును. కావున బై శత్రువులతో గంపిలిరాయల యుద్ధము జేసినట్లు తెల్పు నన్యాధారములందు గుమారరాముడు పేర్కొనబడి యున్నాడేమో చూతము.

(జ) కంపిలిరాయ బల్లాలరాయుల యుద్ధప్రస్తావము హొయ్సల ముమ్మడి బల్లాలదేవుని శాసనములం బెక్కింటియందు కలదు.

క్రీ. శ. ౧౩౦౩ వ సం|| నాటి యొకానొక మైసూరు శిలాశాసనమున దేవగిరి రామచంద్ర దేవుని సేనాధిపతి కంపిలదేవుడు చిత్రదుర్గము జిల్లాలోని హొలాల్కెరె మీది కెత్తిపోయి బిమ్మట నకల్లు దుర్గాధ్యక్షుడును, ముమ్మడి బల్లాళుని బావమరదియునగు సోమెయదండనాయకుని వధించి నట్లు చెప్పియున్నది [8]. క్రీ.శ. ౧౩౨౦ సం|| నాటి మఱియొక శిలాశాసన ప్రకారము ముమ్మడి వీరబల్లాళుడు దుర్రై వాడికి, వీరకంపిలి దేవునిమీదికి, దన సర్వసైన్యములతో గూచిచేసి పోయెను. యుద్ధము నడచెను, గాని దాని పర్యవసాన మిట్టిదని నిశ్చయించి చెప్పుటకు వీలులేదు [9]. ఒకవేళ బల్లాళుడు పరాజితుడై వెనుకకు మరలిపోయెనేమో. కాలము దెలియని యింకొక శిలాశాసనమున ముమ్మడి బల్లాలుడు వీరకంపిలిదేవునిపై నెత్తిపోయి బళ్లారి మండలమునందలి సిరుగుప్పకడ దండుదిగెను; యుద్ధము జరిగినది; బల్లాళుని దళనాయకులు కొందఱు నిహతులైరి [10]. క్రీ. శ. ౧౩౨౫ నాటి యొక శిలాశాసనమున బల్లాళునికిని వీరకంపిలదేవునకును యుద్ధము జరిగినట్లును నందెవ్వరో శూరుడొకడు రణనిహతుడైనట్లును జెప్పియున్నది. [11] ఇట్లిన్ని శాసనములందు కంపిలిరాయ బల్లాలరాయల యుద్ధము ప్రస్తావింపబడియున్నను కుమారరాముని మాట యెందును గానరాదు. కుమారరాముని కథవలె ఫుతూహుస్సలాతీను మున్నగు సమకాలిక గ్రంథములు ఢిల్లీ సుల్తానుతో గంపిలిరాయుని కడపటి యుద్ధమును నతని మరణమును వర్ణించుచున్నను, కుమారరాముని బేర్కొనవు. కాకతీయ ప్రతాపరుద్రుడు కంపిలిరాయలతో బోరాడినది సత్యమని యాంధ్ర వాఙ్మయము రుజువు సేయుచున్నది. శ్రీనాథుడు కాశీఖండ పీఠికలో బ్రతాపరుద్రుని మంత్రియగు ప్రోలయ యన్నయను,

'వీరరుద్రాశేష విశ్వంభరాధీశ పృథుల దక్షిణభుజాపీఠమనగ
తే|| యవనసంహార విలయ కాలాగ్ని యనగ
ధాటి విఘటిత కుమ్మట కోద్యానుడనగ
విశ్వలోక ప్రశస్తుడై వినుతికెక్కె.'

అని నుతియించియున్నాడు. మఱియు బ్రతాపరుద్రుని సామంతులలో నొక్కడైన కొటికంటి రాఘవుడు కంపిలిరాయుల నోడించెను.

8. MAR 1913, p. 50, EC. XI. Hr. 106
9. EC. VIII. Nr 19
10. MAR 1923. No. 12
11. EC. XII. Tp. 24

'నమితారి తాత పిన్నమహీవిభుండు
ఘన శౌర్యుడౌ కొటికంటి రాఘవుని
గనియె నతండు సంగ్రామంబునందు
రాజిల్లు కంపిలిరాయ సైన్యముల
దేజంబు మెఱయంగ దెగువమై గెలిచి
గరిమెగైకొనియె నగ్గండరగూళి
బిరుదంబు సరినృపుల్ బేర్కొని పొగుడ.'

ఇందును కుమారరాముని ప్రస్తావనలేదు. కన్నడ కుమారరాముని కథయందు అతడు రెండు పర్యాయములు ఢిల్లీసుల్తాను సైన్యముల నోడించి తఱుమగొట్టెననియు, మూడవపర్యాయము వారు మరల వచ్చి కుమ్మటమును ముట్టడించగా వారిని జయించుట యసాధ్యమని యెఱిగి యతడు మిత్రానుచరులతోగూడ చావునకు దెగించి యుద్ధమునకు బో సంసిద్ధుడాయెననియు, నతనిచే ననుజ్ఞగొని యంతఃపుర స్త్రీలెల్ల రగ్ని ప్రవేశము జేసిరనియు, నవ్వలనాతడు శత్రుసైన్యముల పైబడి పోరాడి వారిచే జచ్చెననియు, నతని శిరమును ఖండించి ఢిల్లీ సేనాధిపతి సుల్తానుకడ కంపెననియు జెప్పియున్నది. ఈ యంశము లన్నియు సమకాలిక మహమ్మదీయ రచయితలగు నీ సామీయిబ్నెబతూతాలచేతను వక్కాణింపబడెను. ఇంచుక వ్యత్యాసముతో న్యూనిజుగూడ వీని వచించియున్నాడు. వీరందఱీ సందర్భమున గంపిలిరాయలనే పేర్కొనెదరుకాని కుమారరాముని పేరైన నెత్తరు. కావున కుమారరాముడు వాస్తవమైన చారిత్రక పురుషుడా లేక కల్పితుడా యను సంశయము గల్గుచున్నది.

కుమారరాముని వాస్తవికతను స్థాపింపదగిన సమకాలిక సాక్ష్యములేకపోయినను, తరువాత శాసనములలో గుమారరాముని ప్రస్తావము గొంతకలదు. శకాబ్దము ౧౩౫౨ (క్రీ.శ. ౧౪౩౦) నాటి యొక శాసనమున నిమ్మడి దేవరాయల, యనుచరుడు పుట్టగడె యను నతడు సకలికెనాడు లోని కొళవలి యనుస్థలమునకు వచ్చిన శత్రుసైన్యమును నెదిర్చి కుమారరామనాథు నంతటి పరాక్రమము జూపి యంబుల గూడై స్వర్గమును జూఱగొనెనని యున్నది. [12] ఇంతకంటె ముఖ్యమైనది శకాబ్దము ౧౩౨౬ (క్రీ. శ. ౧౪౦౪) నాటి సంగూరు వీరగలు శాసనము. దీనిని కంపిలరాయల బాహాత్తర నియోగాధిపతియు, బతికార్యధురంధరుడును నగు బయిచయ ప్రెగ్గడ మనుమడును, సేనాధిపతి సంగముని పుత్రుడును నగుమాదరసు కుమార రామనాథదేవరకు స్మారకచిహ్నముగ నెత్తించెను [13]. శాసనములు రెండును కంపిలిరాయల నిర్యాణానంతరము నూఱేండ్ల లోపల వ్రాయబడినవి. వీని మూలమున రణనిహతుడైన కుమారరాముడను శూరుడొకడుండెనని క్రీ. శ. ౧౫ వ శతాబ్ద ప్రారంభమున శివమొగ్గధార్వాడ జిల్లాల ప్రజలు నమ్ముచుండిరని తెలియవచ్చుచున్నది. ఈరెండు జిల్లాలును గంపిలిరాయల యేలుబడిక్రింద నుండినవె. మఱియు సంగూరు శాసనము నెత్తించిన మాదరసు కంపిలిరాయల ప్రధాని బయిచప్ప మనుమడగుటచే నతడు బ్రతిష్ఠించిన కుమారరామనాథదేవర కంపిలిరాయల పుత్రుడె కావలయును. కావున కుమారరాముడు చారిత్రకపురుషుడనియు, బరాక్రమశాలియై యుద్ధమున మృతినొందెననియు నొప్పుకొనవచ్చును; అతని జంపిన శత్రువు ఢిల్లీసుల్తానే

12. EC. VIII. Tl. 23
13. EI. XXIII p. 185

కావచ్చును; కాని కుమారరాముని కథయందాతనిగూర్చి చెప్పినదంతయును సత్యమని యంగీకరించుటకువీలులేదు. అందు చరిత్రాత్మకములుగాని యసత్యములు పెక్కుగలవు. ఇందు ముఖ్యమైనవాని నిచట వివరించుట మంచిది.

(1) కుమారరామునిపై ఢిల్లీ సుల్తాను కుమారిత వలపు: కుమారరామునకు బ్రతిపక్షియైన సుల్తాను మహమ్మదు బిన్ తుఘ్లూకు. అతనికి సంతతి లేదు. కావున నతనిపుత్రిక కుమారరాముని వలచి యుద్వాహమాడగోరుట గగనకుసుమము బరిమళించి నట్లున్నది. ఈ కథకు సుల్తానీకల్యాణముతో జ్ఞాతిత్వ సంబంధము గలదు. ఢిల్లీ సుల్తాను కుమారిత శ్రీరంగనాథుని ప్రతిమనుజూచి మోహించి ఢిల్లీనుండి శ్రీరంగమునకువచ్చి యాదేవు నుద్వాహమాడుట యెంత సత్యమో యిదియు నంతసత్యమె. రెండును గల్పిత కథలనుటకు సంశయములేదు.

(2) రత్నాజి వృత్తాంతము: ఇది ప్రాచీనగాథ. మాఱుదల్లి దనసవతికొడుకు పై మరులుగొని యతనిచే దిరస్కృతయై మగనితో నతఁడు దన్ను నిర్బంధించెనని చాడి చెప్పి చంపించు కథ యూరిపిడీసు నాటినుండియు బ్రపంచమున జెల్లుబడి యందుండినదియె. భారతదేశమున నది రత్నాంగి సారంగధరుల కథయై వఱలినది. జనానీకము నాకర్షించుట కొఱకు ఈ కథను కుమారరామున కంటగట్టినారు కర్ణాట కవులు.

(3) మాతంగి: ఢిల్లీ సుల్తానుయొక్క అంతఃపుర రక్షక స్త్రీలలో నిది యొక్కతె. పేరు తెలియదు. జన్మముచే మాదిగ దగుటచే మాతంగి యన బఱగినది. మహమ్మదీయ మతమును స్వీకరించెనెమో తెలియదు. నేమిఖానుఁడు రెండుమారులు కుమారరామునిచే బరాజితుఁడై ఢిల్లీకి దిరిగిపోగా, సుల్తాను కోపోద్దీపితుఁడై నిజ రాణివాస స్త్రీలతోగూడ దర్బారునకువచ్చి సభచేసెను. ఖానమలుకవజీరు లెవ్వరును నతని దేఱిచూడ వెఱచిరి. గజవాంగను బట్టుటకు రాజుకడ దాంబూలమునుగొన జను బోగము రంగసానివలె ముందుకువచ్చినది మాతంగి కుమారరాముని దాను జంపెదనని శపథము జేసి. చెప్పినంత పనిచేసినది. కుమ్మఠముపై నెత్తిపోయి కుమారరాముని యుద్ధమున జంపి యతని తలనుగొట్టి ఢిల్లి కంపినది.

ఇదియంతయు గల్పనా కథ. కన్నడ కుమారరామునికథ యందుతప్ప మాతంగి కథ మఱియెచ్చటను గానరాదు. పదునాల్గవ శతాబ్దారంభమున ఢిల్లీసుల్తానుల కొలువున మాదిగవారికి తుల్యులైన పరవలను నధమజాతివారుండిరి. ఈకులమునకు జెందినవాడే ఢిల్లీ సింహాసనము నాక్రమించి నాలుగు నెలలకాల మాసామ్రాజ్యమును బాలించిన నాజీరుద్దీనను పట్టాభిషేక నామముగల ఖుస్రూఖానుఁడు. కాని యాజాతికిగాని మఱియేజాతికిగాని జెందిన యువతి యెవ్వతెయు ఢిల్లీ సేనాధిపత్యము వహించినట్లు తెలియదు. కావున మాతంగి కల్పిత స్త్రీయని దృఢముగ జెప్పవచ్చును. కాని వాస్తవముగ కుమ్మఠముపై మూడవపర్యాయ మెత్తివచ్చి కంపిలిరాయని యుద్ధమున జంపి యతని తలనుగోసి ఢిల్లి కంపినవాడు అహమదు అయాసు ఖ్వాజా-ఇ-జహానుఁడని ఈసామి గ్రంథమున గలదు. ఇతడు మహమ్మదు బిన్ తుఘ్లూకుయొక్క ప్రధాన వజీరుఁడు.

మఱియు కేవల కల్పనా కథలు గాకపోయినను నసంగతములును నబద్ధప్రాయములైన సన్నివేశములు గొన్నికలవు. ఇందువచ్చు వ్యక్తులును వర్ణింపబడిన యంశములును జరిత్రాత్మకములే. కాని వానిసంఘటన సత్యమైనదికాదు. కుమారరామ కపిలేశ్వరగజపతుల యుద్ధమిట్టి కైతవ చరిత్రాంశములలో ప్రధానమైనది. కుమారరాముఁడు వర్ధిల్లినది క్రీ. శ. ౧౪ వ శతాబ్ద ప్రథమపాదమునందు. క్రీ.శ. ౧౩౨౭ వ సంవత్సరమున కుమ్మఠదుర్గ పతన మప్పు డతఁడు తెగటాఱెను. కపిలేశ్వర గజపతి క్రీ. శ. ౧౪౩౫ వ సంవత్సరమున సింహాసనము నధిష్ఠించి ౧౪౭౦ పర్యంతము ప్రజాపాలనమొనర్చెను. వీరిద్దరికి మధ్య నూఱేండ్ల కాలమున కధికమైన యెడము గలదు; కావున వీరిరువురికి యుద్ధము జరుగుట యసంభవము. నేమిఖానుని వృత్తాంతముగూడ నిట్టిదే. నేమిఖానుఁడు చారిత్రక పురుషుడుగాఁడు; కల్పితవ్యక్తి. కాని యతనివని యెన్నబడిన కార్యము లన్నియు వాస్తవముగ జరిగినవే; కర్తమాత్ర మొక్కఁడుగాడు. అల్లావుద్దీను ఖల్జీ దేవగిరి యాదవరాజ్యము పై దండువెడలి నప్పటినుండి మహమ్మదు తుఘ్లూకు కుమ్మఠమునకు ముట్టడివేయువఱకును ఢిల్లీ సేనాధిపతుల కుపలబ్ధమైన విజయములన్నియు నతనికి దగులగట్టబడినవి.

ఇట్లు అసత్యములును నసంగతములగు గాథలతో నిండియున్నను, కన్నడ కుమారరాముని కథ చరిత్రకారున కత్యంతోపయుక్తమైనది. కంపిలిరాజ్య చరిత్రము నామూలాగ్రముగ వర్ణించు గ్రంథము వేఱొక్కటి కానరాదు. అందు వివరింపబడిన ముఖ్యాంశము లన్నియు వాస్తవముగ నడచినవే.

కంపిలిరాజ్య స్థాపకుఁడు ముమ్మడి సింగెయ నాయకుఁ డనియు, నతఁడు దేవగిరి రామదేవ రాయల నాశ్రయించి యుండిన సామంతుఁడనియు, నతనికి కంపిలి సోమేశ్వరదేవుని వరమున కంపిలి రాయఁడను పుత్రుఁడు బుట్టెననియు గుమారరాముని కథయందు గలదు. శాసనము లిదియంతయు సత్యమని రుజువుసేయుచున్నవి. క్రీ. శ. ౧౨౮౦ సం॥న నిల్పిన శిలాశాసనమున నొకదానియందు, రామదేవరాయల నాయకులలో కురుగోడును పాలించుచుండిన చౌండరసను వాడు దొరవాడి యందుండు ముమ్మడి సింగెయనాయని మీదికెత్తిపోయి యుద్ధమున మడిసె నని యున్నది.[14] ఆసంవత్సరమునందె వ్రాయించిన మఱియొక శిలాశాసనమున ముమ్మడి సింగెయనాయకుఁడు ... మ్మలూరకల్లు అను దుర్గమునకు ముట్టడివేసెననియున్నది;[15] అప్పటిదె మఱియొక శాసనమున ముమ్మడి సింగెయనాయకుఁడు వెతండకల్లనుచోట సంగెయనాయకుఁడను వానితో యుద్ధముజేసినట్లు చెప్పియున్నది.[16] శ్రీ వీర రామ దేవరాయలు రాజ్యము పాలించుచుండగా ముమ్మడి సింగెయనాయకుని కుమారుఁడు ఖండెయరాయఁడు క్రీ. శ. ౧౩౦౦ సం॥న, పూర్వముకృష్ణకందార భూభుజు డిచ్చిన హరిహర అగ్రహారమును పునరుద్ధరించినట్లు అచటి శాసనమువలన దెలియవచ్చుచున్నది [17]. పంపాక్షేత్రమున ప్రసన్నవిరూపాక్షస్వామి యాలయమున వ్రాయించిన యొక శిలాశాసనమున ముమ్మడి సింగెయనాయకుని పుత్రుఁడగు వీరకంపిలిదేవుడు తనతల్లి మాదానాయకితి పేరను సింగెయనాయకుని పేరను పరమెయనాయకుని పేరను లింగ ప్రతిష్ఠగావించెననియున్నది [18]. ఈశాసనములవల్ల

14, EC. VII. Ci. 24
15. EC. XI. Hr. 86
16. EC. XI. Hl. 37
17. EC. XI. Dg. 26
18. L. R. 46, VR. I Ap. 335

కంపిలిరాయనిపుట్టుకనుగూర్చి కుమారరాముని కథయందు జెప్పిన సంగతి వాస్తవమైనదని తెల్లమగు చున్నది 19.

కుమారరాముని కథయందు జెప్పినట్లు కంపిలిరాయలకు బల్లాళునితోడను ప్రతాపరుద్రుని తోడను వైరము గల్గుటయు, వారితో నతడు యుద్ధముసేయుటయు నిజమే. హొయసల ముమ్మడి బల్లాలుని శాసనములును ఆంధ్రవాఙ్మయమును వీని యాదార్థ్యమును రుజువు సేయుచున్నవి. ఢిల్లీసుల్తాను తోడి పగయు నిజమే; కాని ఈపగకు కుమారరామునికథయందు రెండు కారణములు చెప్పఁబడినవి. మొదటిది సుల్తాను కుమారితను గుమారరాముఁడు పెండ్లాడ నిరాకరించుట. ఇది కల్పన యని ముందుచెప్పియున్నాను. సుల్తానుకు సంతతియే లేనప్పుడు, అతని కుమార్తె రాముని వరించుటయు నతఁడామె నుద్వాహమాడ నీయకొనక పోవుటయు దత్కారణమున సుల్తానతనిపై బగబూని దండు వెడలుటయు నసంభవము. కంపిలిరాయఁడు బహాదరుఖానుని కాశ్రయమిచ్చుట రెండవది. ఇది మొత్తముమీద నిజమనియే చెప్పవచ్చును. బహాదరుఖాను సుల్తాను సామంతులలో నొక్కఁడనియు, నతఁ డస్త్రవిద్యయందు దననేర్పు జూపినందుకు మెచ్చి సుల్తానాతని కపారధనమిచ్చి బహూకరింప, నీర్ష్యాళువులై ఖానములుకవజీరు లెల్లను కుట్రలుబన్ని వారిరువురకును మనస్పర్థగల్గించిరనియు, నందుమీద బహాదరుఖానుఁడు ఢిల్లీనుండి కుమ్మఠమునకు బాఱిపోయి కంపిలిరాయని శరణు వేఁడెననియు, గంపిలిరాయ లందు కంగీకరింపగా సుల్తాను కతనిపై గోపమువచ్చి దండువెడలెననియు

19. కొందఱు చరిత్రకారులు క్రీ. శ. ౧౪ వ శతాబ్దప్రారంభమునం దానెగొంది ప్రాంత భూమిని జంబుకేశ్వరరాయలు అను రాజేలుచుండెననియు నతని జయించి ముహమ్మదు బిన్ తుఘ్లూకాదేశమును ఢిల్లీ సామ్రాజ్యమున గలుపుకొనెననియు వ్రాసియున్నారు. (*See*, B. Suryanarayana Row, *Never to be Forgotten Empire pp.* 10-13, Ch, Virabhadra Rao, *Andhrula Charitramu p.* 315). వీరి వ్రాతలకాధారము రాయవంశావళియును ఆనెగొంది జమీందారుల పూర్వచరిత. రాయవంశావళి యందా దేశము నీక్రింది రాజులుపాలించినట్లు చెప్పియున్నది: నందమహారాజు (క్రీ.శ. ౧౦౧౪—౧౦౩౬); ఇతని కొడుకు చాళుక్యమహారాజు (౧౦౭౬—౧౧౧౭); అతని కొడుకులు కల్యాణపురమును పాలించిన బిజ్జల మహారాజు, తండ్రి యనంతర మానెగొందిని (౧౧౧౭ నుండి ౧౧౫౬ వఱకు) పాలించిన విజయధ్వజుడు, విష్ణువర్ధనుఁడు. విజయధ్వజుడు తనపేర విజయనగరపట్టణమును నిర్మించెనట. విజయధ్వజుని కుమారుఁడు అనువేమఁడు (౧౧౫౫—౧౧౮౯); అతని పుత్రుఁడు నరసింహదేవరాయలు (౧౧౮౯—౧౨౪౬), అతని కుమారుఁడు రామదేవరాయలు (౧౨౪౬—౧౨౭౧), అతని తనయుడు ప్రతాపరాయలు (౧౨౭౧—౧౨౯౭); అతని కుమారుఁడు జంబుకేశ్వరరాయలు (౧౨౯౭—౧౩౩౪).

రాయవంశావళి కేవల కల్పనాకథ. అందు చెప్పఁబడిన రాజవంశము వాస్తవమైనదని రుజువుసేయగల సాధనము లెవ్వియులేవు. మహమ్మదీయులు జయించుటకుముం దానెగొంది దేశమును బాలించుచుండినవారు కంపిలి రాజులు. వీరియందు మొదటివాడు ముమ్మడిసింగేయ నాయకుఁడు; అతని యనంతర మతని కుమారుఁడు కంపిలిరాయలు రాజ్యాధిపతియాయెను. వీరు మొదట దేవగిరి యాదవరాజులకు సామంతులు; క్రీ. శ. ౧౩౧౨ వ సంవత్సరమున రామదేవరాయలు చెఱిపోయిన పిమ్మట స్వతంత్రులు. దేవగిరి యాదవరాజులకుముందు కాలచుర్యులును, నంతకుముందు చాళుక్యులును ఆనెగొంది ప్రాంతములను బాలించిరి.

గుమారరామునికథ యందు చెప్పియున్నది. బహాదరుఖా ననునది అతని నిజమైన పేరుగాదు. అతని పేరు బహావుద్దీన్ గర్షా(స్టా)స్పు. అతఁడు సామంత మాత్రుఁడుగాడు. సుల్తానుకు సాక్షాత్తు మేనత్తకొడుకు. అస్త్రవిద్యాప్రదర్శనము కల్పనాకథ. సుల్తాను కతనిపై గ్రోధముజనించుటకు కారణ మేమనఁగా సుల్తాను తండ్రి ఘయ్యాజుద్దీను కాలగతినొందిన పిమ్మట ముహమ్మదు బిన్ తుఘ్లూకు రాజ్యాధిపత్యము నంగీకరింపక, తానే వాస్తవమైన సుల్తానునని బహావుద్దీను ప్రకటించి తన నాయంకర సీమయైన సాగరు నందు సైన్యములను గూర్పనారంభించెను; కాని సుల్తాను దళనాయకులతో యుద్ధమునందోడి కుటుంబముతోగూడ కుమ్మఠమునకు బాఱితెంచి కంపిలిరాయని శరణువేడెను; కంపిలిరాయ లతని కాశ్రమొసగి నందులకు గినిసి యతనిపై సుల్తాను దండు వెడలెను. ఇది వాస్తవముగజరిగిన చరిత్ర. కావున కుమారరాముని కథయందలి బహదూరుఖానుని యుదంతము కేవలము గల్పితము గాదు. అందణుమాత్రము నిజము గలదు.

సుల్తాను కుమ్మఠదుర్గమును మూడుపర్యాయములు ముట్టడించెననియు, మొదటి రెండు తడవలలో నేమిఖానుఁడును, మూడవమారు మాతంగియు సైన్యాధిపత్యము వహించిరనియు గుమారరామునికథయందు కలదు. సుల్తాను మూమ్మారు కుమ్మఠమును ముట్టడించినమాట నిజమే. నేమిఖానుఁడును మాతంగియు గల్పితవ్యక్తులని యింతకుముందు నిరూపించియున్నాడను. కావున వారి యాధిపత్యము క్రింద దండు నడుచుట యసంభవము. మొదటి తడవ మల్లిక్ రుక్నుద్దీనును, రెండవ సారి నిజాముల్ ముల్కును, మూడవమారు అహమదు అయాసు ఖ్వాజా-ఇ-జహానును ఢిల్లీ సైన్యముల కధిపతులని ఈసామీ చెప్పుచున్నాడు. దండనాయకు లెవ్వరైనను కుమారరాముని కథయందు చెప్పినట్లు ఢిల్లీసైన్యములు గుమ్మఠమును మూడుమార్లు ముట్టడించుటయు మొదటి రెండుసారులు బరాజయమందుటయు గడపటి పర్యాయము విజయు లగుటయు నిక్కము.

రణనిహతుఁడైన కుమారరాముని తలను మాతంగి ఢిల్లికి సుల్తాను కడకంపెనని కుమారరాముని కథయందున్నది; అట్లుకాక, కంపిలిరాయల శిరమునే అహమదుఅయాసు నఱకించి బంగారు పళ్లెరము నం దిడి నట్లీ సామీచెప్పుచున్నాడు. కుమారరాముఁడు యుద్ధరంగమున శత్రులచే మడిసి వీర స్వర్గమును చూఱగొనినట్లు శాసనములు పల్కుచుండుటవలన తండ్రితోగూడ కుమారరాముడుగూడ యుద్ధమున దెగటాఱెనని మన మనుకొనవచ్చును; కాని కంపిలిరాయని తలనుబోలి యతని తలను గూడ శత్రులు గోసిరేమొ నిర్ధారించుటకు వీలుగాదు.

ఈవిషయములనెల్ల దృష్టియం దుంచుకొని పరిశీలించి చూడగా గుమారరాముని కథవలన దెలియవచ్చు నికరమైన చరిత్రాంశములివి. దేవగిరి రామదేవరాయల కాలమున హంపి ప్రాంత మందలి దొరవాడి యను స్థలమున క్రీ. శ. ౧౨౮౦—౧౩౦౦ మధ్య ముమ్మడి సింగెయనాయకుఁడను దొరయొకడేలుచుండెను; ఇతని కుమారుఁడు కంపిలిరాయఁడు. తండ్రి యనంతర మతఁడు గద్దె యెక్కెను. కంపిలి యానెగొంది హంపి కుమ్మఠ హొసమలెదుర్గము లతని యేలుబడిక్రింద నుండినవి. శూరశిఖామణియగు తనకుమారుఁడు కుమారరామనాథుఁ డతనికి చేదోడై ప్రవర్తింపగా గంపిలిరాయలు హొయసల ముమ్మడి బల్లాళునితోడను, గాకతీయ ప్రతాపరుద్రునితోడను తఱచుగ యుద్ధము సేయుచుండువాడు. ఢిల్లీ సుల్తాను తన మేనత్తకొడుకగు బహావుద్దీన్ గర్షాస్పున కాశ్రయ

మొసగెనని కోపించి కంపిలిరాయల జంపి యతనిరాజ్యమును స్వాధీనపఱచుకొన నిశ్చయించి దండు వెడలెను; రెండు పర్యాయములోడి పాఱిపోయెను. మూడవ పర్యాయము విజయుఁడై కంపిలిరాయని అతని కుమారుని రామనాథుని జంపి కంపిలి రాజ్యమును దనసామ్రాజ్యమున గలుపుకొనెను.

ఈచరిత్రాంశములు బీజప్రాయములై కుమారరామనాథ పురాణోత్పత్తికి కారణభూతము లాయెను. న్యూనిజు కాలమునకె మార్పు ప్రారంభమైనది; కన్నడ కుమారరాముని కథలో కల్పనా కథల లరణ్యమువలె బెరిగి వాస్తవచరిత్రను గప్పిపుచ్చినవి. ఆంధ్ర కుమారరాముని కథయందు సత్యము సంపూర్ణముగ సమసిపోయి యాకాశపురాణమున కెడమిచ్చినది. చరిత్రాంశములనుండి యసత్య గాథలె ట్లుప్పతిల్లునో కుమారరాముని కథ చక్కగ విదితము సేయుచున్నది.

త్యాగరాయనగరు, మద్రాసు.
10-2-1958

నేలయీరు వెంకటరమణయ్య

కుమారరాముని కథ

★

ఇది కథ; యిది మార్గము; వినిపింతు వినుడి; ఓపుర జనులార! పుణ్యాత్ములార! అదియెట్టి కథ? అనగ ఆవగ వినిపింతు; ఆయట్టి విరుపాక్షి ఆనెగొంది భూమి; కంపిలి గంగావ తనియేటి గ్రామదేవతయు, వీరకుంభిణి రాజు విక్రమార్కుండు, అతనికి నిజరాణి అలికులవేణి, (ఆరియాల యని యేటి యంభోజనేత్రి.*)

ఉత్తరకాంభోధి యన్నదే వసవల్లి దుర్గము; ఆ వసవల్లి యేలేవారు యెవరంటె? రాజు వీరకుంభిణి మహారాజు; ఆ రాజుకు ఇల్లాలు అరియాలదేవి; పుట్టే పన్నెండు పెరిగే పన్నెండు, పన్నెండు పన్నెండు ఇరువైనాలుగు యేండ్లు వెళ్లెను; నగర సంతానం లేక నోయరాని నోములు, పట్టరాని వ్రతాలు, ఆకెల్లా పత్రిగా నోచెను. రావిచిలుక నోము నోచెను; కాశీ తీర్థం గంగకు మోచెను; గంగతీర్థం గాశికి మోచెను; కాశీరామేశ్వరం సందున చాలురావులు వేయించెను; పర్వతంబోయేటి మార్గంలో పదివేలకు జంగమార్చన చేయించెను. అందునా సంతానఫలము అందదాయెను. పెండ్లిండ్లు లేని పేద బ్రాహ్మణులకు పెండ్లిండ్లు చేయించెను; వడుగులు లేని పేద బ్రాహ్మణులకు వడుగులు చేయించెను; మిట్టను బావులు, పల్లమున చెఱువులు గోపి (?) ఒకట వనాంతరము వేయించెను. అందునను సంతాన ఫలము లేదాయెను. ఒకనాటి సమయమందున పెని

---

* ద్విపద పోలికలు ఇందు స్పష్టముగ గానవచ్చుచున్నవి. కొంచెము మార్చిన దీని మంజరి ద్విపదగ బఠింపవచ్చును. చూడుఁడు.

ఇది కథ ఇది మార్గ మినిపింతువినుడి
పురవాసి జనులార! పుణ్యాత్ములార!
అది యెట్టికథ యన గనగవినిపింతు
అట్టి విరూపాక్షియనగొంది భూమి
గంగావతని యేటి గ్రామదేవతయు
వీరకుంభిణిరాజు విక్రమార్కుండు
ఆతనికి నిజరాణి యలికుల వేణి.

మార్గమినిపింతు = మార్గము + ఇనిపింతు—'ఇనిపింతు' వినిపింతునకు ఆభాసరూపము—ఇట్టి రూపము లీపాటయందు బ్రవ్విఠండములు.

మిటి వీరకుంభిణి మహారాజు కచేరీకి వెళ్లి, కచేరీ బరకాస్తుచేసి, నగరుకు ప్రవేశించి, వెండికాగుల వేడినీళ్ల పైండికాగుల చల్లనీళ్లతో రాజేంద్రుడు స్నానం చేసి, పట్టు ధోవతులు అలంకరించుకొని, చేర్పుకట్టు బొట్టు బెట్టుకొని, రాజు వచ్చేవఱకు బంగారపు పళ్లెరములో పప్పులు, పచ్చళ్లు, పరగ నొక్క కూర, నెయ్యి, అన్నము, నేతిబూరెలు రాజేంద్రునికి వడ్డన జేసిరి. రాజేంద్రుడు భోజనముజేసి హస్తములు వెల్చుకొని వట్టివేళ్ల చవికెలో పట్టెమంచం బాలీసు దిండుమీద దీనాప దిండ్లు, యేపుదిండ్లు పానుపుమీద నిమ్మళించిన సమయమందు పట్టపుదేవి తాను తలఆర స్నానం చేసి యేడువారముల సొమ్ము ధరించుకొని పోమళ్ల చీరె పట్టపుదేవి శృంగారించుకొని కుంకెనకుచ్చులు, బాజీబందులు, బవిరిరేకలు, సూర్యవంకలు, చంద్రవంకలు, పాంజేబులు, పావడములు, చిటికెనబొద్దులు, పిల్లాణులు, గజ్జల యొడ్డాణం ఘల్లున ధరించుకొని బంగారు పళ్లెములో పండుటాకులు, పచ్చిపోకలు పెనిమిటిగారికి తాంబూలం చేత బుచ్చుకొని అంబుజాక్షి, పద్మాక్షి, నీలవేణి ముగ్గురు దాదుల వెంటబెట్టుకొని రాజుగారున్న అంతఃపురంబులోనికి ఘల్లుఘల్లుమంటు చక్కగావచ్చి పన్నెండు మూళ్ల పట్టుసెల్లా అడ్డతెరలు కట్టించి ఆ తెరచాటున కుర్చీ వేసుకి కూర్చుండి యీ పండుటాకుల, పచ్చిపోకల పచ్చకర్పూరమున పెనిమిటికి తాంబూలము ఇప్పించుచు,

ద్వి॥ "ఓ జీవితేశ్వరా! ఓ ప్రాణనాథ!
రాజమన్నె కొమార! రాజగాండీవ!"

'విన్నావా స్వామీ! మనవి చేయుదును.'

'ఏమి మనవి?' అని రాజు అడుగుచున్నాడు.

'మన యీడువారిలో, మన జోడువారిలో, సిరి సంపదల దులదూగుచున్నారు; స్వామీ! మన నగరను సిరి గలిగియున్నది, సంతానములేకపోయెను. నన్ను 'అమ్మా!'—అని పిలుచుటకు ఆడబాలకన్నను నోయమైతిమి. నిన్ను 'అయ్యా!'—అనిపిలుచుటకు మగబాలునికన్న నోయమైతిమి. సంతులేని వారి యిండ్లు కంపలు గొట్టిన కళ్లమును, దేవుడు లేని దేవస్థలములను బోలును. మనకు ఏడుకోట్ల పదార్థమున్నది. ఎక్కే తురంగాలు గలవు; ఏలడానికి భూములు ఉన్నవి; కట్టుమట్టున యేనుగు లుండేమి, లేక నేమి? గొడ్డుబోతుబ్రతుకు బ్రతుకుటకంటె అడవిలోనొక మ్రానై బ్రతుకుట మేలు. స్వామీ! నీ సెలవే గనుక అయితే ఇక్కడకు పన్నెండు ఆమడ వానరభూమిలో శ్రీరాములవారి పర్వతము ఉన్నదట. ఆ పర్వతమునకు నేను వెళ్లి అఘోరమైన తపస్సు చేసి గట్టిగా నేను సంతానఫలమును తెచ్చెదనయ్యా స్వామీ!'

'అయ్యో! పట్టపుదేవీ! నీవేమి, శ్రీరాములవారి పర్వతము వెళ్లడమేమి? ఎండకు తాళలేవు, నీడకు నిలువలేవు, చూడ సుకుమారివి, తక్కువ నోములను యెక్కువ ఫలములను రమ్మనిన వచ్చునా? మనకు బ్రహ్మయింతే వ్రాసినాడనుకొందము. ఈ గండభేరుండములుండే అడవులలోనికి యెట్లా పోవుదువు?'

అనగానే!

'ఎంత లేదు, స్వామీ! మనకు సిబ్బంది లేదా? నీసెలవు అయితే పోవనుగలను, రానుగలను.'

'ఎవరయ్యా, ప్రధాని అభోజి పంతులు, పట్టపుదేవి పిచ్చితలపు దలచెను. అడవులు బట్టుక శ్రీరాములవారి పర్వతమువెళ్లుచున్నదట. కాపులు, కరణములు, కమ్మవెలమదొరలు, చౌదర్లు, విద్వాంసులు, చెలగి మహల్ దార్లు, ఉక్కురథములవారు, కంచురథములవారు, పచ్చబద్దలవారు, ఏనుగులకు వైరి ఎనబోతుల ఎఱ్ఱన్న, గుఱ్ఱములకు వైరి గుజ్జల పాపయ, పఠాని పాగారాతు, ముగ్గురు సరదార్లతోగూడ పట్టపుదేవితో కూడ వెళ్లు'మని రాజుగారు సెలవుఇచ్చిరి.

పచ్చల పల్లకీ బైటబెట్టించిరి. శ్రీరాములవారికి ఏమి తీసుకున్నది? ఏడుము వెండిపూవులు, పందుము బంగారు పూవులు, పందుము సాంబ్రాణి, మూడుపుట్ల అచ్చపు ఆవుల నెయ్యి, స్వామివారి అఖండమునకు తీసుకున్నది. తూరుపుకుంభిని, పడమట కుంభిని, ముత్తరాసబలములు, ముద్దుబలములు, సదురుబోయగుంపులు, ఎఱ్ఱగొల్లగుంపులు, గొట్టెగాని బలములు హాజరుగ నడుములు గట్టుకొని నిలబడిరి. పట్టపుదేవి ప్రయాణము అపుచుండగానె పట్టపుదేవికి పుట్టింటివారు అరణం యిచ్చిన దాసీ నీలవేణి, దానికిగూడ సంతానము లేక పట్టపుదేవియే నోములు నోచినను తానును ఆ నోములు నోయుచు నుండునది; ఏ వ్రతములు పట్టినను ఆ వ్రతములు పట్టుచునుండెడిది. పట్టపుదేవి యెక్కడికి వెళ్లినను 'వచ్చెదవటె దాదీ సంగా!'—అని పిలుచుచుండెడిది. ఆలాగంటిది శ్రీరాములవారి పర్వతము వెళ్లునప్పుడు నీలవేణి అనుదాసిని తలచినదే కాదు. పచ్చల పాలకీలో కొలువు దీరెను. గుఱ్ఱములమీద ఢంకా ఢాంఢాం అని మ్రోగువఱకు, దండంతయు ప్రయాణమయి చక్కగ వచ్చెను. ముందుగానే పట్ణమంతా కస్తూరి కలాపి చల్లించి, రంగవల్లి ముగ్గులు పెట్టించి, వీధి వీధిని తోరణములు గట్టించినారు. దాదులు యిద్దరు ప్రయాణమై వెంబడించి వచ్చుచున్నారు. నీలవేణి, 'పిలువనిది ఎందుకు పోవలెను?' అని యింటియొద్దనే నిలిచినది.

అరియాలా దేవేమి
శ్రీరాముల పర్వతము ॥తందన్న తానా॥
భామతాను కదలినది
కొమ్మకొమ్మ దివిటీలు తం॥
కొత్తులావిపంజులు
రంభనాటక స్త్రీలేమి
సకలవిధాల సంబ్రములు
భామతానుగదలెను;
వసవల్లి దుర్గము తం॥
చుట్టు యేడుకోటలు
సూర్యసోమ వీధులు
వారలుచాల గడచిరి;
పొడుగాటి మిద్దెలు తం॥
భువనేశ్వరములేమి
వారుచాల దాటిరి;
కొండలు కులగిరులు
గంగరేగులు గడచిరి; తం॥
పెద్దపులులు పేరాడె
వనములు వారు దాటిరి;
సాంబ్రాణిసాదులు
వారు చాల దాటిరి;
మైసాదున్నవనములు
వారు చాల గడచిరి;
ఆరగ పండిన మావిళ్లు
వారుచాలదాటిరి;
వానరభూమికి వచ్చిరి;
శిలానది దగ్గరను
పాతాళగంగేమి
అక్కడ డేరా వేసిరి.
అక్కడికి, మూడు కోసులు ఉన్నది
శ్రీరాముల పర్వతము

అఘోరఘోర అడవేమి
గుజ్జు కత్తులు సేయించి
పెడకత్తులె సేయించి
గొడ్డళ్లు సేయించి
మూడు కోసుల పొడుగున
అడవి యంతయు గొట్టిరి
దారులు బాగుగ దీర్చిరి
వచ్చి కబురులు చెప్పిరి,
'దారులు బాగుగ జేసితిమి.'
అప్పుడు, గంగలో స్నానముచేసినది॥తం॥
పట్టు వస్త్రము గట్టెను
కొన్ని బలములను దీసికొని
ఆటపాటల వారిని
ముందుగను నడపించి
వెనుకకు, అడుగుకు మడుగు లొగ్గెను
వడకు అడుగుల నొగ్గుచును
పర్వతము మీదికి వచ్చినది.
శ్రీరాముల దేవళము
తెచ్చిన సామానంతయు దింపించి
అయిదు బిందెల ఉదకము
స్వామివారికి ఆవేళ
అభిషేకము సేయించి
యేకుము వెండి పువ్వులేమి తం॥
పందుముపైడి పువ్వులేమి
స్వామి వారికి పూజలు సేయించి
పందుముగ సాంబ్రాణి
స్వామివారికి ధూపము వేయించి
ఎదుట అఖండము నెత్తించి
సాష్టాంగము సేవించి
ఆ దేవళము ముందరను తం॥
సూది గుండు ఉన్నది

నరు లెక్కలేరు దిగలేరు
ఆ సూదిగుండు మీదికి
భామతాను ప్రాకెను.
దర్భాసనము పరచినది
దర్భాసనము మీదను
పులిచర్మము పరచినది తం॥
పైన జింకచర్మము పరచినది
జింక చర్మముమీదను
గుమ్మడి పండును నిలిపెను
గుమ్మడిపండు మీదను
సూదిమీద సూదేమి
యేడు సూదులు నిలిపెను తం॥
చివర సూదిని అరియాలి
ఆవగింజను నిలిపెను
ఆవగింజ మీదను
శిరస్సు క్రిందు మోపినది
శ్రీపాదము మీదేమి
భామ తపస్సు పట్టింది.
మూడు గడియల తపస్సుకు
చుక్కలు పిక్కటిల్లెను
సూర్య చంద్రాదులు తం॥
త్రోవలు తప్పెడు విధమాయె
భూమి తల్లడిల్లెను
నీళ్లకు చెదలు పట్టెను
అగ్నికి యీగలు ముసిరెను.
అప్పుడు స్వామివారేమి
గడగడ గడగడ వణకుచును తం॥
అబ్బ! ఎంత తపస్సు పట్టినది!
నేను చూడలేనేమి
అంటు ప్రత్యక్షమైనాడు.
'విన్నావా! అరియాలీ,

నీకు ఇంత కష్టమెందుకు ?
నీకు కోరిన ఫలములు యిచ్చెదను
అడిగిన వరములు యిచ్చెదను తం॥
నీ తపస్సు వదలి చెప్పవలె
నమ్మ వేమే అరియాలీ ? తం॥
నీవు నమ్మవే మువ్మాటు
నీ వడిగిన కోర్కెల నిచ్చెదను.'
అపుడు తపస్సు వదలినది
హస్తములట్టె యొగ్గినది,
'మీరు యిచ్చిన భాగ్యము
మాకు, యేడుకోట్ల ధన మున్నది
బొక్కస బండా రున్నది తం॥
భోగభాగ్యములు గలవయ్య
యేలు భూము లున్నవి
ఎక్కుగుఱ్ఱము లున్నవి
'అమ్మా!' యని పిలిచేటి
ఆడబాలా లేకను తం॥
'అయ్యా!' యని పిలిచేటి
మగబాలుడు లేకను
నేను ఈడకు వచ్చితిని
నాకేమి వర మొద్దు
సంతాన మివ్వండి.'
అట్లు హస్తము లొగ్గినది తం॥
స్వామివారు మెచ్చిరి
మెచ్చి ఫలము లిచ్చిరి
'నీకు భూమేలె పుత్రుని
మగబాలు నిచ్చేదా? తం॥
లేకాడబాల నిచ్చేదా?'
'భూమేలే పుత్రుని
మగబాలు నివ్వండి
ఆయురారోగ్యము దీవించి.'

‘విన్నావా! అరియాలీ,
నా దేవళము వెనుకను
అరటితోట ఉన్నది
అరటితోట లోపలను
చెట్టున, అయిదువండ్ల గెలయున్నది
అందులో నొక్కపండు దెమ్మనెను.
‘మంచిది’ అనుచును తం॥
రామస్మరణ జేయుచును
అరటి తోటకు వచ్చినది.
పైన చెట్టువంకను చూచెకదా!
అయిదు పండ్ల గెలయున్న
చెట్టుచుట్టు అరియాలి తం॥
ప్రదక్షిణము చేసెగద.
స్వామి ఒక్క పండు దెమ్మంటె,
అయిదు పండ్ల గెల గోసి
కోసి చెట్టు దిగినది,
ఒక్క పండే యున్నది
చెట్టువంక జూచెను
నాలుగు పండ్లు పైనుండె. తం॥
‘నేను తక్కువ నోములు నోచితిని
యెక్కువ ఫలము వచ్చేనా?
ఆయినను దేవతా మహిమలు
ఒకటను రెంటను మూటను
తప్పిన నాలుగింటను.’ తం॥
రెండవపారి యెక్కెను
ఆ నాలుగు పండ్లును గోసినది.
చెట్టు దిగెను హరియాలి
ఒక్క పండే యున్నది

నాలుగు పండ్లు పైనుండె;
మూడవపారి కోసెను
ఒక్క పండే యున్నది.
స్వామి ప్రత్యక్షమైనాడు తం॥
‘ఇది యేమే! అరియాలి,
నీవైతె ఆశకు పోయితివి
నీకు భూమేలే పుత్రుని
జగమేలే చంద్రుని
కొడుకునైతే ఇచ్చితిని.
ఒక్కడే చాలును. తం॥
నీకు బాలుడు కలగగను
చిన్నవానికి నీ వేమి
కుమారరామ య్యనియేటి
పేరు బెట్టు మన్నాడు.
నీ యొక్క బాలునకు
కత్తి దెబ్బ తగులదుగా
తుపాకి దెబ్బను చావడుగ
అట్లు నీకు యిచ్చితిని తం॥
ఒక్క పండే చాలును.’
స్వామి సెలవు తీసికొని
దండము బెట్టి తిరగినది
పర్వతంబు దిగినది తం॥
శిలానది యొద్దకు
డేరాకు వచ్చెను. తం॥
బంగారు భరణిలో
అరటి పండే యుంచెను
తన పలకిలో నుంచుకొని. తం॥

మా. ‘ఎవరోయి ఏనుగలకు వైరి ఎనబోతుల యెట్టన్న, గుఱ్ఱములకు వైరి గుజ్జుల పాపయ్య, పటాణి పాగారాతు.’— మేలు మేలు!

‘మన బాహుబలముకు పైనము చెప్పు’! మన్నది. దరోబస్తు సిబ్బందీ వారు అందఱు నడుములు గట్టుకున్నారు. డేరాలన్ని ఒంటెల మీద బరువులు కట్టినారు.

తిరిగి వసవల్లి దుర్గముకు
భామ వచ్చుచున్నది
గుఱాల మీద ఢంకాలు
గుబులుగ వేస్తు వచ్చిరి
రేయింబగలును నడచిరి తం॥
మూడవరోజుకు అరియాలి
వసవల్లి దుర్గము
ఊరి ముందఱ దిగినది.
జోడల బిలిపించి,
‘విన్నారా జోడాలు,
ముందు, పట్ణమునకు మీరెళ్లి తం॥
రాజగారితో చెప్పండి
పట్టపు దేవి వచ్చెను
ఫలములు దెచ్చుచున్నది
ఆలాగంట చెప్పండి.’
ముందర వచ్చిరి జోడాలు
రాజుగారి కొల్వునకు తం॥
ఆస్థానమున నిల్చిరి.
జోడాలవారిని జూచెను,
‘ఏమిరోయి! జోడాలు,
ఏదిర పట్టపు దేవేమి?’
‘అయ్యా! వచ్చుచున్నది
ఫలములు దెచ్చుచున్నది.’
అంగానె రాజుకు
కుప్పటము యెగసెను
కుడిభుజములు అదిరెగద తం॥
నూఱు భుజములు ఆయెగదా!
ఇన్నాళ్లకు మనసగర

సంతానము తెచ్చేనా?’
సంతోషించి రాజేమి
పట్టపు దేవికి యెదురుగను
పాలకి భజంత్రీల బంపె గదా.
నాలుగు వీధులు మహారాజు తం॥
తోరణములె కట్టించి
సకల వగల సంబ్రముల
పట్టపు దేవియు నారాజు
నాలుగు వీధుల నూరేగి తం॥
మొగసాలకె వచ్చిరి.
వచ్చిన మరునాడు
దశమి సోమవారమున
దండి ఒక్క ప్రొద్దుండి
కన్నెకల భావికి
స్నానమునకు వచ్చెను.
అక్కడ స్నానము చేసినది
దానధర్మములు జేసినది తం॥
పట్టువస్త్రము గట్టుకొని
తన మేడకు వచ్చెను.
బంగారు గిన్నెలో
అరటిపండె యుంచినది
ఆ తొరకంతటిని ఉలిచినది
శ్రీరాములను నుతియించి
పండును అనుభవించినది
తొరకను పారవేసినది.
అది పుచ్చుకున్న గడియకు
జిల్లేడాకు పాలిన
పాలిన ఒక్క చందమున

దేహమంతయు బాలెను;
తమలపాకు చీకిన
చీకిన ఒక్క చందమున
దేహమంతయు చీకెను; తం॥
అన్న హితవు తప్పెను
వేవిళ్లు ఘనమాయె.
వెలది చిన్నెలు అరియాలి
మూడవ ఒక్క గడియకు

ముత్తె మంత పిండము
ముద్దు మీఱ నిలిచెను;
పగడమంత పిండము
పారుకాడె గర్భమున;
ఆఱుగడియల గర్భము
పట్టపు దేవికి నిలిచినది.
అంతఃపురమున బడియుండె
నీలవేణి వచ్చినది. తం॥

మా. అది కంటికి కడవెడుగా దుఃఖపడుచు ఉన్నది. 'అయ్యో! పట్టపు దేవికి నేనేమి నేరముచేసితిని, నేనేమి ద్రోహముచేసినాను? పోవునప్పుడు 'దాదీ సంగా, వచ్చెదవా', అనిన నేనుకూడ పోయి ఉందు గదా! తనకువలెనె నాకు సంతానము దొరకు గదా! నాకు భగవంతుడు వ్రాయలేదు కాబోలు' అని దుఃఖపడుచు పట్టపుదేవి ఉంశి పోయిన మేడలోనికి వచ్చెను. అరటి పండు తోలు నట్టింట పడియుండగాచూచి, 'కానీ, పండున పుట్టినదె తోలక, తోలకను పుట్టినదె పండు, పండు దినిన సంతానము కలిగినట్టున్న తోలకదినిన లేక పోయి నట్టునా ?' అని, 'శ్రీరాములు, నీవే కల'వని సగం తోలక అనుభవించెను. రాజుగారి గుఱ్ఱమునకును అనేక దినములనుంచి సంతానము లేక గొడ్డు వీగి ఉన్నది. ఇది యెవరితో చెప్పక పచ్చని గడ్డిలో సగముతోలక పొదిగి,

గుఱ్ఱమునకు బెట్టినది తం॥
దానికి గర్భమునిలిచెను.
తనుపుచ్చుకున్న గడియకు
జిల్లేడాకు పాలిన
పాలిన ఒక్క చందమున
దేహమంతయు బాలెను
తమలపాకు చీకిన
చీకిన ఒక్క చందమున
దేహమంతయు జీకెను.
అన్నహితవు తప్పెను తం॥
దాహాహితవు తప్పెను
మూడవ గడియకు గర్భము

దాది సంగకు నిలిచినది.
అదియెవ్వరు యెరుగరు
తానింటిలోపల బడియుండె. తం॥
మూడు గడియల ప్రొద్దెక్క
అరియాల దేవేమి
కష్టము పడుచు నున్నది.
'అయ్యో! రారే దాదులు!
కావేరీ! కస్తూరీ!
ఈవేళ నేను బ్రతుకనె.' తం॥
'అమ్మా! ఓర్చుకో మాతల్లీ'.
తాళితాళి నొప్పులు
తడవాయ నిలువవు.

ఇంత వర్తమానము
రాజు చాల విన్నాడు. తం॥
ఎంత కష్టమువచ్చినది.
మంత్రసానుల బిలిపించె;
ముప్పైముగ్గురు వచ్చిరి.
పొడుగాటి పీటలు
పట్టపుదేవికి వేసిరి
భామను గూర్చునబెట్టిరి,
వెనుకను ముందున ఆనుకొని
ముందు దూలమున పలుగులు తం॥
పట్టపుదేవి చేతికి
వారు అంది యిచ్చిరి.
అంతలోనె మహారాజు
భోజనముజేసి యా రాజు
కచ్చేరికి వెళ్లెను.
అయిదు గడియల ప్రొద్దెక్క తం॥
హారియాల దేవేమి
చల్లంగను నిల్లాడె.
కొడుకైతె కలిగెను
'మగబాలుడు' అన్నారు.
బాలకు బొడ్డు గోసిరి
బాలకు నీళ్లు బోసిరి

బంగారంపు తొట్లోను
బాలుని దీసుక వచ్చిరి
తబుకుతో వరహాల్ త్రవ్విరి తం॥
సత్కా తీసిరి బాలునికి
ఆవల నీవల జల్లిరి
దాదులు కాసు లేరికొని
బాలుని తొట్లలో నుంచిరి.
'మూడు పుట్ల బియ్యము
మంత్రసానుల' కన్నారు.
పాతిక వరహాల్ పై నిచ్చి,
తవుడున యుల్లీ పొట్టున
తగ పొగ వేసిరి బాలునికి.
వాకిట వేపమండలు కట్టిరి,
చుట్టు దాదులుకావలి.
అప్పుడు హారియాలి
తెనమూర్ఛ దెలుపుకొని
'ఏడమ్మ! నా బిడ్డ?'
బాలుని చేతికి ఇచ్చిరి.
దూవి ఆొమ్ముమన ఆ తల్లి
స్తన్య పాన మిచ్చెను.
ఈ వర్తమానము

మా. నగరి కోమాళ్లు రాజుగారి కచేరికడకు వర్తమానము దీసికొని వెళ్లుచున్నారు. అంతలో వైళమె రాజుగారు మేలు మేలు!

సాలుగుదస్తా లెక్కలు కంఠీపట్టించగా తమ ఖర్చు సిబ్బందీ ఖర్చు అర మాఫీ పురుమాఫీ ఖర్చుపోగా సరకారు సిస్తు చెల్లగా ౧౮౨౦౦ వరహాలు రాజుకు ఆదా కనుపడినది. అగుపడగానే బహు సంతోషముతో నున్నాడు. ఆ సమయములోనే నగరికోమాళ్లు వెళ్లి, 'మహాప్రభో తమకు కుమారుడు గలిగినా'డని చెప్పగానె, రాజు బహు సంతోషించి పుక్కిట విడెము చెదర నవ్వి,

'ఎవరయా! అభోజిపంతులు, శీఘ్రముగా పట్ణములో బ్రాహ్మణులను

పిలిపించి చిన్నవాడు పుట్టిన గడియ నక్షత్రము విచారించవలెను. అతిత్వరగా పిలిపించ' మనెను.

ప్రధాని వెళ్లి బ్రాహ్మణులను పిలుపించేవఱకు రాజుగారు పన్నెండుపుట్ల కండచక్కెర, యెనిమిదిపుట్ల పంచదార, ఆఱువందల ఆకుల మోదలు, పందుం పోకలు పట్ణము వెడల్పున పంచి పెట్టించిరి. అంతలోనే బ్రాహ్మణులందఱు హాజరు అయినారు. 'ఎవరయా, బ్రాహ్మణోత్తములారా! పట్టపుదేవి పుట్టి పన్నెండు పెరిగి పన్నెండు, పన్నెండు పన్నెండు యిరువైనాల్గు సంవత్సరములకు సంతానము దెచ్చెను. మగచిన్నవాడు జనన మైనాడు. తల్లికి మోసమొ, తండ్రికి మోసమొ, పట్ణమునకు యేమైన భయమేమో, యేడు కుంభిణీ కోటలు, డెబ్బైరెండు కరపట్నాలు, యేనూట యెనబై రాజవీథులు, యేనూట యెనబై సందువీథులు ఉండునో? ఊడునో? చిన్నవాడు పుట్టిన గడియ నక్షత్రము యేలాగున్నదో? నేను రాజరికముచేయు రాజనని భయపడక గట్టిగా విచారించండి'.

'మహాప్రభో, ఇంకను మీరు అడుగ పని ఉన్నదా? మేము చెప్ప పని ఉన్నదా? చిన్నవాడు పుట్టినగడియ నక్షత్రము బహుబాగుగ ఉన్నవి.

మేలు మేలు!

భూమినేలు పుత్రుడు పుట్టనే పుట్టెను. తల్లికి మోసము లేదు, తండ్రికి మోసము లేదు. పట్ణమునకు మోసము లేదు. ఏడు కుంభిణీకోటలు డెబ్బైరెండు కరపట్ణములకు మోసము లేదు. కుమారుడు బహుబుద్ధిమంతుడగును. రాజు అంశ బాగుగ ఉన్నది. ఒకట రెంట మాట గట్టిగా విచారించియే మీతో మనవి చేసినాము.'

అనగానే అప్పుడు బ్రాహ్మణులకు పప్పు బియ్యములు ఇప్పించి దుశ్శాలువలు మేలు మేలు!

బహుమానం యిప్పించి రాజుగారు కచేరి బరఖాస్తు చేసి రాయమహల్ మీద పండుకొన్నాడు.

దాది సంగ యిక్కడను
కష్టపడుచు నున్నది తం॥
అయ్యో! రావే కావేరి,
అప్పా! నేను బ్రతుకనె
చెల్లీ! రావే పద్మాక్షి

యీవేళ నేను బ్రతుకనె.
మంత్రసానిని పిలచిరి
తాళి తాళి నొప్పులు తం॥
తడవాయ నిల్వవు.
ఆవల యీవల దాదులు

నిల్వ బట్టిరి ఆవేళ
మంత్రోదకములు తెచ్చిరి
నీలవేణికి యిచ్చిరి. తం॥
పగలు రెండు జాముల వేళను
దాది సంగకు ఆవేళ
కుమారుడు కలిగెను
అప్పుడు మంత్రసానులు
బాలుని బొడ్డు గోసిరి,
నీళ్లుబోసిరి బాలునికి
ఉయ్యాలతొట్లలో నుంచిరి.
నీలవేణి లెగిసినది,
మూర్ఛ పోయి లెగిసినది. తం॥
'యేడమ్మా! నా బిడ్డ?'

ఎత్తి చేతికి ఇచ్చిరి.
దూదిఱొమ్మున పాలిచ్చె
నీలవేణి కొడుకేమి
రాజు కొడుకు కన్నాను
చింతాకు వాసేమి
సౌందర్యము గలవాడు,
అధిక చక్కని బాలుడు.
రాజుగారి గుఱ్ఱము
పూలతోటలో ఈనినది
నాలుగు కాళ్లు తెలుపేమి
నడినెత్తిన చుక్కేమి
పంచకల్యాణి పూదోక
మంచి గోడిగను పెట్టినది. తం॥

మా. దాది సంగకు కుమారుడు కలగంగానె, గుఱ్ఱమునకు గోడిగ పుట్టగానె, రాజుగారి కచేరీమీద యేమేమిచోద్యములు పుట్టుచున్నవి? రాజు ఒక్కడే కచేరిన లేడుగాని సకలమైవారు కచేరిలోనే యున్నారు. ఏనుగులకు వైరి ఎనపోతుల ఎఱ్ఱన్న, తెలగా గుఱ్ఱములకు వైరి గుజ్జుల పాపయ్య, బొందిలి పఠాణి పాగారాతు తురక ముగ్గురు సరదార్లు ఏమనుకున్నారనగా:-

పఠాణి పాగారాతు అన్నాడు గదా,

'ఏమోయి, ఏనుగులకు వైరి ఎనుబోతుల ఎఱ్ఱన్నా, సిపాయిగిరి బంట్రాతు మానా యెవ్వరిదోయ్?'

అనగానె,

'ఒకరిది అని నిరుకు ఉన్నదా? మొలత్రాడు గట్టిన మగవాడి కెల్లను ఉన్నది సిపాయిగిరి బంట్రాతు మానా.'

అందుకు తురక యేమంటాడనగా,

'సిపాయిగిరీ బంట్రాతు మానా యెవ్వరిదీ కాదు, మేలు మేలు! మాషేఖుయింటి వారిది.

డాలు పట్టా యెవ్వరిది?
సైయ్యదు యింటి వారిది.

బల్లెపు లగువులు యెవ్వరివి?
మామొగలు యింటి వారివి,

మా. అందుకు ఎఱ్ఱన్న యేమి అనుచున్నాడు:

'ఆయితే డాలు బల్లెము పట్టా మీ సైయదు మొగలు ఇంటి వారివే అయితే ఈభూమిలో సిపాయిగిరి మఱియెవ్వరికి లేదా? వెఱ్ఱి మాటలు యేమి చెప్పుచున్నావు! మేలుమేలు!

మొలత్రాడుకట్టిన మగవానికెల్లా ఉన్నది, బంట్రౌతుమానా, సిపాయిగీ.'

ఎఱ్ఱన్నతో తురక యేమను చున్నాడు.

'ఛీ, లండి' అనుచు తిట్టెను.
'నన్ను లండి అనుచు తిట్టితివా?'
తెలగాలు లెగిసిరి
బొందిలీలు లెగిసిరి.
పట్టాలు దూసిరి
కత్తులట్టె దూసిరి.
తురకలంత లెగిసిరి
నడుము లట్టె కట్టిరి

డాలు కత్తులు దీసిరి
కదిసెనుర! కయ్యము. తం॥
తురక లప్పుడు నఱికిరి
తెలగాలు పొడిచిరి
బొందిలీలు నఱికిరి.
ఓహో! కదిసెర కయ్యము.
ఆఱునూటికి చావులు
మూడు నూర్లకు గాయములు

మా. కచేరీ అంతయు నల్లకల్లోలము అయినది. ఆ రక్తకోకలు మూటలుగట్టించి, రాయమహాల్ మీదికి తీసికొనివెళ్ళి, 'ఓహో! వీరకుంభిణి మహా రాజుగారు, ఏమి నిద్దుర పోవుచున్నారు ఏలినవారు?'

అనగానె, దిగ్గున లేచి,

'ఏమర్రోయి!' అని రాజు అడుగగా,

'మహాప్రభో, యీవేళతో కచేరీ అంతయు పాడైపోయెను.'

అనగానె, రాజు వెలవెలబోయి,

'అదియేమి?' అని అడుగుచుడ్నాడు.

'ఏనుగులకు వైరి ఎనపోతుల ఎఱ్ఱన్న, మేలు మేలు!
గుఱ్ఱాలకు వైరి గుజ్జుల పాపయ్య, పఠాణి పాగారాతు మూలముగ కచేరి మీద కార్యము పొసగినది.'

'అది ఏలాగంటివి? ఎట్లు పొసగినది కార్యము? నాకు తెలియజెప్పుము' అని రాజు అడుగగనె, కచేరీన వారిలో వారికి నడచిన సంవాదము మీద పుట్టిన కార్యము చెప్పగానె, రాజుగారు యేమి చెప్పినా రనగా,

'నేను ఈలాగంటి సంగతులు పుట్టునని ముందుగానె జాగ్రతపడి పట్ణములోని బ్రాహ్మణులను పిలిపించి చిన్నవాడు పుట్టిన నక్షత్రము బాగుగ నున్నదా?

అని అడిగితె, మేలు మేలు!
భూమినేలే పుత్రుడు, జగమేలు చంద్రు డంతటివాడు పుట్టెను. తల్లిదండ్రాదులకు మోసము లేదు, పట్ణమునకు మోసము లేదు అని చెప్పిరి. నేను వారికి బహుమానములు యిప్పించి రాయమహాల్ మీద పండుకుని యున్నాను. నిద్దుర పట్టుచున్నది. ఇంతలోనె యింతకార్యము యెక్కడనుంచి వచ్చెనోయి? పిలుపించండి, మునుపటి బ్రాహ్మణులను ఇప్పుడు.' అని దివాన్ ఆభోజివంతులకు జెప్పెను. 'దాయలు గట్టి బ్రాహ్మణుల శిరస్సులు కొట్టించెదను.' అనగానె ప్రధాని గడగడ వణకుచు 'బ్రాహ్మణులకు నేటికి మూడెకాబోలును,' అని బ్రాహ్మణుల నప్పుడు రాజుగారి కొలువుకు హాజరు చేయించెను. చేతులు గట్టుకొని బ్రాహ్మణులు నిలువబడిరి. మేలు మేలు!

'ఎవరయా బ్రాహ్మణులు? నేను ఒకపారికి రెండు మారులు మిమ్ముల గట్టిగా విచారించమంటిని, 'మఱేమి పట్ణమునకు మోసము లేదు' అని చెప్పితిరి. ఇంతలోనె నా కచేరీలో ఆఱునూటికి చావు, మున్నూటికి గాయములు ఎట్లా ఆయెను?'

'మహాప్రభో, మనవి చిత్తగించండి. అప్పుడు ఒకమాట, యిప్పుడు ఒకమాట ఆడుదుమా మేము? మీ కుమారుడు పుట్టిన గడియ నక్షత్రమువల్ల యీలాటి కార్యములు పుట్టబోవు. ఇంతకు ముందుగ ఈపట్ణములోను యేకోమటి వీధినా యే బ్రాహ్మణగల్లీనా యే రాజవీధినా యే శూద్రశ్రేణిలోనా యేమొగలాయివీధినా యే గొల్లవీధినా మహాచెడ్డ కార్యవాది పుట్టినాడయా.'

అనగానె,

'విన్నావటయ్యా! అభోజివంతులు, మన సిబ్బంది వారిలో దిట్టమైన వారిని పదిమందిని వెంట దీసికొని పట్ణము దరోబస్తు యిల్లిల్లు తప్పకుండ వెతికించి రెండు జాములప్పుడు మేలు మేలు!
యే యింట యే చిన్నవాడు పుట్టెనో ఆ చిన్నవానిని మన కచేరీకి హాజరు చేయించుము.'

అనెను.

'చిత్తము, మహాప్రభో!'

అని కత్తులు కటార్లవారిని యిరవై యింటికి, వెంటబెట్టుకొని పట్ణము లోనికి సాగివచ్చు చున్నారు.

అంతలోనె నగరికొమాళ్లు రాజుగారికి వర్తమానము పట్టుకొని వచ్చినారు. 'మహాప్రభో, మన దాది సంగ నీలవేణి అనే దానికి కుమారుడు కలిగినాడు.'

'ఎంతసేపు అయినది దానికి కుమారుడు పుట్టి ?'

'మహాప్రభో, రెండుజాము లప్పుడు దానికి కుమారుడు కలిగెను. ఇక నొక మనవి. నాటి మట్టే మన గుఱ్ఱము ఒకటి గొడ్డువీగి వుండెనే, అది యీ వేళనె పూవులతోటలో యీనబడినది. మేలు మేలు ! పిల్లన్నను పిల్లగాను. మంచి గోడిగ పుట్టినది. నాలుగు కాళ్లును తెలుపు నడినెత్తిన చుక్కయు. పంచకల్యాణి, మహాప్రభో, అది బ్రతికితే పదివందల రూపాయలు చేయునండి.'

"ఎవరయా బ్రాహ్మణులు, పట్టపుదేవి అనేక నోములుపట్టి అనేక వ్రతాలుపట్టి, పన్నెండామడ శ్రీరాములవారి మేలు మేలు ! పర్వతమువెళ్లి కష్టపడి సంతానము తెచ్చెను. ఈ దాదిసంగ యెక్కడికిపోయి తెచ్చినది ? ఈ గుఱ్ఱము యెక్కడికిపోయి తెచ్చినది ?'

'మహాప్రభో, అదీ శ్రీరాములవారే దయచేసినారు.'

'విన్నారటయ్యా ! బ్రాహ్మణులారా, కష్టము వచ్చును. సుఖము వచ్చును. ఇది శ్రీరాముల సంకల్పము చొప్పనసె జరుగును. అయితే, యీ చిన్నవాడు పుట్టిన గడియా నక్షత్రము చూడండయ్యా.'

అప్పుడు బ్రాహ్మణులు గట్టిగా విచారించి మేలు మేలు!

'మహాప్రభో, ఇంకను అడుగ పని యున్నదా ? చెడ్డకార్యవాది, శూరుడు పుట్టినాడయ్యా దాది సంగకు.'

రాజు కార్యవాది శూరుడనగానే,

'ఆ చిన్నవాడు ఎమిచేయును ? ఈ గడియ నక్షత్రమున పుట్టిన చిన్నవానికి యేమేమి గుణము లుండును ?'

అంటే,

'చోరవిద్య, జారవిద్య తఱచుగా మనుష్యులను చంపడము, యీమూడు గుణములు ఉండును, ౧౨ సంవత్సరములు వెళ్లినదాక.

ఆ పైన ఉండవటయ్యా. మేలు మేలు !

౧౨ సంవత్సరములు పోయిన తరువాత యీ దుర్గుణములు పోయి సద్గుణములు వచ్చును.'

అనగానె రాజుగారు యేమచున్నారు.

'ఈ చిన్నవానిని ఉంచడము కూడదు, చంపుడు.'

అనుచు సెలవు ఆయెను.

ఈ వర్తమానము దాది సంగవిని, గోడుగోడున దుఃఖపడుచు వచ్చి బ్రాహ్మణుల కాళ్లమీదబడి 'నా బిడ్డనుయేలాగైన బ్రతికించండయ్యా' అని అనంగానె బ్రాహ్మణులు, ఈ దుఃఖము చూడలేక రాజుగారితో నేమని మనవి చేయుచున్నారు.

'మహాప్రభో, చిన్నవాని జంపడము భావ్యముగాదు. నాల్గు సంవత్సరములు తల్లి దండ్రాదుల అదుపులో నుండును ; నాల్గు సంవత్సరములు చదువు చెప్పు బ్రాహ్మణుని హదుపులో నుండును ; తతిమ్మా నాలుగు సంవత్సరములు సాధన చెప్పే జెట్టీల అదుపులో నుండును. అక్కడికి దుర్గుణముపోయి సుగుణము వచ్చును. ఇప్పుడు చిన్నవానిని జపించిన శిశుహత్య చుట్టుకొను చున్నది.'

అనగానె రాజు,

'ఇదీ నిజమే. ఈ చిన్నవానిని దీసుకవెళ్లి మా చిన్నవానికి సహవాసముగా తోట్లలో నుంచుడు' అనెను.

దాది సంగ కుమారుని గూడ రాజుకుమారుని జతను బంగారపు తోట్లలో నుంచిరి. మేలు మేలు !

పురుడు పుణ్యాహము వెళ్లెను
బారసాల వెళ్లెను
బాలుల జోడుగ బెంచిరి.
ఒక్క నెల గడిచెను
రెండవ నెల గడిచెను
మూడవ నెల రాగనె తం॥
అరియాల దేవేమి
భామస్నాన మాడెను
నగలన్నిటిని ధరియించి
పెనిమిటి కొలువుకు వచ్చెను.
'ప్రాణవల్లభ ! విన్నావ ?
జీవితేశ్వర ! విన్నావ ?'
'ఏమి మనివి చెప్పుమా.'
'బిడ్డల గన్న తండ్రివి
బిడ్డల గన్న తల్లిని
అయితేయేమి మన మేమి

మూడవ నెల వచ్చినది
నా బిడ్డకు పేరు పెట్టండి.' తం॥
'మంచి' దన్నాడు మహారాజు.
తెల్లవారిన తరువాత
'ఆ భోజీపంతులు, విన్నావా ?
బ్రాహ్మణుల ముగ్గురిని పిలిపించు.'
హాజరు చేసెను బ్రాహ్మణుల.
రాజు బ్రాహ్మణులు గూర్చుండి
'ఏమయ్యా ! బ్రాహ్మణులు,
వరముల దెచ్చిన బాలునికి
పేరేమని పెట్టుదుము ?'
'మహాప్రభో, విన్నావా, ?
నీ యొక్క కుమారుడు
పండు దినబుట్టిన బాలునికి తం॥
కుమార రామ య్యనియేటి
పేరు మంచిది, పిలువండి'

మా. 'కుమార రామయ్య, కుమార రామయ్య' అని బ్రాహ్మణులు

పిలచిరి ; రాజు కచేరీన ఉండువారు అందఱు పిలచిరి ; తల్లి పిలచెను; దాదులు పిలచిరి ; రాజుకుమారుడు కుమారరామయ్య అని పట్ణము ప్రజలందఱు పిలచిరి.

'మఱి దాది సంగ కుమారుని యేమని పిలువనయ్య ?'

'మహాప్రభో, పండున పుట్టినదె తొలక, తొలకను పుట్టినదే పండు. విచారించగ రెండును ఒకటిగానె ఉన్నది ; దాది సంగ కుమారుని పోలిక రాముడు అని పిలుచుటకు బహుయోగ్యముగ ఉన్నది.'

బ్రాహ్మణులకు బియ్యం బేడలు వస్త్రములు యిచ్చి సాగనంపించిరి. ఆ రోజున పన్నెండుపుట్ల మేలు మేలు !
బియ్యము వండించి శూద్రులకు అన్నప్రదానము చేయించెను.

ఆరోజున చిన్నవాండ్లకు
అన్నముకూడ ముట్టింది.
అట్లా ఏడాది గడచెను
రెండవ యేడువచ్చెను తం॥
తప్పటి అడుగులు బెట్టుదురు;
రెండేడ్లు వెళ్లెను
మూడవ యేడువచ్చెను
దూముదాముగ నడచెదరు
మాటలు బాగుగ వచ్చెను తం॥
బొంగరాలు ఆడుదురు
జర్రీ పట్టీ లాడుదురు
మూడేండ్లు వెళ్లెను.
నాలుగవ యేటను బాలులు
'అన్నయ్యా వచ్చెదవా?'
'ఎక్కడికి రాముడ?'
'పెద్ద బజార్లు చూచెదము'.
తండ్రి యెఱుక లేకుండ

కుళ్లాయీలు పెట్టిరి
జరి అంగరకాలు దొడిగిరి
రుమాల నడుముల గట్టిరి
చెట్ట పట్టాల్ పట్టుకొని
పెద్ద బజారుకు వచ్చిరి.
అక్కడ కోమటివారి పిల్లలు తం॥
బ్రాహ్మణవారి పిల్లలు
జర్రీ పట్టీ లాడేరు.
'ఎవరోయి ! పిల్లలు
మేము కూడ ఆడుదుమా ?'
'రండెయ్యా, రండెయ్యా.'
'అన్నయ్యా, ఉద్దీలు పట్టించు,
నేను యేర్చుకొనెద నన్నయ్యా.'
ఉద్దీలను పట్టించె
పోలికె రాముడు యేర్చుకొనె
ఆవల యీవల చీలిరి
ఆ నడుమ అడ్డు గీచిరి. తం॥

మా. 'అన్నయ్యా, ఈ సంవత్సరం మీరు గెలచిన సరె, మేము గెల్చిన సరె, మేలు మేలు !

యీయేటికి యెవరికి అక్కరలేదు. రెండవయేడు మేము ఓడినాము అనుకొనవలసినది.' 'మంచిది' అంటె 'మంచిది' అనుకొని ఆవల యీవల నిల్చిరి.

జట్టీపట్టీ లాడిరి.
పోలికె రాముడు ఓడెను

కుమార రాముడు గెలిచెను.

మా. కుమారరామయ్య వైపున ఉండే యుద్ది బ్రాహ్మణవారి చిన్నవాడు అన్నాడు గదా.

'పోలిక రాముడ ! ఓడితివి'.
'ఇందాక జెప్పితినే, తం॥
న్ని నెవ్వ రడుగ మన్నారు?'
'ఏమైతేయే మోడితివోయ్.'
'నేను చాల ఓడితినా ?'
బ్రాహ్మణవారి బాలుని
ఒక్క గుద్దు గుద్దెను.

గుద్దుకు చచ్చెను బ్రాహ్మణుడు.
కోమటి వారి బాలుడు
'ఎందరినని చంపెదవు ?' తం॥
ఎదురు మరలి వచ్చెను.
వానిని చెంపకాయ వేసెకదా
వాడు గిరగిర తిరిగి చచ్చెగదా.
'అన్నయ్యా వచ్చెదవా ?' తం॥

మా. అన్నదమ్ములు యిద్దరు గుప్పచప్పు మనకుండ కోటలో జొరబడినారు. తతిమ్మా పిల్లలు పోయి వారివారి యిండ్లకాడ చెప్పవరకు, ఆ మాటలు వినగానె ఆచిన్నవారి తల్లిదండ్రాదులు మేలు మేలు !
గోడుగోడు మనుచు దుఃఖపడుచు చచ్చిన పిల్లల భుజముపై వేసికొని కోటగాని లోనికి వచ్చి శవములను దింపి ఏకశోకము పెట్టుచున్నారు. 'ఇదేమి', అని అడగగానె, 'రాజుకొమారులు కుమార రామయ్య, పోలికె రాముడు మా బజారుకు ఆడుకొనవచ్చి మా చిన్నవారిని ఇద్దరిని చంపినారు. మేమెట్లు భరింతము ? రాజు ఇంతవప్పటినుంచి రాజరికం చేయుచుండగ ఎన్నడును మేలు మేలు !
యీలాగంటి సంగతులు యీ పట్ణములో నెఱుగము,' అని గోల యెత్తుచునుండగానె, యీ రద్ది రాజుగారు విని

'మీరాసాహెబు, మన కోటగానిలో యేమో గల్లత్తు అవుచున్నది ?'

'ఏమి మహాప్రభో, మన కుమార రామయ్య మేలు మేలు !
పోలికె రాముడుకూడ వెల్లి పిల్లలతో కలసి ఆడుకొనుచు బ్రాహ్మణవారి పిల్లవాని ఒకని, కోమటివారి పిల్లవాని ఒకని జంపి వచ్చినారట ! వారి తల్లిదండ్రాదులు ఆ చచ్చిన శవాలను యెత్తుకవచ్చి మన కోటగానిలో బడవేసినారు.'

అనగానె రాజు,

'వీరు పుట్టడమేమి, నాపట్ణమునకు అప్పుడే రద్ది మేలు మేలు !
రావడమేమి ? నా రాజరికానికి యేమి పరువుదక్క గలదు ? ఈ ఫిర్యాదు యేలాగున సముజాయింతును?'

అని ఆభోజీపంతులను పిలుపించి

'అది యేలాగంటి సంగతో విచారించి, అవతలకు పంపించుము' అనెను.
అప్పుడు ప్రధానివచ్చి, మేలు మేలు!

'ఏమయ్యా, యీ రద్ది?

'అయ్యా! మా బిడ్డలను రాజుగారి కొమాళ్లు చంపినారు. ఇక మేము కూడ బ్రదుకము.'

అని అనగానె

'మీరు యేడిచిన నేమివచ్చును? పోయిన చిన్నవారు మరల వచ్చెదరా? మాతో చెప్పిన నేమగును? మేలు మేలు!
వారికి ఆయువే ఉన్నట్టు అయితె బ్రదుకనె బ్రతుకుదురు. వారి ఆయువుబలము అంతె ఉన్నది; కాని నింద స్తుతి మాత్రము మీరికి వచ్చినది. మీరు అదృష్టము తక్కువ, అని వారిని సముజాయించి నందరూపాయలు ఇప్పించి వారిని సాగనంపించెను. ఆవర్తమానము రాజుగారితో చెప్పెను. మేలు మేలు!
రాజుగారు కుమారరాముని పిల్పించి,

'కుమార రాముడ!'
'ఏమేమి, ఓనాయన!'
'బ్రాహ్మణవారి బాలుని,
కోమటివారి కుఱ్ఱవాని
ఆడుకొన బోయి చంపితివా?'
'నేనుయెఱుగనె, ఓ బాబు!
నే నెంత మాత్రము యెఱుగను.' తం॥
'ఓరి! పోలిక రాముడ!'
'ఏమే ఓ బాబయ్య!'
'ఆడుకొనబోయి రాముడ!'
'పిల్లల నిద్దరిఁ జంపితివా?'
'నే నంతటి పాపకర్ముడనా?
నే నెరుగనె ఓ బాబు.'
ఒకళ్ల నొకళ్లు గుద్దుకొని
నామీద చెప్పిరి.
'రేపటి మట్టి మీరేమి
కోట బైటికి పోయినను
స్తంభానికి గట్టించి
కంచీలతో గొట్టింతు.'
'ఇక బోమే బాబయ్య!'
ఆ వేళ మర్నాడు త॥
అల్లే కోటలో నున్నారు;
మూడవనాడు లెగిసిరి,
'అన్నయ్యా వచ్చెదవా?'
'ఎక్కడికిర రాముడ?'
'వీధికి బోతే రద్దాను
మన పూవులతోటలో నాడుకొని
మరలి యింటికి వచ్చెద మన్నయ్య.'
'మంచి' దంటు లెగిసిరి.
ఊరుబయలున ఉన్నట్టి
పూవులతోటకె వచ్చిరి.
పూజారివారి పిల్లలు తం॥

స్వామివారి పూజకు
చెళ్లక్కి పిల్లలు
పువ్వులు గోయుచు నున్నారు.
'ఎవరోయి! పిల్లలు!'
'మేము పూజార్లమూ రామయ్య.'
'మా తండ్రి యెఱుకలేనిది
పువ్వులు యెట్లా కోయుదురు?'
'మాకు రోజురోజు సెలవేమి?
దణ్ణాలుగ స్వామికి
యీ వన మిచ్చె మహారాజు.'
'దిగిరండోయి చెప్పెదను.?'
'దొంగలమూ రామన్న?'
'దొంగలో దొరలో దిగిరండి.'
చెట్టు దిగిరి పిల్లలు.
ఇద్దరిని చేబట్టి
పోలిక రాముడు
త్రిప్పి చెట్టుకువేసి కొట్టెను.
ఒక్క దెబ్బకె చచ్చిరి,
వత్త్రవాగులో బెట్టిరి
మన్ను పోసి బిగద్రొక్కిరి
తిరిగి కోటకు వచ్చిరి.

మా. ఆ చిన్నవాండ్ల తలిదండ్రాదులు జాముప్రోద్దు ఎక్కినకాడనుంచి సాయంకాలమువఱకు చూచిరి, ఎక్కడను జాడలేక పోయిరి. మేలు మేలు!
పట్ణమంతయు ఇల్లిల్లూ వెదకి, 'చూచినారా, మా చిన్నవాండ్లను?'

అని అడుగగా

'మేము యెవ్వరము యెఱుగము' అని చెప్పగానె, అక్కడనుంచి బావులన్నియు వెదకిరి. వనములన్నియు వెదకుచుండగా ఊర పసుల దోలుకొని పిల్లలు పట్ణము లోనికి వచ్చుచున్నారు. వీరు మహాదుఃఖపడి వనములు అన్నియు వెతకుచునుండగ పసులకాడి పిల్లలు జూచి 'ఏమిటమ్మా, తోటలన్ని వెదకులాడుచు నున్నారు?' 'నాయనా! మాచిన్నవాండ్లు స్వామివారికి పువ్వుల కోసము యీతోటలోనికి వచ్చినారు. మరలి ప్రొద్దుటిమట్టివారి జాడ లేదయ్యా, అందుచేత వెదకుచునన్నాము.'

అనగానె,

అందులో ఒక చిన్నవాడు ఏమన్నాడనగా,

'మీ చిన్నవాండ్లు అని నే నెఱుగ; గాని ప్రొద్దున నేను పశువుల దోలుకొని పోవుచునుండగా చెట్టు మీద యిద్దరు పిల్లలు ఉన్నారు. కుమారరాముడు పోలికె రాముడు యిద్దరును ఉన్నారు. పోలికెరాముడు ఆ యిద్దరి పిల్లలను చంపి, వత్త్రె వాగులో బెట్టెను.'
వారు, 'అంభో' యని అడలుచును
వారు వత్త్రెవాగె వెదకిరి.
పిల్లల బాతిపెట్టె ఉన్నారు.

'అయ్యో! నాయన, యేమిసేతు ?'
అోమ్మోఅోమ్మో గుద్దుకొని
ఇద్దరిని పెళ్లగించి
భుజమున వేసికొని వచ్చిరి
దరవాజకాడ దింపిరి
గోలలు యెత్త సాగిరి.

మా. 'ఏమని' అందఱు అడుగుచునుండగానె, మేలు మేలు!

'నాయనా! కుమార రామయ్య, పోలిక రామయ్య యీ యిద్దరును, మా చిన్నవాండ్లు యిద్దరును పూవులు గోయుచు నుండగా మా చిన్నవాండ్లను యిద్దరిని చెట్టుకు వేసికొట్టి వత్తెవాగులో బూడిచిపెట్టి వచ్చినారు. ఇక మేము బ్రతుకము నాయనా. ఉరిపెట్టుకొని చచ్చెదము.'
అని బావులకు పరుగెత్తుక పోవుదురు. ఈ రద్ది రాజుగారు విని,

'ఏమోయి! మీరాసాహెబు, మన కోటగవనిలో రద్దేమి?'

'మహాప్రభో, మన పోలికె రాముడు కుమార రాముడు పూజారివారి పిల్లలను యిద్దరిని చంపి వత్తెవాగులో బూడిచిపెట్టి వచ్చినారట. మేలు మేలు! ఆ పిల్లలనిద్దరిని తెచ్చి మన కోటగవనిలో బడవేసి ఉరులు పెట్టుక చచ్చెదమని, వారి తల్లిదండ్రాదులు మొరలు పెట్టుచున్నారు.'

'ఇదేమోయి, నేను రాజరికం చేసే రాజునని ఒకతప్పుకు బకసాయించెదరు. పొడుగున యిద్దరిని ముగ్గురిని చంపుచుంటె వాండ్లు యెట్లు ఓర్చేరు? ఎవరి పిల్ల వారికె ముద్దు. నాకు సంతానం లేకపోయిన దుఃఖం లేదు. తాలూకా పట్ణమంతయు రద్ది ఆయెను. ఈ తగవు నేను తీర్చలేను,' మేలు మేలు!
అని రాజు విచార పడుచు కూర్చున్నాడు.

ప్రధాని అభోజిపంతులు సరదార్లు ముగ్గురు వచ్చి ఈ పూజారివారలు బహుమంచివాండ్లు.

'ఏమయ్యా, శవమును తెచ్చి యిక్కడ వేసినారు?'

'అయ్యా, కుమార రామయ్య పోలికెరాముడు మా చిన్నవారిని యిద్దరిని చంపినా'రని

చెప్పగానె, మేలు మేలు!

'చంపగానె చూచినవారు యెవరు? వీరిని వారె కొట్టినారో? వారిని వీరె కొట్టినారో? వారికి ఆయువుండగా బ్రతికినారు. వీరికి ఆయువు లేకుండ చచ్చినారు. ఈ వర్తమానం రాజుగారు విని తన కుమారులను చంపవలెనని దీక్షచేత కూర్చున్నారు. ఆ హత్యకూడ మీ కెందుకు? మీ చిన్నవాండ్లు పోయినవాండ్లు మళ్లీ వచ్చెదరా? ఏడ్చినందున సార్థకం యేమి ఉన్నది?'

అని వారిని సముజాయించి పంపించిరి. ఆ వర్తమానమురాజుగారితో చెప్పిరి. మేలు మేలు!

అప్పుడు కుమారరాముని పిలిచెను:
'ఓరి! కుమార రాముడ!
పూజారివారి పిల్లలను
నీ వెందుకు చంపితివి?' తం॥
'నే నెఱుగనె ఓ బాబు.'
పోలికె రాముని పిలిచెగద.
వాడు దుఃఖపడుచు వచ్చెను
'ఓరి! పోలిక రాముడ!
పూజారివారి పిల్లలను
నీ వెందుకు చంపితివి?' తం॥
'నే నెఱుగనె, ఓ బాబూ!
నే నంతటి పాపకర్ముడనా?'
'ఎందుకు దుఃఖ పడకుర.'
'నా కెక్కడి నిందలు వచ్చును
నే నెఱుగనె ఓబాబు'
'మంచిది పో'మ్మనిపంపెను.
'మిమ్ము బందోబస్తు చేసెదను'.
ప్రధానిని పిలుపించి

మా. 'ఏమయ్యా, చిన్నవాండ్లు కోటలోనుండిన యీ పట్టణమంతయు గాడుపోవును. చిన్నవాండ్లను ఖైదులో వేయుదమనిన మనకు నిందగ నుండును.

'మహాప్రభో, ఖై దెందుకు గనుక? నాగంభొట్లు బ్రాహ్మణుడు బహు దిట్టమైనవాడు. ఆ బ్రాహ్మణునికి అప్పగింత బెట్టి మేలు మేలు! పట్ణానికి పన్నెండామడ పొడుగున అరణ్యములో చదువుల బడి కట్టించి అక్కడికి మోయమతి సరంజాము బ్రాహ్మణునికి పంపించి మేలు మేలు! యెనిమిది సంవత్సర ములదాక పట్టణములోనికి రాకుండ చిన్నవాండ్లను బందోబస్తు చేయింతము'

అనగానె, రాజుగారు సంతోషించి చదువు చెప్పె నాగంభొట్లను పిలిపించి,

'బ్రాహ్మణుడా, నీ దగ్గర యెన్ని సంవత్సరములు చెప్ప చదువుఉన్నది?'

'మహాప్రభో, చదువుకు సాముకు అంతమున్నదా? పన్నెండు సంవత్సరములు దాక చెప్పు చదువు నాదగ్గర ఉన్నది'.

'అంతే చాలును. మా చిన్నవాండ్ల నిద్దరికిని దిట్టముగ చెప్పి యెనిమిది సంవత్సరములు వెళ్లిన తరువాత తీసుక వచ్చి నాకు ఒప్పగింత పెట్టండి.'

'బడి యెక్కడ పెట్టుమని సెలవు యిచ్చెదరండి?' మేలు మేలు!

'బడి పట్టణములో కూడదు. ఇక్కడికి పన్నెండామడ పొడుగున అరణ్యములో చదువుల బడి కట్టించెదను. బియ్యపు గోనెలు, కల్పుకూర వగైరా సామాను అక్కడికి పంపుచుందును. చిన్నవాండ్ల తీసుక వెళ్ల'మనెను.

చిన్నవాండ్లను యిద్దరిని వెంటబెట్టుకొని బ్రాహ్మణుడు మోయమతీ సరంజాము యెడ్లమీద కట్టించుకొని కంసాల బత్తులను వెంబడి పెట్టుకొని అరణ్యమునకు వెళ్లి ౧౫ రోజులకు చదువుల బడి కట్టించుకొని మంచివారముగ విచారించి చిన్నవాండ్లకు యిద్దరికి స్నానముచేయించి విఘ్నేశ్వరుని పూజ చేయించి, మేలు మేలు!

ఓనమలు వ్రాసెరు.
'కుమార రామయ్యా! తం॥
ఓనమలు దిద్దండి,
కుమార రాముడు దిద్దె గద;
పోలికె రాముడు చూచెను;
'ఇటువంటి చదువేన
మాకు జెప్పబోవునది'?
'ఓరి! పోలిక రాముడ,
చదువుకు మొదలు ఇదేను,
ఓ న మ లు దిద్దర'.
'వచ్చినవి పంతులు
క్రొత్తది ఒక్కటి చెప్పండి'. తం॥
అ ఆలు వ్రాసెను.
ఉగ్గడించి వేసిరి;
క ఖలు వ్రాసెను,
ఉగ్గడించి వేసిరి;
త థలు వ్రాసెను,
ఆకళింపు జేసిరి;
య ర వలు వ్రాసెను,
ఉగ్గడించి వేసిరి;
మూడు ఘడియలకు బాలులు
క ఖల గుణింతం తం॥
గుణకారం భాగారం
ఉగ్గడించి వేసిరి;
నాలుగవ ఒక్క గడియకు
బాలరామాయణము చదివిరి;
అయిదవ గడియకు బాలులు తం॥
అమరమంతయు జదివిరి;
ఆఱవ గడియకు బాలులు తం॥
గజేంద్రమోక్షము చదివిరి;
ఏడవ గడియకు బాలులు
రుక్మిణీ కల్యాణము జదివిరి;
ఎనిమిదవ గడియకు బాలులు
భారతము చదివిరి; తం॥
*పదునొకండవ గడియకు
కావ్యము జదివిరి
భరతశాస్త్రము చదివిరి;
పన్నెండవ గడియకు
వేదపనసలే చదివిరి;
పదమూడవ గడియను
'ఏమయ్యా! పంతులు,
క్రొత్తది ఒకటి చెప్పండి'.
'ఇక నాకు రా' దనెను.

* తొమ్మిది పదిగడియల ప్రస్తాపములేదు.

మా. 'ఏమయ్యా బ్రాహ్మణుడా, మా తండ్రిగారితోటి చదువుకును సాముకును ఆది అంతము ఉన్నదా? నాయొద్ద పన్నెండు సంవత్సరములు చదువు చదువు ఉన్న దంటివి. పన్నెండు గడియలకే ఇక నాకు రాదనుచున్నావు'. మేలు మేలు!

'ఏమయ్యా! మీరు విద్యాదానము చెసికొన్నారు గనుక, శ్రీరాముల వారి వరప్రసాదము గాబట్టి లోకులకు పన్నెండు సంవత్సరములకు వచ్చు విద్య మీకు పన్నెండు గడియలకే వచ్చినది. వచ్చు టంతయు మీకే నయం కాదటయ్యా'?

'అయితే, నీకు నష్టమా బ్రాహ్మణుడా?'

'నాకు నష్టమేనయ్యా. మీ మూలకముగా పది పన్నెండు సంవత్సర సంవత్సరములు జీవించవచ్చును, ఇకడనుంచి వెళ్లి మళ్లీ యేరాజునైన అనుసరపక్షము చెయ్యవలెను.' మేలు మేలు!

'బ్రాహ్మణుడా, మమ్మునుంచి నీవు యెందుకు చెడిపోయెదవు? చదివి నదే మేము చదువుచు ఆరునెలలదాక ఉందుము,'

అని బ్రాహ్మణునితో చెప్పగా బ్రాహ్మణుడు సంతోషించెను. బ్రాహ్మణుడు యేమి చేసెననగా, 'నేను గనుక స్నానమునకు వెళ్ళితినా దిద్దుపెట్టి వీరు పట్టములోనికి వెళ్లుదురేమో?' అని బ్రాహ్మణుడు ప్రొద్దుగ్రుంకుపరియంతం భోజనముచేయక అట్టె ఉండెను. వీరు ముమ్మాటు భోజనముచేసి ప్రొద్దుగ్రుంకిన తరువాత మళ్ళీ భోజనముచేసి అన్నదమ్ములు ఇద్దరూ ముసుగు పెట్టుకొని పండుకొనిన తరువాత అప్పుడు బ్రాహ్మణుడు స్నానముచేసి వచ్చి భోజనముచేయును. అట్లే ప్రతిదినము జరుపుచు ఉన్నాడు. ఒకనాటి మధ్యాహ్నమందున కుమారరాముడు పోలికరాముడు ఇద్దరిని పండుకొననిచ్చి పాతాళగంగకు బ్రాహ్మణుడు స్నానమునకు వెళ్ళినాడు. మేలు మేలు!

పోలికరాముడు లేచెను
చదువుల బడికి వచ్చెను.
అక్కడ నున్నది మడిసంచి
మరచి పోయినాడు బ్రాహ్మణుడు.
అది గురివింద పొదలో దాచిపెట్టి
అన్నదగ్గర పడుకొనెను.
నిండు ముసుగు బెట్టెను
దొంగగురక పెట్టెను.
స్నానముచేసి బ్రాహ్మణుడు
మడిసంచిని చూచుకొనె
మడిసంచి లేదయ్యా.
'నేను మడిసంచీ మరచితిని
అజాగ్రత్త పడితిని.'
చదువుల బడికి తిరిగివచ్చె.

ఎక్కడ చూచిన లేదుగా !
'ఎక్కడ బోతివె మడిసంచి ?
నీ వేడ బోతివె పుస్తకమా ?
నీ వేడ బోతివె జపమాలా ?'
ఎక్కడ వెతకిన లేదాయె. తం॥
'కుమార రామయ్యా !'
'ఏమయ్యా ! పంతులు'?
'నా మడిసంచిని చూచితివా ?'
'నేను ఎఱుగను పంతులు'
'విద్య చెప్పెడు గురు వేమి
మడిసంచిని దాచెదనా ? తం॥

దాచితె మీకు ఇవ్వనా ?'
'నా జీవనమే పోయెను.'
'మా పోలికె రాముని అడుగండి.'
'నీవే అడుగు రామయ్యా
'ఓరి ! పోలికె రాముడ'
'ఏమే ! ఓ అన్నయ్యా, తం॥
'చదువు చెప్పు పంతులది
మడి సంచిని దాచితివా ?'
'అంతటి పాపకర్ముడనా
విద్య చెప్పెడు గురువేమి
మడి సంచిని దాచెదనా ?'

మా॰ 'పోలికె రాముడ, నీవు ఎఱుగక పోతివి, నేను ఎఱుగక పోతిని. ఇక్కడి సొమ్ము యేమై పోయినదిరా ? ఇతరులు యెవరైన వున్నారు గనుక పట్టుకపోయినా రనుకొందమా ?'

అనగానె బ్రాహ్మణుడు అనెను గదా. మేలు మేలు !

'కుమార రామయ్యా, ఇది పోలికరామయ్య పనే'. ఆమాట పోలికెరాముడు విన్నంతటనె,

బ్రాహ్మడివంకను జూచెను
పండ్లు పటపట గొరికెను
గుడ్లు యెఱ్ఱ జేసెను

'దొంగతనము కట్టితివా,
నేను దొంగనా పంతులు ?'

మా. 'పోలికె రాముడా, నీకు దొంగతనము కట్టలేదు. ఒకవేళ తీసినా వేమో అని అన్నాను'.

'నే నెంతమాత్రము యెఱుగను.'
'ఓరీ ! పోలిక రాముడా,
మన తండ్రితో జెప్పను

తీసిన యివ్వర రాముడ.' తం॥
'నె నెంతమాత్రము యెఱుగనె.'

మా. బ్రాహ్మణుడు యేమనుచున్నాడు.

'కుమార రామయ్యా, నేను పాతాళగంగలో స్నానముచేసి ఆ మడి సంచిలో విభూతి ధరించుకొని జపమాలికె నేత్రముల నద్దుకొని పుస్తకము చూచుకొనినెగాని గంగదాహం పుచ్చుకొనుట లేదు, నా గాయత్రి సాక్షిగాను.

'బ్రాహ్మణుడా, పుస్తకములో ఏమిఉన్నది ?'

'అయ్యా, అది విప్పిచూచిన మూడామడ ముచ్చట, యేడామడ యేకాంతం కూడ తెలియును.' మేలు మేలు !

'కావుననె, ఆశపడినాడయ్యా, పోలికె రాముడు. వాడు చచ్చినను ఇక దానిని యివ్వడు'

బ్రాహ్మణుడు,

'నా మడిసంచి దొరకిన దాక నేను భోజనము చెయ్య'నని దీక్ష పట్టుకుని కూర్చునెను.

పోలిక రాముడు యేమనుచున్నాడు.

'బ్రాహ్మణుడా, ఎన్ని దినములు అట్లా ఉండెదవో ఉండు'.

'పోలిక రాముడా, దాసీపుత్రుడవు అయినందున, నీ దుర్గుణపు మాటలు విడువవైతివి. నేను చచ్చినను నీవు చూచుచునుండువాడవె. మిమ్ము తీసుకపోయి మీ తండ్రిగారికి ఒప్పగింతపెట్టి నేను వెళ్లెదను పద'అన్నాడు.

'మంచి' దంటు లెగిసిరి
ముగ్గురు కూడుక వచ్చిరి తం॥
వసవల్లి దుర్గముకు
రాజుగారి కొలువుకు.
బ్రాహ్మణుని చూచెను మహరాజు
'ఏమయ్యా ! బ్రాహ్మణుడ,
ఎనిమిది యేండ్లకు రమ్మంటె

అప్పుడె తీసుక వచ్చితివి ?'
'అయ్యా, మడిసంచి పోయినది
నా జపమాలికయు బోయినది
కుమార రాముని అడిగితిని
పోలికె రాముని అడిగితిని
మేము యెఱుగ మన్నారు తం॥
ఆ మడిసంచిలో విభూతి

మా. 'నేను మడిసంచిలోని విభూతిని తీసుకొని స్నానముచేసి ధరించుకొని జపమాలికె నేత్రాలకు అద్దుకొని పుస్తకము జూచినగాని భోజనము చేయుట లేదు. రెండురోజులు చూచినాను, ఎంత మాత్రము ఇవ్వక పోయినారు. ఈ మట్టుదాక నేను భోజనము చేయకనే యున్నాను. నేను మళ్లీ ద్వీపాంతరములకు వెళ్లి పర్వతములందున ఉండే మునీశ్వరులనుచూచి మంత్రోపదేశమై యీ జపమాలికె పుస్తకము సంపాదన చేసికొనినగాని అందాక భోజనము చేయను. మీ కుమాళ్లను మీకు ఒప్పగింత పెట్టినాను. నా జీతమునాకు ఇప్పించండి, నేను వెళ్లుతాను.'

అనగానె బ్రాహ్మణుని జీతము లెక్క చూచి యిప్పించి సాగనంపించెను.

కుమార రాముని పిలిచెను తం।
'ఓరి ! కుమార రాముడా,'
'ఏమే ! ఓ నాయనా,
'చదువు చెప్పు బ్రాహ్మనిది
పుస్తకమును చూచితివా ?'
'నేను యెఱుగ' నన్నాడు.
'ఓరి! పోలిక రాముాడ !'
'నీకు చదువుచెప్పె బ్రాహ్మనిది
మడిసంచి తీసితివా ?'
నాకు యెందుకే బాబయ్యా,
నేనంతటి పాపకర్ముడనా
నాకు యెక్కడి నిందలు వచ్చేను
ఎంతమాత్రము యెఱుగను.' తం॥
ఎఱుగక పోయిన పోమ్మనెను.
తల్లి మేడకు వచ్చిరి
అన్నదమ్ములు భుజియించి తం॥
'అన్నయ్యా! వచ్చెదవా?'
'ఎక్కడకు రాముడా ?'
'పెద్దబజారుకు పోదాము.'
'మంచి' దనుచు వచ్చిరి.

పెద్దబజారు నడుమను
కోమటివారి పిల్లలు
శూద్రవారి పిల్లలు
నాలుగు స్తంభా లాటలు
వారు ఆడుచునున్నారు.
'అబ్బీ ! మేము ఆడుదుమా ?'
'మనుషుల జంపేవు రాముడ.' తం॥
'నేను చంపను రండోయి.'
వారిద్దరు వీరిద్దరు
నాలుగు స్తంభాలు గీచిరి
నాలుగుమూలల నలుగురు
స్తంభాలనడుమ నిలిచిరి
'బలమ జెప్పుము తమ్ముడ'.
పోలికె రాముడు చెప్పెను,
చుట్టు తిరిగి రామునికి
తన మీదికె వచ్చినది.
పోలికె రాముడు తిరుగవలె,
నడుమ పోలికె రాముడు తిరిగె గదా
ఎంత మాత్రము దొరకరు
గడియసేపు తిరిగెగదా.

మా. కోమటివారి పిల్లవాడు తూరుపువైపు స్తంభములోనుంచి పడమటివైపు స్తంభములోనికి దుమికి పోవునప్పటికి

నడుమ ఒక్క గుద్దు గుద్దెను, తం॥
గుద్దుకు వాడు చచ్చె గదా.
శూద్రవారి బాలుడు
ఎదురు మళ్ళి వచ్చెను
'నీవు రాజుకొడుకువైనను

మనుసుల జంప మన్నారా ?'
వాని చెంపకురికి పుచ్చుకొనె;
ఆ దెబ్బకె వాడు చచ్చెను.
మొదలకుండ వచ్చిరి
కోటలోపల జొర బడిరి. తం॥

మా. కొంతసేపటికి ఆ పిల్లకాయల తల్లులు విని గోడుగోడున దుఃఖపడుచు 'మా సంతానమునకు నీళ్లు పోయుటకే రాజుకు సంతానముగలిగె గాబోలును' అని శవములను తీసుకవచ్చి కోటగవునిలో బడవేసి గోడుగోడున దుఃఖపడుచు ఉండంగా పదిమందివచ్చి, 'ఏమే' మని అడుగుచుండగా,

'అయ్యా, మా చిన్నవాండ్లు ఒకరి వీధికి పోరు, ఒకరి యింటికి పోరు. మా వాకిటి ముందర ఆడుకొనుచుండగా యీ కుమారరాముడు మేలు మేలు! పోలికె రాముడు కూడా వచ్చి బిడిగల్లుగా ఇద్దరిని చంపినారయా. మే మెట్లు బ్రదుకుదుము,'

అని దుఃఖపడుచుండంగా, ఈ రద్ది రాజుగారు విని,

ఏమోయి ! మీరాసాహెబు, మనకోట గవనిలో రద్ది అవుతుంది.'

'మహాప్రభో, మళ్ళీ పట్ణమునకు రద్ది వచ్చినది. అయ్యా, కుమారరాముడు, పోలికెరాముడు ఇద్దరు వెళ్లి యిద్దరు పిల్లకాయలను చంపివచ్చినారట.'

అనగానె రాజు ఖిన్నుడై

'అయిదుయేండ్లమట్టి *రద్ది లేకుండ ఉన్నది పట్ణము. మళ్లీ పట్ణానికి రద్ది వచ్చినది. ఈ పిల్లవాండ్లను హదవు చేయు ఉపాయము నాకు తోచలేదు.'

అని రాజు విచారించుచుండగానె, రాజుగారి ప్రధాని చక్కగ వచ్చి,

'ఏమి, మాకోట గవనిలో ఈ రద్దేమి ? అల్లరిసేయ దలచుకున్నారా ? వారు యేమూాలముగ చచ్చినను కుమారరాముడు, పోలికెరాముడు చంపినారని చెప్పుదురా ? మీకు శక్తిఉండిన రాజుగారి మీద ఫిరియాదు చెయ్యండి.'

'మహాప్రభో, అంతకు అధికార్లమా మేము ? అంత అధికారముండిన యింత లెక్క వచ్చియుందుమా ? అన్నముపెట్టి ఆదరించు మేలు మేలు! ప్రభువు ఆయనేగాని ఇంక వేఱు ప్రభువు ఉన్నారా?'

'రాజుతో చెప్పినను యేమి లేదు. ఫిర్యాదు చేసినను యేమి లేదు. పోయిన చిన్నవాండ్లు మళ్లీ వచ్చెదరా ? ఆయువుండిన వారే బ్రతుకుదురు.'

అని వాండ్లను సముజాయించి వందరూపాయలిచ్చి పంపించెను. రాజుగారితో యీ సమాచారము జెప్పెను.

'ఇట్లాగంటి ఫిరియాదులు ఎన్ని అని సముజాయించెదవు ? ఎన్ని అని విచారించను ? చిన్నవాండ్లను యెట్లు బందోబస్తు చేయుగలను ? చదువుల బడిలో ఒప్పగింత పెట్టగా పంతులను దుద్దుపెట్టి పట్ణములో జేరిరి.'

* చదువుల బడిలో కుమారరాముడు పోలికెరాముడు గడపిని కాలము కొన్ని నెలలు మాత్రమె; అయిదేండ్లు రద్ది లేకపోవుట యెట్లో ?

'మహాప్రభో, యింకేమియు లేదు. ఈపట్ణములో జెట్టీలు కాపురమున్నారు. ముప్పైముగ్గురు జెట్టీలకు గనుక ఒప్పగింత పెట్టితిమా నెలకొక ముప్పది వరహాలు పోయినను అట్టె పోవును. వాండ్లు ప్రొద్దంతయు సాదనాల గరిడీలో పడవేసి దండెములు తీయుచుచుందురు. లేచిన ఒకటి వంగిన ఒకటి పొడుచుచు నుంటారు. అట్లు వీరు వంగి రావలెనుగాని యింకొక విధముగ వీరు వంగిరారు.' మేలు మేలు !

'నాకును అంతే తోచినది. జెట్టీలం బిలిపించ'మనెను.

అనగానె, వీరమజెట్టి, పేరమజెట్టి, కోనమజెట్టి యీ నలుగురిని,* ముప్పైయింటికి సరదార్లను రాజుగారి యెదుటికి పిలిపించెను. మేలు మేలు !

'ఎవరోయి ! మీరు జెట్టీలటోయి ?'

'మహాప్రభో, అవును.'

'ఎన్నడును జెట్టీలు మాపట్ణములో ఉన్నారన్న సంగతి మాకు తెలియనే తెలియదోయ్.' మేలు మేలు !

'మహాప్రభో, కాపురము మాత్రము ఇక్కడనేగాని, దూరముగా పోయి పొట్టపోసికొనెదము.'

'ఎన్ని సంవత్సరములు చెప్పు సాము ఉన్నది మీదగ్గర ?'

'అయ్యా, చదువుకును సాముకును ఆదీ అంతముఉన్నదా ? పదిపన్నెండు సంవత్సరములు చెప్పు విద్య మాదగ్గర ఉన్నది.'

'ఈ మట్టుకు యెవరెవరికి మీరు సాము చెప్పినారు ?'

'అయ్యా, ఓరుగంటి ప్రతాపరుద్రునికి సాము చెప్పినాము. సుల్తాను భూపతిసింగుకు సాము చెప్పినాము. ఎఱభూపతి రాజుకు చెప్పినాము. కారుమొడ్డెప కక్కనపురాజుకు సాము చెప్పినాము. చెప్పిన జెప్పితిమి కాని మా సాము, మా లగువు, మా జారు, మా పట్టు, మా బిగువు, ఒకరికిని చిక్కలేదు.' మేలు మేలు !

'అలాగైతే సరె' అని 'మాచిన్నవాండ్రు యిద్దరికి సాదన చెప్పు'డనెను.

'మహాప్రభో, గరిడి యెక్కడైనా కట్టించెదరా ? కోటలోపలనె చెప్పుమనెదరా ?'

'ఈ పట్ణములో కూడనే కూడదు. ఇక్కడికి పన్నెండామడ పొడుగున

* నాలుగవ జెట్టి పేరుచెప్పలేదు.

చదువు చెప్పించడమునకు గరిడీ కట్టించినాము. ఈ చిన్నవాండ్లను అక్కడికి తీసుకవెల్లి సాము చెప్పవలసినది.'

'అయ్యా, మాకు అరణ్యమందున అన్నమునీళ్లు యెట్లు అందును ?'

'అక్కడ ఉండనే యున్నవి కాయకూరలు. కలుపు చమురు బియ్యపు గోనెలు యిక్కడనుంచి పంపుచుందుము.'

'అయ్యా సాదనమునకు, యింకను చాల వస్తువులు కావలెను.'

'అవి యిప్పుడే చెప్పండి, వెనుకైనను ముందైనను పంపించుచుందుము'. మేలు మేలు !

'జారుస్తంభమొకటి కావలెను
లోడీలు కావలెను
బాణాకెట్టెలు కావలెను
పలీ గద్దా కావలెను తం॥
బల్లెములు కావలెను
డాలు కత్తి కావలెను
బాకులు రెండు కావలెను.'
ఇవి యెడ్ల మీద గట్టిరి.
తమ సరంజాము తీసికొని
పిల్లల నిద్దర దీసికొని
అరణ్యమునకు గదలిరి.
ముప్పై ముగ్గురు జెట్టీలు
ఆ చదువుల బడికి వచ్చిరి.
ఆ గరిడి బాగు చేసిరి తం॥
జారుస్తంభము పాతిరి.
'రండయ్యా ! రామయ్యా,
మీ కీళ్లన్నియు నలగవలె
నరముల పట్టు వదలవలె
మీరు సాదన యేమి చేయుదురు? తం॥
మాకు ప్రతిష్ఠ యెట్లు వచ్చునో ?
యేమోయి ! చెప్పండి.
మీరు నూఱు దండెములు తీయుదురా ?
సాదన దబ్బున వచ్చును.
'అంత తీసిన చాలునా ?'
'రెండు వందల దండెములు
మీ రిద్దరును దీయుదురా ?'
'అంత తీసిన చాలునా ?'
మూడు వందలు తీయుదురా ?'
'అంత తీసినచాలునా ?'
'ఇక నెన్ని తీయగలరు ?' తం॥
'ఆయిదు వందలు తీయుదుము
మూడు వందల గుంజిళ్లు
మేము లెక్కపెట్టి పెట్టేము'.
వారు ఆశ్చర్యపోయిరి
'మీ రంత మాత్రము దీసిన
సాము మీకు వచ్చును'.
అన్నాదమ్ములు లేచిరి
లాగులు ఇద్దరు దొడిగిరి
పైన కాశెకోకలు కట్టిరి తం॥
జోడుగ దండెములు దీసిరి
అయిదు వందల దండెములు తం॥
మూడు వందల గుంజిళ్లు
లెక్కపెట్టుచు తీసిరి.
'ఇంకను యేమోయి సాదనకు ?'

'లోడీలు త్రిప్పవలె.'
లోడీలు త్రిప్పిరి
త్రిప్పి దూరముగ వేసిరి.
'ఇంకను యేమోయి సాదనకు?'
'ఫలి గద్దా చెయ్యవలె.'
ఫలి గద్దా చేసిరి
చేసి దూరముగ వేసిరి.
'ఇంకను యేమోయి సాదనకు?'
'బాకు పట్లు పట్టవలె.' తం॥
బాకు పట్లు పట్టిరి
బాకుల మీద దిరిగిరి
చేతులు చేతులు పెనవేసి
చేతుల సాదన చేసిరి.
'ఇంకను యేమోయి సాదనకు?'
'బల్లెపు పట్లు పట్టవలె.'
బల్లెపు లగువులు చెప్పిరి.
'ఇంకను యేమోయి సాదనకు?'
డాలు కత్తి దీసిరి.
'డాలు సాదన జెయ్యండి.'
డాలు సాదన జేసిరి. తం॥
'జెట్టీ పట్లు పట్టండి.'
జెట్టీ పట్లు పట్టిరి. తం॥

జొమ్ములు జొమ్ములు గడియించి
జొమ్ముల సాదన జేసిరి;
కాళ్లు కాళ్లు పెనవేసి
కాలి సాదన నేర్చిరి;
'ఇంకను యేమోయి సాదనకు?'
'జారు స్తంభము ఎక్కవలె.'
తల్లక్రిందుగా వెళ్లిరి
తల్లక్రిందుగా జారిరి;
'ఇంకను యేమోయి సాదనకు?'
'జారు బండ దూకులు, తం॥
జారు బండ మీదికి
తొమ్మిది బారలు దూకవలె.
ఒక్కలగువు మీద దూకిరి.
అన్న దమ్ములు ఇద్దరికి
పన్నెండేండ్ల సాదన
పన్నెండు గడియలకె వచ్చెను.
'ఏమోయి! జెట్టీలూ,
క్రొత్తది ఒకటి జెప్పండి.'
'ఇకను మాకు రాదండి.' తం॥
'ఓరి! మీముండ మోయను!
మా తండ్రిగారి దగ్గరను
మా బగిలిమాటలు చెప్పితిరి.'

'నల్గురు జమీదార్లకు సాదన చెప్పినాము. మా లగువు, మా బిగువు, మా జారు, మాజగ్గు, మాలైలు వచ్చినదా అనగా మేలు మేలు! రాలేదంటిరి. ఇదేనంటోయి మీరు చెప్ప సాదన.'

'అయ్యా! మీరు తొల్లి విద్యాదానం చేసుకున్నారు. శ్రీరాములవారి వరప్రసాదులు, గనుక పన్నెండు గడియలకె వచ్చినది. ఇది మీకే నయముగాని మాకు నయము లేదయ్యా, కుమారరామయ్యా.'

'మాకు నయమేమి? మీకు నష్టమేమి?'

'మీ మూలముగా ఎనిమిది సంవత్సరములు జీవింపవచ్చునని యను

కున్నాము. మీకు పన్నెండు గడియలకే వచ్చినది, గనుక మేము తిరిగి యే రాజునైనను అనుసరణచేయవలెను'. మేలు మేలు!

'మావలన మీరెందుకు చెడిపోయెదరు? ఈ నింద మా కెందుకు? ఆరు నెలలు మేము యీ గరిడీలో నుందుము.'

అనగానె జెట్టీలు మహా సంతోషించిరి. వీరు, చేసిన సామే మళ్లీ చేయుచునుండిరి. ఒకనాటి మధ్యాహ్నమందు కుమారరామయ్య, పోలికరాముడు యిద్దరు భోజనముచేసి రెండు జాములప్పుడు పరుండగా మేలు మేలు!

పోలికె రామునికి
ఆ గురివిందపాదలో మడిసంచి
జ్ఞాపకమునకు వచ్చెను.
దిగ్గున లేచెను
మడి సంచిని తీసెను;
విప్పి చూచెను రాముడు తం॥
జపమాలికె యున్నది,
పుస్తకమే యున్నది,

అందులో సభకట్టు వాకట్టు
గ్రహాకట్టె యున్నది.
విప్పి చూచెను రాముడు
దక్షిణభాగమున గూర్చుండి
తన పట్ణంమీదుగ చూచెను
పట్ణములోని భోగముల
యేకాంతము దెలిసెను.

మా. ఆట్ణములోని భోగముల యేకాంతం యేలాగంటిదంటె, తమతండ్రి వీరకుంభిణి మహారాజు కంపిలి గంగావతి యనియేటి మేలు మేలు! పట్ణమునకు స్వారిమార్గము వెళ్లెను. ఆ పట్ణములో మద్దెల వీరసాని కూతురు మద్దెల మలసాని రాయమహాల్ మీద నున్నది. కన్నెరికము లేదు. రాజుసవారీ లోని తొలకరి మెఱపుగా మెఱసినది. రాజు మూర్ఛబోయిలేచి తన నౌకర్లను దగ్గరకు బిలిచి ఆరాయమహాల్ యెవరిదో విచారించమని నౌకర్లతో చెప్పెను.

వారు పట్ణములోనికి వెళ్లి,

'ఈ రాయమహాల్ యెవరిది?' అని అడిగితె,

'మద్దెల వీరసానిది' అని చెప్పినారు.

'ఆ రాయమహాల్ మీద నున్న చిన్నది వీరసానేనా?' మేలు మేలు!

'అదికాదయ్యా, దానికూతురు మలసాని. దానికి ఇంకను కన్నెరికము కాలే'దని చెప్పినారు. మేలు మేలు!

ఆ వృత్తాంతము రాజుకు తెలియజేసిరి.

అప్పుడు రాజుగారు యేమన్నారనగా,

'కన్నెరికమునకు మావసవల్లి దుర్గమునకు పంపించునేమో తెలిసికొని ర' మ్మన్నాడు. వారు పోయి ఆ మాట వీరసానిని అడిగితే,

'మహాప్రభో, అన్నము పెట్టు దాతలుంటే పంపించకపోవడమేమి? పంపించెద'నన్నది.

'మా రాజుగారు వెళ్లుచున్నారు, ఇంకను ఆలస్యమేమి? పంపించు' మనగానె శీఘ్రముగ సవారి బైటబెట్టించి మలసానిని సవారీలో నుంచుకొని రాజును, మలసానియు వసవల్లి దుర్గమువచ్చినారు. మేలు మేలు!
రాజుగారు పల్లకీ దిగినతోడనె బ్రాహ్మణులను బిలిపించి

'మా పేరట ముహూర్త బలము విచారించ'మనెను.
బ్రాహ్మణులు విచారించగా ఇరువై రోజులదాక ముహూర్తములేదు.

'మహాప్రభో, మీ పేరట యిరువై రోజులదాక ముహూర్తబలము లేదు' అనగానె తన రాయమహల్ ఖాళీచేయించి ఆ రాయమహల్ మీద యీ మలసానిని ఉంచి, అక్కడికి మగవారు యెవ్వరు పోకుండ ఖాయిదా చేయించి ముగ్గురు దాదులను దానియొద్ద కావలియుంచి మేలు మేలు!
బందోబస్తు చేయించెను.

ఈ వృత్తాంతము అక్కడ పోలికెరామునికి పుస్తకము ద్వార తెలిసినది.

అట్టె మడిసంచి కట్టెను
'నాకు జీవనమే దొరికెను.'
మంచి ఖుశాల్ పడినాడు తం॥
మలసాని మంచిదో
ఆలాగంట రాముడు.
మడి సంచి తీసికొని
అన్న దగ్గరకు వచ్చెను.
కుమార రామయ్య
నిద్ర బోవుచునున్నాడు
ఆ మడిసంచి దాచెను
గరిడీలోనికి వచ్చెను
ముప్పైముగ్గురు జెట్టీలు
టేకి సరంబీ యున్నది తం॥
సరంబి మీద కూర్చున్నాడు
'రండోయి! జెట్టీలు,
మీరు చెప్పిన సాదన
మీరు జెప్పిన ఎగువులు

మీరు ముప్పైముగ్గురు ఒకపట్టు
నే నొక్కడనె ఒకపట్టు
ఒక్కచేయి చూతాము.'
'విన్నావా రాముడా?
నీ చిన్నతనము చాలించు
మాతో యేమి గెలువను? తం॥
పుణ్యానికి చచ్చెదవు.'
'అట్లుగాదు రండోయి!
ఈకుంకలు అప్పుడే కొట్టిరి తం॥
ఈ రండలు గెలిచి పోయిరి
ఈ ముండలు అప్పుడె కొట్టిరి.'
నరసమ జెట్టికి కోపము
కోపము బుట్టి లేచెను.
కుమారరాముని యొద్దకు
తీవరముగ వచ్చెను.
'కుమార రామయ్యా;'
'ఏమోయి! జెట్టీలు?'

మా. "అయ్యా, మేము టేకుమ్రానుపై ముప్పై ముగ్గురము కూర్చుని యుండగా పోలికెరాముడు చక్కగవచ్చి, మేలు మేలు!
'మీరు ముప్పైముగ్గురు ఒక పట్టు, నేను ఒక్కడనె యొకపట్టు. ఒక చేయి చూతము రమ్మ'న్నాడు. చిన్నవాడు అని మేము సముజాయించుకొని ఊరకుండగా 'ఈరండలు అప్పుడే నన్ను గెలిచినారు, ఈకుంకలు కొట్టినా'రంటాడయ్యా. విన్నారా?"

'ఓయి! జెట్టీలారా, పోలికెరాముడు దాసీపుత్రుడు; గనుక దుర్గుణపు మాటలు ఆడినాడు; వానిజోలికి పోక మీ పనిలో మీరు జాగ్రత్తగఉండండి.'

వీరు తిరిగివచ్చి టేకుమ్రాను మీద కూర్చున్నారు. మేలు మేలు!

మళ్లీ పోలికెరాముడు చూచెను
'ఏమోయి! జెట్టీలు,
రండోయి! సాదనకు.' తం॥
'నీతో మాకు యే'మనిరి.
'లేక కుంకలు మీరు కొట్టనా?
నాతో మీరు గెలువనా?
మీకు కోకలు దెచ్చి యిత్తునా?
రవికెలు దెచ్చి యిత్తునా?
ఆ కోకలు మీరు కట్టండి
రవికెలు మీరు తొడగండి
చేతికి గాజులు తొడగండి
కుంకుమబొట్లు పెట్టండి.' తం॥

ఈ మాటలు వినగానె
జెట్టీలు లెగిసిరి,
చెడ్డతామసము బుట్టె గద.
'రాజుగారు వినినను
మన తలలు గొట్టెని
ఇంకను ఏమి చేయను?
నడుములు గట్టండి'.
ముప్పైముగ్గురు లేచిరి
మట్టి లాగులు దొడగిరి
కాశె కోకలు బోసిరి
డాల్ కత్తులు దీసిరి. తం॥

మా. పోలికె రాముడు చూచి, 'విన్నారటోయి, జెట్టీలారా! మీ తల్లి దండ్రాదులు మీకు డాలు కత్తులు సంపాదన జేసి యిచ్చినారు. గనుక అవి మీరు తీసికొన్నారు. నాకు చేతిలోనికి యేమి ఆధారం లేదు. మేలు మేలు!
అయితే యేమాయెను? కాని నన్ను మరపించి రాబోకండి. నన్ను బొంకించి రాకండి. పక్కపెట్టుగ రావద్దు. ఏదీ ముప్పైముగ్గురు ఒక అడుగుమీదనె వచ్చెదరో? రెండు అడుగులమీద వచ్చెదరో? మూడడుగుల మీద వచ్చెదరో? రండి. మీ యొడలు కాచుకొండి. మేలు మేలు!

జాగ్రత్తగ రండ'నెను
'ఓరీ ! నీ వెంత రాముడా
మా చేతులోనికి ఉన్నావా ?
దాసీ పుత్రుడవు గనుకను
నీకు దుర్గుణము పుట్టినది
నీ చావుకే పుట్టెగద
రారా ! ఓరి రాముడా!'
రుమాల నడుమున గట్టెగద
ఇరువైనాలుగు మూరలది
దండ పగడ తీసెను తం||
అది గడ్డముక్రింద పెట్టెను.
వీరు సాదన మీద వచ్చెదరు.
పోలికె రాముడు చూచెను;
'అబ్బబ్బ ! సాదన ! తం||
అబ్బబ్బ ! లగువులు !
మిమ్ము చూచిన భయమురా !
మీ చిన్నవాండ్లను తలవండి'.
దగ్గరకు రానిచ్చి
వెదురు గడను ఎత్తెను
త్రిప్పి ఒక్కపెట్టు పెట్టెగద.
ముప్పైముగ్గురు జెట్టీలు
దెబ్బకు నేలను కఱచిరి
కొఱ్ఱుతో గాల్చి నట్టేను తం||
ఒక్కదెబ్బయె ఉన్నది
ఆ దెబ్బకె అందరు చచ్చిరి.
కదిలించి చూచెను
ఒకనికిని ప్రాణము లేదాయె.
వెదురు గడను పడవేసి
వచ్చి అన్నదగ్గర పండుకునె
దొంగ గురకలు పెడుతాడు.
కుమారరామయ్య లేచెను
గరిడీలోనికి వచ్చెగద.
ముప్పైముగ్గురు పడియుండ, తం||
'ఏమిరోయి ! జెట్టీలు,
అట్లె పండుక యున్నారు ?' తం||
అనుచు దగ్గరకు వచ్చెను
అందఱు చచ్చి యున్నారు.
'ఇది యేమి చోద్యము !

మా. ఇదియేమొ ముప్పైముగ్గురుకి కొఱ్ఱుతో కాల్చినట్టు ఒకటే దెబ్బ ఉన్నది. మా పోలికరాముని మహిమవలె యున్న'దని తిరిగి పోలికరాముని దగ్గరకు వచ్చెను. మేలు మేలు !

'ఓరి ! పోలిక రాముడా !'
దొంగ గురక పెడుతాడు
యెన్ని పిల్చినను పలుకడు.
ఏమి నిద్ర ! లేవరా.'
'ఏమే ! ఓ అన్నయ్యా !'
'ఏమిర జెట్టీలు చచ్చిరి ?'
'నేనంత పాపకర్ముడనా?
ఎంత మాత్రము ఎఱుగను'

మా. 'నీవు ఎఱుగక పోతివిగదా ? వాండ్లు చచ్చినారు.'

''అన్నా, నేను నీదగ్గర అప్పుడే పండుకొంటిని గదా, వాండ్లు ఒకళ్లకు ఒకళ్లు 'ఛీ ! బళా ! ఛీ ! బళా !' అనుకొనుచుండిరి. వారిని వారే కొట్టుకొని చచ్చి యుండవలెను గాని నే నెంతమాత్రము ఎఱుగ''ననెను. మేలు మేలు !

అప్పుడు కుమారరామయ్యగారు పాతాళగంగ కడకు వచ్చి చెంబెడు ఉదకం తీసికొని ఇంత తులసిపత్రి కలిపి '(శ్రీ)రాములూ, నీవే కల'వని ఈముప్పై ముగ్గురికి తులసితీర్థం పోసినాడు. ముప్పైముగ్గురును దిగ్గున లేచి కూర్చున్నారు.

పోలికెరాముడు ఏమంటున్నాడు.

'అన్నయ్యా, ఈ ముండాకొడుకులు బహువడికాండ్లు, అనుకొని యొక చేయి చూతామా అని అనేవఱకు ముప్పైముగ్గురు డాలు కత్తులు తీసికొని నా పైకి దొమ్మరి గంతులు వేయుచు వచ్చినారు. వెదురుగడ తీసికొని ఒకపెట్టు పెట్టువఱకు ముప్పైముగ్గురు నేల కఱచుకున్నారు.'

'ఆరే! ఈవేళదాక నేను యెఱుగనన్నావు ?'

'అన్నయ్యా, నీవు బ్రతికించు సంగతి నాకు తెలిసినది కాదు. నీవు బ్రతికించియుండగ చెప్పితిని గాని లేకపోయిన నేను చెప్పుదునా ? ఆరే! జెట్టీలారా, ఇట్లాగె దొమ్మరి గంతులు వేయుచు నామీదికి యింకొకసారి వచ్చితిరా మాలి కొండ మర్త్యలోకం అంటద్రొక్కెదను. ఈ మాట జ్ఞాపకము ఉంచుకోండి,'

ఆవేళకు తెల్లవారెను. మరునాడు అన్నదమ్ములు యిద్దరు జాముప్రొద్దు యెక్కి భోజనముచేసి నిండుగముసుకుపెట్టి పండుకున్నారు. పోలికెరామునికి యీ మడిసంచి మళ్లీ జ్ఞాపకమునకువచ్చినది. అన్నను నిద్దుర పోనిచ్చి, మేలు మేలు!

దిగ్గున లేచెను రాముడు
ఆ మడిసంచి తీసికొని
డాలు బల్లెము తీసికొని తం||
వసవల్లి దుర్గముకు
ఎవరితో జెప్పక రాముడు
ప్రొద్దు గ్రుంకె వఱకేమి
పట్నందగ్గరికి వచ్చెను.
ఊరిపసులు తోడను
పసులకడ పిల్లలు
పశువుల తోలుక రాగను
'ఎవరోయి ! పిల్లలు,
పట్నములోపలి వర్తమానం తం||
నా కేమైనను జెప్పెదరా ?'
'మా కేమి తెలియును ?
మమ్ము అడుగ వచ్చెదవు.'
కత్తి దూసె రాముడు
'ముక్కు చెవులు గోయుదునా ?'
ఆనవాలు పట్టిరి
'పోలికె రాముడే !' యనుచును
'ఎఱుగుదుము రామయ్యా'
'ఏమెఱుగుదురో చెప్పండి'.

మా. 'మా పట్టణపురాజు కంపిలి గంగావతి మేలు మేలు ! అనియేటి పట్నం స్వారీమార్గం వెళ్లినాడట. ఆపట్టణములో మద్దెల వీరసాని కూతురు.

మలసాని భోగమువారి చిన్నది ఉండగా మా రాజుగారు కన్నెరికము పెట్టుటకు తీసుక వచ్చినారట. లగ్నముహూర్తము విచారించగా ఇంకను యిరువై రోజులు ఉన్నదట. మేలు మేలు!

మా పెద్దవాండ్లు చెప్పుకొనిరి
అనుకొనగా విన్నాము'.
'మంచిది పొమ్మనెను.
'నే వచ్చితి ననుచు జెప్పితిరా
రేపు పసులకడ బట్టుకొని
అందరి ముక్కులు గోసెదను.'
పిల్లలంతా కూడుకొని
'మన యిండ్లకడ జెప్పవద్దు తం॥
చెప్పిన ముక్కులు గోయును'
ఆలాగనుచు వచ్చిరి.
పోలిక రాముడు

మా. ఊరి ముంగల మంచినీళ్ల బావి యుండంగా మంచినీళ్ల బావికడ బొమ్మజెముడు ఉండంగా ప్రొద్దు పోవుమట్టుకు ఆ బొమ్మజెముడులో గూర్చున్నాడు. ఆ పట్టణమునకు ఊరుచుట్టు కోట. మూడుదరవాజాలు, పారాచౌకీలు, దిట్టముగా నున్నవి. ఊరు మాటు మణగనిచ్చి.

పోలికె రాముడు లేచెను
పెద్ద దరవాజకు వచ్చెను
సభకట్టు కట్టెను, తం॥
వాకట్టు గట్టెను,
సొక్కుపొడి చల్లెను,
ఆ దరవాజా దాటెను.
రెండవ దరవాజకు వచ్చెను
అక్కడ సభకట్టు కట్టెను
వాకట్టు కట్టెను
సొక్కు విభూతి చల్లెను
ఆ దరవాజా దాటెను.
మూడవ దరవాజకు వచ్చెను
సొక్కు విభూతి చల్లెను
మత్తు పొడి గొట్టెను తం॥
ఆ దరవాజా దాటెను.
పెద్ద బజారుకు వచ్చెను
నాలుగు వీధులు జూచెను.
'ఈవేళ ఎవరియిల్లు దోచుదును?
ఎవరి యింటిలో నేముండును?'

మా. దగ్గరనె యున్నది పోలిసెట్టి మళిగె. మళిగెతట్టు చూచి,

'నాకు జీవనమె దొరకెను
ఖజాన బిందెలు ఉన్నవి
ఆ మళిగెకు కన్న మేసెను.
కన్నముగుండ దూరెగద
మచ్చువంక జూచెను. తం॥
మచ్చుకు నిచ్చెన వేసెగద
దస్తు బిందెలు దింపెగద
ఖజాన బిందెలు దింపెగద
బట్టల పెట్టెల దీసెను
కన్నముగుండ గడిపెను

కొబ్బరికాయలు జూచెను
ఖర్జూరపండు జూచెను
మలసానికి కావలెను
ఖర్జూరపండు దాటించె
బియ్యపు తట్టలు దీసెగద తం॥
పటిక బెల్లమె దోచెను
పంచదార దీసికొనె
రవికపెట్టెలె తీసికొనె
కన్నముగుండ దూరెను.
'నే నింకొక్కటి మరచితిని
మంగళసూత్రము కావద్దా
భోగముదానికి కావద్దా?'
మళ్లీ కన్నముగుండ దూరెను.
గుగ్గిళ్ల పోలిసెట్టి
పోలిసెట్టి భారియ
అది గుగ్గిళ్లవారి రత్నమ్మ
సత్యమైన యిల్లాలు తం॥
నిద్రబోవు చున్నది.
ఆ మంచముకడకు వచ్చెగద
'నీ వున్నావంటే నాతల్లి
నీ విక్కడున్నావా నాయమ్మా'.
సభకట్టు కట్టెను
వాకట్టు కట్టెను
సొక్కువిభూతి జల్లెను
మెడలో చెయ్యి వేసెగద
గుండ్లపేరులు త్రెంచెను
గుండ్లపట్టెడ దీసెను తం॥
కుంటెనకుచ్చులు దీసెగద
పాంజేబులు దీసెను
బాజీబందులు దీసెను
రాగిణిబిళ్ల దీసెగదా
నట్టింట రుమాలు పఱచెను
రుమాల కొంగున గట్టెను
మలసానికి కావద్దా?
ఆ మెట్టెలుకూడా తీసికొనె
కన్నముగుండ దూరెను. తం॥
'అయ్యో! యింకొక్కటి మరచితిని
మంగళసూత్రము మరచితిని'.
మళ్లీ తిరిగి వచ్చెగద
దాని మెడలో చేయి ఉంచెను
'నీకు రెండున్న వటె నాతల్లి
రెండుమంగళ సూత్రాలు తం॥
నాకు ఒక్కటీ యిచ్చెదవా
నీ కోడలికి కావలెను'.
ఒక మంగళసూత్రము త్రెంపెగద.
సత్యమైన యిల్లాలు
కన్ను లెత్తి చూచినది.
తన పెనిమిటియే యనుకొనెను.
'ఇది యేమి పాపము
ఇదియేమి చేటుకాలము
నా మంగళసూత్రము త్రెంపెదవు'. తం॥
'ఊరుకో, ఊరుకో' యన్నాడు
వెనక్కు వెనక్కు జరిగెను
కన్నముగుండ దూరెను.
ఆబిడ దిగ్గున లేచినది
కన్నముతట్టు చూచినది
'దొంగలో!' యని అఱచినది.
ఇరుగున పొరుగున పలుకరు
ఎవరిని పిలిచిన లేవరు.
తన పెనిమిటి యున్న అఱలోకి
వచ్చెను వేగమె రత్నమ్మ తం॥
పెనిమిటి నేమని పిలిచెను

'ఏమంటె పలకవు
అదేమంటె పలకవు
యేమి నిద్ర! పలుకవు
ఆహా! యేమి పలకవు
దొంగలో! దొంగలు!
మూగా చెవుడా, పోలిసెట్టి?'
'ఊరుకో ఊరుకో పెండ్లికూతుర'.
'నీ తలపండు పగులను
సొమ్ము పోయి నే నుంటె
నన్ను పెండ్లికూతు రంటావా?
దొంగలో! దొంగలు!'
'కుయ్యకోసి వెట్టికోతి'. తం॥
'నీ ఆయుస్సు క్రుంగను
ఇంటికి కన్నము వేసిరి
సాఫుగ దోచుక పోయిరి
మంగళ సూత్రము పోయినది
మన ఖజానబిందెలు పోయెగద.'
మాట సంజ్ఞను కన్నాడు
ఓమ్మో ఓమ్మో గుద్దుకొని,
'ఇక నేమి యున్నది
ఇక నేనెట్లు నిలువను
సర్వదుంబాలాగ దోచెను'. తం॥
తెల్లవారిన తరువాత
రాజుగారితో జెప్పెను
ఆలాగున పలికెగద. తం॥

మా. అప్పుడు పోలికె రాముడు లేచి యీ సరంజామంతా తన పచ్చడంలో మూట గట్టుకొని మద్దెల మలసాని మహల్ మీదికి వచ్చి,

'ఎవ్వరె నీవు మలసాని,
తలుపు తీయ' మన్నాడు.
పలుకకపోయె మలసాని.
'తలుపు దీయవే మలసాని
నీకు మేలిమి నగలు తెచ్చితిని'.
తన దాదులను పిలుచుకొని తం॥
'కావేరీ, కస్తూరీ,
ఎవరె తలుపు దీ యనియెదరు
గముకులు వేయుచునున్నాడు
వీరకుంభిణి మహారాజు
మహారాజు కాబోలు.

మా. వీరకుంభిణి మహారాజేమి ఈవేళప్పుడు వచ్చుటయేమి? ఇంకను యిరువై రోజులు ముహూర్త మున్నదె? వీరకుంభిణి మహారాజు కా'డని అనుచుండగానె

'ఆరె! పోలికె రాముని యెఱుగరా?
తలుపు దీ'య మన్నాడు.
తలుపట్టె తీసెను. తం॥
'వెఱు, పట్టెమంచము వేయవె'.
పట్టె మంచము వాల్చెను
నగలన్నిటి పోగుబోసెను. తం॥
'ఇవిగో మంచి నగలు తెచ్చితినె
ఈ ఖజాన బిందెలు తీసికో
ఇవిగోనె సూడిదలు
పంచదార యిచ్చెదను

పటిక బెల్లము యిచ్చెదను
ఆకులు పోకలు యిచ్చెదను
స్నానము జేయవె మలసాని'.
స్నానము అట్టె చేసెను
నాలుగు గడియలు ఉండెను;
కోక రవికె ధరియించెను తం॥
నాలుగు గడియలు పుచ్చెను;
కురులట్టె దువ్వెను
నాలుగు గడియలు పుచ్చెను;
కాటుక కుంకుమ బెట్టెను
నాలుగు గడియలు పుచ్చెను;
తన నగలన్ని ధరియించె
నాలుగు గడియలు పుచ్చెను.
సందెవేళ జామాయె
ఇక నాలుగు గడియల రాతిరి
తెల్లవాఱ వచ్చినది.
'ఇదేమే! మలసాని తం॥
తెల్లంగ తెలవాఱ
నీకు యిన్ని నగలు యిచ్చితిని
ఖజాన బిందెలు యిచ్చితిని తం॥
చచ్చుదాక బ్రతుకవచ్చు
విశ్వాసమె లేదాయె.'
వచ్చెను మలసాని
ఘల్లు ఘల్లు మంటును.
ఒడిసి రెక్కను పట్టెను,
అది బన్నసరమును ద్రెంపుకొనె
'షహబాసు! రామయ్యా!
భోగమువారి యిండ్లకు
యెన్నడైనను వచ్చితివా?
వచ్చితివా పోయితివా? తం॥
నా బన్నసరమును ద్రెంపితివి
నా బన్న సరమే గ్రుచ్చవలె
నీ యొద్దకు నిద్రకు రావలెను'.
'నే గ్రుచ్చెదను రమ్మనెను.
సెమ్యాల యెదుటను
పోలికె రాముడు గ్రుచ్చెను
మలసానీ దూసెను
తెల్లగా తెలవాఱె.
'ఇది యేమే మలసాని,
తెల్లవాఱె పోయెను
'భోగముదాని నమ్మరాదు
దీని బుద్ధి యెంతచేయును!
రేపు పెందలకడనె వచ్చెదనె తం॥
వచ్చువఱకు నీవేమి
ముస్తాదై యుండవలె తం॥
నీవు ఉండకపోయిన మలసాని
నీ ముక్కు చెవులు గోయుదును'.
ఆలాగంటు జెప్పెగద
తెల్లవాఱె వఱకేమి
మూడు దరవాజాలు దాటెను
ప్రొద్దు గ్రుంకే వఱకేమి
గరిడికి వచ్చిచేరెగద.
కుమారరాముడు చూచెను
'ఏడకు బోతివి రాముడ'? తం॥
'అడివికి వేటకు బోతిగద'.
'రాతిరి యెక్కడ నున్నావు?'
'అడవిలో ప్రొద్దు గ్రుంకినది
రాలేక యున్నాను
అడివిలో పండుకొన్నాను
నాకు చెడ్డ దిగులు పుట్టినది
నాకేమో గుబులు పుట్టెగద.'
'ఏమి దిగులు చెప్పరా'

‘అన్నయ్యా! విన్నావా?
మా తల్లి కలలో వచ్చినది
మా తల్లిని నేను చూడవలె తం॥
నాకు బుద్ధి పుట్టినది
నాకు పట్టముపోను సెలవీవె
తల్లిని చూచి వచ్చెదను.’
‘ఓరి! రాముడా విన్నావా? తం॥
మన తండ్రి సెలవు లేదేమి

యెనిమిది యేండ్ల దాకను
వనవాసములో నుండవలె
పోయిన బ్రతుక నివ్వడు.’
అన్న లేక నే బ్రతుకనా?
మా తల్లిని చూడక బ్రతుకనుగ.’
‘మంచిది కానీ రాముడ,
అట్లాగె పోదువు
గరిడీ సాదన చెయ్యర.’

వ్యా. గరడీలోకి సాదనకు వెళ్లినాడు పోలికె రాముడు. వెనుక వసవల్లి దుర్గములో పుట్టిన వృత్తాంతము: గుగ్గిళ్ల పోలిసెట్టి వచ్చి మేలు మేలు! రాజుతో ఫిర్యాదాయెను.

‘మహాప్రభో! ఎక్కడనుంచి వచ్చెనో దొంగ? రాత్రి మాయింటిలో కన్నము వేసి సర్వదుంబాలాగా దోచుకపోయినాడు. మహాప్రభో! మీరు ఇంతప్పటినుంచి రాజ్యము చేయుచున్నారు గాని ఎన్నడును ఈ పట్టములో దొంగయను వర్తమానము వినలేదు. ఊరంతయు నుండగా నాయిల్లే యేర్చుక వచ్చినాడు.

అందుకు రాజుగారు యేమన్నారనగా,

‘ఊరిచుట్టు కోటయుండంగా, కోటకు మూడు మేలు మేలు! దరవాజాలు ఉండంగా, మూడు దర్వాజాలకడ పారాచౌకీలు ఉండంగా, పరాయి దొంగ ఈ కోటలోనికి ఎట్లు వచ్చినాడు? ఇది ఊరిలోని దొంగతనమే కాని ఇతరముకాదు. ‘ఏనుగులకు వైరి యెనబోతుల యెఱ్ఱన్న మూలముగానె దొంగలు వచ్చినారో? గుఱ్ఱాలకు వైరి గుజ్జుల పాపయ్య మూలముగానె వచ్చినారో? పటాని పాగారౌతు మూలముగానె వచ్చినారో? అయినను, బయటి దొంగ గనుక ఆయెనా, నిన్న వచ్చినవాడు యీవేళ మరలి రానే వచ్చును. ఆ దొంగను యీవేళ పట్టిననే పట్టినారు, లేక పోయిన రేపు జాము ప్రొద్దెక్కవఱకు ముగ్గురు సరదార్లను ఫిరంగీవాత పెట్టించెదను’.

అనగానె సరదార్లు ముగ్గురును వచ్చి,

‘భగవత్సంకల్పమేమో? మనకే వచ్చెను ఈవాడు. మేలు మేలు! మన మేకర్మ మెఱుగక పోయితిమి. మన సిబ్బందీవాండ్లను మనము నమ్మరాదు.

వీండ్లను పారాచౌకీ యందుంచిన ఆ దొంగ దొరకినప్పటికైన పదివరహాలు చేతిలోబెట్టిన దొంగను విడచిపెట్టుదురు, మన ప్రాణము మీదికి వచ్చును.’ అని సరదార్లు ముగ్గురె నడుము గట్టుకొని మూడు దరవాజాల కడను ముగ్గురును పారా యిచ్చుచున్నారు.

గరిడీలో పోలికె రాముడు సాదన చేసి జాము ప్రొద్దెక్కినప్పటికి భోజనముజేసి ‘అన్నయ్యా, నాకు సెలవు ఇప్పించు’, నేను పట్టములోనికి పోయివచ్చెదను’.

‘పోవ్రదువుగాని పోలికెరాముడా, దిడ్డి దోవనువెళ్ళి మీ తల్లిని జూచి రద్ది లేకుండ తిరిగి జాము ప్రొద్దెక్కువఱకు యిక్కడికి ర’మ్మనెను. మేలు మేలు!

‘మంచి’ దనుచు లేచెను
డాలు బల్లెము దీసెను. తం॥
‘డాలు బల్లెము ఎందుకురా?’
‘అన్నయ్యా! విన్నావా,
వస్తాను బిడ్డేమి
చేత యుద్ధము మఱచునా?
నే నడవిని బోవుచు నుండగను
ఒక పెద్దపులియె వచ్చును
బల్లెము దగ్గర నుండినను
నా ప్రాణముగాచును బల్లెముగా’.
‘ఆలాగైతే వెళ్లరా’.

పోలికె రాముడు వచ్చెను
గడియ ప్రొద్దు ఉండగను
పట్టము దగ్గరికి వచ్చెగద.
మంచి నీళ్ల బావొకటి
బొమ్మ జెముడు ఉన్నవి.
ఆ బొమ్మ జెముడులో గూర్చుండె.
రాజుగారి దాదులు
గడియ ప్రొద్దుకాడను
మంచినీళ్ళకు వచ్చిరి.
నీళ్లు తోడుచు నున్నారు.

వారిలో వొక యేమి ఆలోచన జేయుచున్నారనగా, మేలు మేలు!

‘కావేరీ, రాత్రి మన పట్టములోను ఒకఆశ్చర్యము పుట్టినది విన్నావటె?’

‘నే నెఱుగనే పద్మాక్షీ’.

‘గుగ్గిళ్ల పోలిసెట్టి యింటిలో దొంగలు జొరబడినారట! ఇల్లు సర్వదుంబాలాగా దోచుక పోయినారట!

‘నీ కెట్లా తెలిసినదె?’

‘ఆ గుగ్గిళ్ల పోలిసెట్టి వచ్చి మనరాజుతో ఫిర్యాదు చేసినాడు’.

‘అందుకు మనరాజు యేమన్నాడు?’

‘పట్టము చుట్టు కోట ఉండగా పరాయి దొంగ యెక్కడనుంచి వచ్చినాడు? ఈ ముగ్గురు సరదార్ల యెఱుకను జరిగిన పనియెకాని యెఱుగని పని

కాదు. బైటిదొంగ గనుక ఆయెనా, నిన్నవచ్చిన దొంగ యీవేళ మరలి రానేవచ్చును. ఆ దొంగను యీవేళ పట్టిననే పట్టినారు. లేని పక్షమునకు రేపు జాము ప్రొద్దు యెక్కువఅకు ముగ్గురు సరదార్లను ఫిరంగివాత పెట్టించుచున్నా'నన్నాడు. అందుకు సిబ్బందివాండ్లను నమ్మరాదు. సరదార్లు ముగ్గురును పారాచౌకీ యిచ్చుచున్నారు. రాజుగారు చెప్పచుండగా నేను విన్నాను కావేరీ.'

'వాని తలపండు పగుల! వాని ఆయుస్సు క్రుంగ! ఆ దొంగయె గనుక ఈ వేళ దొరకిన తిరుపతి వెంకటేశ్వర్లకు ఒక దుడ్డు కానుక ఇచ్చెదగదే!'

వాని ఆయుస్సు మట్టముగాను! వాని ఆయుస్సు క్రుంగ! ఆదొంగ యీ వేళ చేతు జిక్కిన నేనున్ను మన పట్ణములో గంగానమ్మకు ఒక పోతును వాతబెడుదు గదే!' మేలు మేలు!

ఈ మాటలు అన్నియు విన్నాడు పోలికె రాముడు.

బొమ్మజెముడులో లేచెను
'ఎవరి తలపండు పగులునె? తం॥
నేనేనే దొంగను
నాతల పండు పగులునా?'
బల్లెముదీసెను రాముడు
వారి వెంబడి బడెను రాముడు

'ఓసెమ్మ! ఇకడనె ఉన్నాడె
వీ డెకడ దొంగేమి!
మనలను చంపి పోవునమ్మా.'
నీళ్ల కడవలె పడవేసి
పట్ణములోనికి ఉరికిరి.
వెంబడి తరిమెను రాముడు.

మా. విన్నావా కావేరీ, కస్తూరీ, పద్మాక్షీ, ఓ చెమిటికంటి రమణా! నేను యిక్కడ ఉన్నానని పట్ణములోనికి బోయి చెప్పితిరా మాపటికి మీ నల్గురి ముక్కులు చెవ్రలు గోయుదును. మీ ప్రాణము కాచుక బ్రతుకండి'.

'ఓసి! పద్మాక్షీ, నీ వెవరితోనైనను జెప్పెదవేమో? ఒకరు గనుక కాసంత కొసి వెళ్లబెట్టితిరా మననల్గురికి ముక్కులు చెవులు పోయేమాట నిజము. ఎవ్వరితోడను మనము జెప్పనక్కరలేదు. చెమిటికంటి రమణా, నీవు అడలు గుండెదానవు, మాట దాచని దానవు, తలగొట్టి బాస చేసినను నిన్ను నమ్మరాదు. మన మైదుగురము ఈవేళ ఒక యింటిలోనే పండుకొందము ర'మ్మని,

పట్టపుదేవి మేడమీదికి వచ్చి దీపములు మట్టించి మేలు మేలు! ఒకగదిలో జాపవేసికొని ఒకళ్లమీద ఒకళ్లు పండుకొని చాపయొకటి పైన గప్పుకొన్నారు. రాజసంస్థానంలో మర్యాద యేమనగా, సందెజామున నిద్రపోయి రెండవ జామున భోజనము జేయుదురు; గనుక సందెకాడ పట్టపుదేవి నిద్ర పోయి రెండవ జామున లేచి,

'ఎవరే కావేరి! చెంబుతో ఉదకముదేవే', అని పిలుచునంతకు ఈదాదులు ఎవరు జాడలేదు. 'ఏమి, ఎవళ్లు జాడలేకుండ పోయినారు?'

అని తానులేచి సెమ్మె చేతదీసికొని చెంబుల నిమిత్యార్థము గదులు అన్నిటిని వెతుకులాడుచున్నది. ఒక గదిలో ఒకళ్ల మీద ఒకళ్లు పండుకొని యున్నారు దాదులు.

'మీరె దొరసానులు అయినారు. మేమే దాదులమైనాము. మంచిది కానీ, తెల్లవారిన తరువాత మీ వీపులు బద్దలు గొట్టించెదను'

అని, 'కావేరీ, కస్తూరీ' అని లేపంగానే,

'ముక్కు పోయె ముక్కుపోయె'

ననుచు ఒకతె లేచినది.

'చెవులుబోయె- చెవ్రలుబోయె'

నంచు ఒకతె లేచినది. సందెకాడ భయము కడుపులో మేలు మేలు! నిండా నున్నది.

'ఏమిటిదే, ముక్కుపోయె చెవిపోయె ననుచు లెగుచెదరు?'

అని పట్టపుదేవి అడుగంగానె 'మనము చెప్పినట్లైన ముక్కులు తెగగోసి పోగలడు' అని,

'అమ్మా, నిద్రలో కలవరించినాము',

అని, పట్టపుదేవికి నీళ్లు దెచ్చియిచ్చిరి. పట్టపుదేవి భోజనముజేసి నిమ్మళించిన తరువాత,

పోలికె రాముడు లేచెను
దర్వాజకడకు వచ్చెగద
సాక్కు విభూతి దీసెను తం॥
సభ కట్టు గట్టెను
వాకట్టు గట్టెను
సాక్కువిభూతి జల్లెగద
ఆ దరవాజా దాటెను. తం॥
'ఎవరోయి! సరదార్లు,
దొంగను మీరు పట్టుదురా?
నేనేనోయి! దొంగను

పోలికె రాముణ్ణెఱుగరా?'
వాండ్లకు నిలువుగుడ్లు పడినవి
అట్లా చెప్పి పోయెను.
రెండవ దరవాజ వచ్చెను
సభకట్టు గట్టెను
వాకట్టు గట్టెను తం॥
మత్తుపొడి జల్లెను
ఆ దరవాజా దాటెను.
మూడవ దరవాజకు వచ్చెను.
సభకట్టు గట్టెను

వాకట్టు గట్టెను
సొక్కు బూది జల్లెను.
'ఎవరోయి! సరదార్లు,
దొంగను మీరు పట్టుదురా?
నేనేనోయి! దొంగను
పట్టరోయి! నన్నేమి'.
చెప్పిపోయెను రాముడు.
పెద్ద బజారుకు వచ్చెను
నాలుగు వీధులు జూచెగద
'ఈవేళ యెవ్వరిల్లు దొంగిలుదు? తం॥
ఎవ్వరింటిలో నేమున్నది?
తగిన నగలు లేవేమి
మా తల్లి దగ్గర నున్నవి
మంచి మేలిమి సొమ్ములున్నవి.'
తల్లి మేడకు వచ్చెను
అరియాల దేవేమి
నిద్ర బోవుచునున్నది
సెమ్మె వెలుగుచు నున్నది.
సభకట్టు గట్టెను
మత్తు పొడిని చల్లెను తం॥
గుండ్ల పేరులు ద్రెంపెను
చంద్రహారాలు దీసెను
పూవుల హారము ద్రెంపెను
బన్నసరము దీసెను
నడుమొడ్డాణము దీసెగద
మంగళసూత్రము బట్టుకొని
'అమ్మా! వినవే అరియాలి,
మంగళసూత్రము గావలెను
నీ కోడలికి యిచ్చెదవా?' తం॥
మంగళ సూత్రము ద్రెంపెను
బొత్తిగ నగలు దోచుకొని
రుమాల కొంగున గట్టెను
తండ్రి మేడకు వచ్చెను
తండ్రి నిద్దుర బోవుచునున్నాడు
పీకుంభిణి మహరాజు
మంచముకడకు వచ్చెను.
రాజు పండుకొని యున్నది
పగడపు కోళ్ల మంచము.
మంచమువైపు చూచెను
'ఇది భోగముదానికి కావద్దా?
సభ కట్టు గట్టెను
సొక్కు బూది జల్లెను తం॥
నాలుగు పంగల పుల్లలు దెచ్చెగద
పట్టెలక్రింద యెత్తువెట్టి
నాలుగు కోళ్లను దీసెను
నాలుగు వెదురు గడలు దెచ్చెను
నవారు గుండ చొప్పించి
యీ పుల్లలమీద యెత్తువెట్టి
పట్టెలుగూడ దూసికొని
పోలికె రాముడు లేచెను
మలసాని యుండేటి
రాయమహాలుకు వచ్చెను.
'ఎవ్వరె, నీవు మలసాని తం॥
తలుపు దీయ'మన్నాడు.
ఎన్ని పిలిచిన పలుకదుగా.

మా. మలసాని యేమి చేసినదనగా మేలు మేలు!

'నిన్న వచ్చినవాడు మరలి నేడు రానేవచ్చును' అని సందెకాడనె భోజనముచేసి యింటిలో నిప్పు లేకుండ పొయిలో నీళ్లుబోసి గుగ్గిళ్ల పోలిసెట్టి యింటిలో తెచ్చిన

నగలును తన నగలును బట్టల పెట్టెలతోకూడ కొట్టులో బడవేసి కొట్టుకు తాళమువేయించి దాదుల ముగ్గురను వెంట బెట్టుకొని యింటి వెనుక కీర్ణాలకమైన కాకర పొదయుండగా దానిలో దాదులతోగూడ దాగుకొన్నది. రెండు మూడు మాట్లు తలుపు తీయమని పిలిచినాడు. పలికినవారు లేకపోయిరి.

మేలు మేలు!

చెడ్డ కోపము బుట్టెగద
ఒక్క తన్ను దన్నెను
తలుపు ఉతకి యూడినది
రాయమహల్‌కు వెళ్లెను
'దీపాలు లేవేమి?
ఎక్కడ బోతివె మలసాని?
ఏడ నున్నావె మలసాని?
నా జీవనమే పోయెను.
మేలిమి నగలు దెచ్చితిగా
నీ వేడ నున్నావె మలసాని?' తం॥
పొయిలో నిప్పు జూచెను.
'ఔర! పొయిలో నీళ్లనుబోసెగా'!
తన జేబులో చేయిడుంచెను
చెకుముకి తునుకను దీసెను
అలవా గడ్డి దూసెను
చెకుముకి వేసెను
నిప్పు జేసెను రాముడు
సెమ్మెను వెలుగించె
ఆ సెమ్మెను చేతను బుచ్చుకొని
గదులన్నిటిని వెతకెను.
'ఎక్కడ బోతివె మలసాని?'
మచ్చు మీదికి ఎక్కెను
మచ్చంతా పరిశోధించె
ఎక్కడ జూచిన లేదాయె. తం॥
దొడ్డిలోనికి వచ్చెను
కాకర చెట్టు కాడకు
ఎడమచేత నెత్తెను
చెట్టువంక జూచెను
మలసాని కూర్చుండె
చేతి చేమపూవు కడియము
తళతళతళతళ మన్నది.
'ఎవతెవె నీవు కూర్చున్నది?'
'ఏమయ్యా, రామయ్యా!'
'ఛీ! లేచిరావే మలసాని,
ఇది యేమే యిక్కడనున్నావు?'
'విన్నావా రామయ్యా?
దాగుడు బూచి ఆడేము తం॥
కనుగొందువా కనుగొనవా
ఆలాగనుచు నున్నాము;
ఎంతవాడవు రామయ్యా
కాకర చెట్టులోగన్నావు?'
'లేచి రావే! మలసాని,
ఇవె మేలమినగలు దెచ్చితిని
పగడపు కోళ్ల మంచము
నీకు దెచ్చితినె మలసాని
స్నానముజేయవె మలసాని'.
పట్టె మంచము వాల్చినది.
ఆ పట్టెమంచము మీదను
ఈ నగలన్నిటినిబోసెను.
ఈ నగలన్నిటిని జూచినది

'దొరసాని నగలేమి !
తెల్లవారిన తరువాత
రాజుగారు విన్నను
నన్ను తలగొట్టి వేయును',
ఆ లాగనుచు మలసాని
దాదుల దగ్గర బిలచెను.

మా. "కావేరీ, కస్తూరీ మీరు రహస్యముగా వెళ్లి పట్టపుదేవిని నిద్ర లేపి 'పట్టపుదేవమ్మా, గుగ్గిళ్ల పోలిసెట్టి యింటిలో మేలు మేలు !
దొంగిలిన దొంగ మలసానియుండే రాయమహల్ మీదికి వచ్చినాడు. పట్టుకునే దానికి ఇదే సమయ'మని చెప్పిరండి."
అనే వఱకు చక్కగాబోయి, మేలు మేలు !

'అరియాల దేవమ్మా,
గుగ్గిళ్ల పోలిసెట్టి
యిల్లు దొంగిలిన దొంగేమి
మలసానుండు మహాలుకు
రాయమహాలుకు వచ్చెను'.
అనగానె అరియాలి
దిగ్గున లేచి కూర్చుండె.
తన మెడ యంకన గున్నది
నగలు తడవి చూచుకొనె
నగలేమియు లేవాయె
మంగళసూత్రము లేదాయె. తం॥
'వీడెక్కడ దొం !' గనచు
'నాకే యెసరు పెట్టెగదా',
ఆ లాగనుచు నరియాలి
తనపెనిమిటి యుండు అఱలోకి
భామ కదలి వచ్చెను
పెనిమిటినేమని పిలిచెను
'యేమండి పలుకరు ?
మీరేమండి పలుకరు ?
యేమి నిద్రా లేపరు ?

మా. గుగ్గిళ్ల పోలిసెట్టి యింటిలో దొంగిలిన మేలు మేలు !
దొంగ రాయమహాలు మీద నున్నాడట. నీవు తెచ్చిన భోగందాని యింటి కాడకు నా నగలుకూడను దోచుక పోయినాడు'.
అనగానె ఆ మాట రాజు నిద్రలో విని మేలు మేలు !

దిగ్గున లేచెను
బొక్క బోర్ల పడినాడు
పడి లెగిచె రాజేమి
మంచమువంకను జూచెను
కోళ్లు పట్టెలు లేవాయె
పుల్లలు యెత్తి యున్నది.
'వీడు ఎక్కడి దొంగేమి !
నాకే ఎసరు పెట్టెగద !'

మా. అని అప్పుడు రాజుగారు ముగ్గురు సరదార్లను పిలుపించి, 'నాలుగు వందల సిబ్బందిని ముస్తాదు చేసికొని భోగము మలసాని ఉండు రాయమహాలుకు ముట్టడివేసి దొంగను గట్టిగ పట్టుకర'మ్మనెను. మేలు మేలు !
నాలుగు వందల సిబ్బందీవారు వెళ్లి రాయమహాలును చుట్టుకొని,

'ఎవరే మలసానీ, రాజుగారి నగలనన్నిటిని దొంగచేత దోపించుకొని తెప్పించుకొనుచున్నావా ? తెల్లవారినగాని నీ పని తెలియదు. ఆ దొంగను బైటికి పంపించు'అని.

'శాబాసు ! రామయ్య,
బాగుగచేసితివి నన్నేమి
నా యింటిమీదికి దెచ్చితివి
నాప్రాణముమీదికి వచ్చెను ?'
'విన్నావా మలసానీ, తం॥
నాలుగు వందలు వచ్చినను
వారిని చూచి దడసితివా ?
నీకు వచ్చిన భయమేమి ?
నీ నగలన్నిటి దె'మ్మనెను తం॥
పచ్చడమును బఱచెగద
కొట్లో నగలు దెచ్చెను
పచ్చడములో వేయించి
బట్టల పెట్టెలతో నేమి
పెద్ద మూట గట్టెను
తన వీపున గట్టికొనె తం॥
మద్దెల మలసాన్ని
ఆపైనను గట్టికొని
యిరువైనాలుగు మూరలది
వెదురు గడను దీసెను
అది గడ్డముక్రిందను బెట్టెగద.
'ఎవరోయి ! సరదార్లు !
యెవరోయి ! బంట్రౌతులు !,
దొంగను పట్టను వచ్చితిరా ?
నేనేనోయి ! దొంగను
పట్టుదురుగాని రండోయి !'
'ఓరి ! నీవనగ నెంతరా ?' తం॥
కదిసి వచ్చిరి సరదార్లు
దగ్గరకు రానిచ్చి
వెదురు గడను యెత్తెను
ఒక్క పెట్టు బెట్టెగద
అక్కడ నూటికి జచ్చిరి. తం॥
ఈ ఖబురు రాజుతో జెప్పిరి
'దెబ్బకు నూటికి జచ్చిరి'
పరాయి దొంగ కాడయ్య
పోలిక రాముడె చూడగ
చూడగ నట్లగె యున్నాడు.

మా. రాజుగారు ఏమన్నారు :

'పోలికె రాముడె అనుకొనవచ్చును. ఇట్లాగంటి దుర్మార్గపు బనులు చేయువాడు వాడెగాని ఇతరులు చేయలేరు. ఆ పోలికెరాముని ఇక నా కన్నులతో జూచుటలేదు. నాకు అపకీర్తి తెచ్చిన వానిని మేలు మేలు !
ఉంచడముకూడదు. మీరు శీఘ్రముగ వెళ్లి పోలికె రాముని పట్టుకొని పెడరెక్కలు గట్టి నందులవాగునది కడకు దీసికొనివెళ్లి శిరస్సుగొట్టి కనుగుడ్లు రక్తము దొప్పను బట్టుకొని నాకు చూపిననే భోజనము జేయుదును లేకపోయిన యీవేళ నేను భోజనముజేయను'.

అనగానె బంట్రౌతులు తిరిగి వెళ్ళి,

'రాజుగారు గట్టిగా పోలికెరాముని పట్టుకొని శిరస్సు గొట్టమన్నారు? అని అక్కడ ఉన్న సిబ్బందీవారితో జెప్పిరి.

'మనము పోలికె రాముని శిరస్సు గొట్టలేము గాని మన ప్రాణము అతని చేతులో బోయేటట్టుగ దోచుచున్నది, కానీ రాజుగారి మేలు మేలు! ఉప్పు పులుసు దిని ఊరకే వెళ్లుదుమా?'
అని, కవ్వించి మళ్లీ పైకి వచ్చిరి. వచ్చినవేళకు ఒక దెబ్బ త్రిప్పి పెట్టేవఱకు యాభై మందికి చచ్చినారు.

'అబ్బా! ఇకను పట్టలేము, రాజుయిచ్చే వరహాజీతం యియ్యకపోయిన మానెను గాని ఇంకొక రాజునైనా కొలుచుకొని బ్రతికెదము, మా చేతగాదు,' అని సిబ్బందీలు తిరుగబడినారు. అంతట తెల్లవారినది. మళ్లి రాజుగారితో వచ్చి,
'మహాప్రభో, పోలికెరాముని బట్టేవారు యెవరునులేరు. ఇప్పటికి నూటయాభై యింటికి చంపినాడు. ఇక యెవరును పట్టువారులేరు'.

అప్పుడు రాజుగారు పట్ణము నాలుగు వీధులు చాటింపజేసినారు. ఏమని చాటింపమన్నారు:

'పోలికెరాముని యీరోజున ఎవరు పట్టుకొని వాని శిరస్సుగొట్టి కను గుడ్లురక్తము చూపించెదరో వారికి మూడు ఊళ్లు జాగీరు ఇప్పించుచున్నాము' అని చాటగానె జెట్టీల పినతండ్రులు ముగ్గురు చక్కగవచ్చి, పేరెత్తిన వస్తాదులు గనుక

'మహాప్రభో, అది యనగానెంత? పోలికె రాముని మేము పట్టెదమయ్యా', అని రాజుగారి దగ్గర తాంబూలము దీసికొని సన్న యినుపగొలుసులు వల్లెత్రాళ్లు చేత దీసికొని సిబ్బందీ వాండ్లలోనికి వచ్చి,

'మీరు పోలికె రాముని కట్టకు అందకుండ కత్తులు మేలు మేలు! దూసికొని యెదట నిలువబడి 'పోలికె రాముడా నీవనంగ నెంతలోది, నిన్ను కత్తికి ఒక కండగ గోయుదుము. నీవు దాసీ పుత్రుడవు. నీ ప్రాణము మీదికి వచ్చినది కానకుండ పాటుబడుచు ఉన్నావు' అని నూఱుమంది అనుచు నుండ డి. మేము దిడ్డి తలుపుగుండ వచ్చి వెనకవైపుగ పోలిక రాముని బట్టుకొనెదము' అని వాండ్లతో జెప్పి, దిడ్డితలుపువైపుకు వెళ్లిరి. ఇక్కడ నూటికి పోలికె రాముని గవ్వించుచు రోషపు మాటలు ఆడుచు ఉన్నారు. పోలికె రాముడు కన్నులు ఎఱ్ఱజేసి పండ్లు పెటపెట గొఱుకుచు నూఱు మందిని చంపను జూచు

చున్నాడు. వీరు దిడ్డి తలుపు ఉతకయెత్తి కాలుకాలు కదలకుండ వచ్చి యీ యినప గొలుసులు మెడకు పడవేసి వెనుకకు వడలాగిరి. మేలు మేలు!

విఱుచుక పడెను రాముడు
పగడపుకోళ్ల మంచము
నడిమికి ఫెళ్లు మన్నది
మద్దెల మలసాని
ఎడమ తొంటికి దెబ్బేమి
బలముగాను దగిలినది.
'శాబాషు! రామయ్యా,
నన్నెంత జేసితివి?'
'నీయింటికి నేవచ్చి
యెంత సుఖము బొందితివో
నీకును అంతే దొరకినది'. తం॥
పైన ముగ్గురు యెక్కిరి
వీపున మూటలు దీసిరి.
పెడ రెక్కలు విఱిచి కట్టిరి
రాయమహాల్ నుండి దింపిరి
యాభై యింటికి బంద్రౌతుల్
కత్తుల ఒరలు దూసిరి
పోలికె రాముని దీసికొని
నందులవాగు కాడకు
వెంట బెట్టుకొని వచ్చిరి.

మా. అక్కడ వారు యేమి ఆలోచన జేయుచున్నారనగా,

'అడవిలో కుమారరామయ్య ఉండెగదా. కుమారరామయ్య యెఱుక లేనిది మనము కొట్టడము బాగుగనుండదు. ఆ కుమారరామయ్య ఉండే గరిడీ కాడకు తీసుకొనివెళ్ళి ఆయనకు యెఱుకచేసి మేలు మేలు! పోలికె రాముని మఱి చంపుదము',
అని ఆపాటుగా, అరణ్యమందుండే గరిడీకడకు వచ్చిరి. కుమారరాముడు చూచి

'ఇదేమిరా, పోలికె రాముడా; దోమవలె వెళ్లి యీగవలె వచ్చినావు? ఈ కత్తు లేమి, ఈ కటారు లేమి? ఏమప్రోయి! మీరంత యితని వెంబడి వచ్చిన పనియేమోయి?'

'మహాప్రభో, పోలికెరాముడు పట్ణములోనికి వచ్చి గుగ్గిళ్ల పోలిసెట్టి యిల్లు సాఫుగా దోచినాడు. తరువాత మీ తల్లిగారి మేలు మేలు! నగలు సాఫుగా దోచినాడు. మీ తండ్రిగారు పండుకునె పగడపుకోళ్ల పట్టె మంచము యెత్తుకవచ్చి మద్దెల మలసాని అనే భోగముదానికి యిచ్చి దాని యింటికడ నుండగా మీ తండ్రిగారికి జాహీరై పట్టుకొని రమ్మని నాలుగువందల సిబ్బందిని పంపించగా అందులో నూట యాభై యింటికి చంపినాడు. మీ తండ్రి గారికి కోపమువచ్చి, 'పోలికె రాముని కన్నులతో చూడను. పోలికె రాముని తలగొట్టి గుడ్లును, రక్తమును యెవరు తెచ్చెదరో వారికి మూడు ఊళ్లు జాగీరు

యిచ్చేదనని చాటించగా, యీ జెట్టీలు ముగ్గురు పట్టుకుని తలగొట్టుటకు తీసుక పోవుచు మీ సెలవులేనిది యేపని చేయకూడదు గనుక మీ దగ్గరకు తీసుకొని వచ్చినాము.'
అనగానె,

'పోలికె రాముని ఒక్కనినె తలగొట్టమని సెలవు అయినదా, నన్నుకూడ తల గొట్టమన్నాడా?'

'మహాప్రభో, అంతమాట సెలవు యివ్వలేదండి. పోలికె రామునినె కొట్టమన్నారయ్యా'.

'నాయెదుటికి తీసికొని వచ్చిన తరువాత పోలికె రాముని తలగొట్ట నిచ్చెదనా? చచ్చితిమా, ఇద్దరము చచ్చువారము; బ్రతికితిమా, యిద్దరము బ్రతకువారము'.

'మహాప్రభో, కొట్టకపోయిన రాజుగారు మమ్ము బ్రతుకనిచ్చునా?'

'అందుకు ఒక ఉపాయము చెప్పెదను వినండి ఏమనగా', 'ఎవరోయి! వీరమజెట్టి, వెండికట్ల తుపాకికి యెన్ని వేళ్ల బారుపెట్టినావు?'

'మహాప్రభో, ఆఱువేళ్ల బారుపెట్టినాను.'
కుమార రామయ్య, ఆ తుపాకిని తీసికొని అడవికివెళ్లీ అడవిమేకను ఒకదానిని పడవేసి దాని కనుగుడ్లు రక్తము దొప్పనుపట్టి తిరిగి గరిడికివచ్చి,

'ఎవరోయి! జెట్టీలు, ఇది పట్టుకొనివెళ్ళి మేలు మేలు!
'పోలికెరాముని కనుగుడ్లును రక్తమునని రాజుగారికి చూపండి. మీ జీవనాలకు విరోధము రాదు'.

తిరిగి వసవల్లి దుర్గమునకువచ్చి రాజుగారియెదుట నిలువబడి మేలు మేలు!
'మహాప్రభో, ఇవిగో, పోలికె రాముని కనుగుడ్లును రక్తమును',
అని చూపగానె సంతోషించి,

'పోలిక రాముడు చచ్చెనా? యిక నా తాలూకాలో రద్దిలేదు,'
అని, అప్పుడు రాజు స్నానముచేసి భోజనము చేసెను. తదనంతరం కచేరి చావడిలో కూర్చునియుండి జెట్టీల ముగ్గురుని పిల్పించి ముగ్గురికి మూడు ఊళ్లు జాగీరు యిచ్చెను. ఆ తరువాత రాజు యేమి విచారించుచున్నాడు.

'పోలికె రాముని గురించియెకదా కుమారరాముని అడవిలో నుంచినది, పోలికెరాముడు పోనేపోయెను. కుమారరాముని పట్టములోనికి పిలుపించవలెను'
అని నౌకర్లను ప్రయాణముచేసి మేలు మేలు!

గరడికి పంపిరి
ముగ్గురు నౌకర్లు వచ్చిరి
వచ్చువఱకు రామయ్య
ఆలోపైనను రామన్న
నేలను భోనుగావించి
పోలిక రాముని
కావులో వేయించి
పైన తలుపులు వేయించె.
జాము ప్రొద్దు వఱకేమి
బైటకి రప్పించి
నాలుగు గడియలు గరడిలో తం॥
సాదన చేయించి
మరల కావున వేయించి
అట్లు బందోబస్తు చేసెను.
నౌకరులు ముగ్గురు వచ్చిరి
కుమార రామునికి
మ్రొక్కువేసి నిలచిరి.
'మీరు ఎందుకు వచ్చితిరి?'
'మీ తండ్రి మహరాజు
మిమ్ము పట్టములోనికి రమ్మనెను
మమ్ము ముగురిని పంపెను.'
'మంచిది, ఉండండి'
వాండ్లకు అన్నము పెట్టించి, తం॥
'నేను ప్రొద్దున వచ్చెదను
మీరు ముందర వెళ్లండి'.
వారు ముగ్గురు వెళ్ళిరి.
కుమారరామయ్య
జెట్టీలను బిల్పించి
'నేను మరలివచ్చు దాకను
మా తమ్ముని దియవద్దు
అన్నమువేళ మీరేమి
ఆ తలుపుబల్ల తీసేమి
బంగారు పళ్లెములో
అన్నము కూరలు వడ్డించి తం॥
ఉట్టి గట్టి దింపండి?'
అట్లు కట్టుదిట్టము జేసెను.
'ఓరీ! పోలిక రాముడా, తం॥
నన్ను తండ్రిగారు పిల్పించె
పట్టము వెళ్ళివచ్చెదను
నే వచ్చినదాకా నీవేమి
కావులోనుంచి రావద్దు
జెట్టీల వాదను
ధాముధూము చేసేవు'.
'విన్నావా అన్నయ్యా,
నీ మాటకు నేనేమి
యెదురుత్తరము చేయుదునా?
మంచిది వెళ్ళండి'.
కుమార రాముడు బయల్ వెడలి
వసవల్లి దుర్గము తం॥
చేరువకు వచ్చెను
రెండుకోసులు ఉన్నది.
రాజుగారిది యేనుగ
మదముదిగి యున్నది
పొలముమీద విడిబడెను
రెండుకోసుల మేరకు
కుమార రామునికి
ఎదురుగుండ వచ్చెను.
ఏనుగమీది రాతేమి
కుమార రాముని జూచెగద. తం॥
'కుమారరామయ్యా,
యేన్గకు మదము దిగినది
పొలముమీద బడినది. తం॥

యెంత పొడిచినను దిగలేదు
దారి తొలగి రమ్మనెను.
'ఛీ! లంజ కొడుక ! కుయ్యగరా
దున్నపోతుకు తొలిగేదా
కుమారరామయ్యా?'
ఒడిసి తొండము పట్టెగద
ఘీంకారము పెట్టుచు యేనుగ
గీతానాదము బెట్టెగద.
విడిచిన పోవలె నంటుంది
ఎంతమాత్రమును విడువడుగా
తొండము పట్టుక యేనుగను తం॥
వెన్కకు వెన్కకు ద్రోసెగద
తొండము విడిచి పెట్టెను
వెన్కకు యేడు బారలు దూకెను
ముందర లగువున లేచెను
యేనుగ కుంభస్థలము దన్నెను.
ఒక్క తన్నునకు యేనుగ
కుంభస్థలము పగిలినది
విఱుచుక పడి చచ్చినది.
యేనుగమీది రౌతేమి
గోడుగోడున దుఃఖించి
ఓమ్మో ఓమ్మో గుద్దుకొని తం॥
'నా జీవనమే పోయెగద
కుమారరామయ్యా,
నే నెట్టుల బ్రతుకుదును? తం॥
ఇక నాకు యేమి జీవనము ?
మీ తండ్రిగారితో జెప్పగను
నా జీవనమే తీయుగదా'.

మా. "విన్నావట్రా ఓరీ! మాతండ్రిగారు గనుక నీ జీవనముతీసిన నిన్ను నేను పోషింతును. కాని ముందర నీవు పట్నములోనికి వెళ్ళి మా తండ్రిగారితో ఏమని చెప్పేదువనగా, 'మహాప్రభో, మన పట్నములో స్వామివారికి కుంభహారతి యిచ్చే యేనుగకు మదముదిగి పొలముమీద పోవుచుండగా కుమార రామయ్య యెదురుగ వచ్చుచునుండగా, యేనుగకు మదముదిగినది మేలు మేలు ! 'తొలగిపొమ్మా' అన్నాను. 'మాట్లాడకు' మని యెగిసి యేనుగ కుంభస్థలము పగలతన్నినాడయ్యా. ఒక్క తన్నుకె యేనుగ చచ్చిన'దని చెప్పు. ఆ పైన యేమని చెప్పునో ఆ వర్తమానము మరలివచ్చి నాకు చెప్పు. నీవు మరలివచ్చు పర్యంతం యిక్కడనే కూర్చునియుంటును".

'చిత్తం,'

అని వాడు వసవల్లి దుర్గమువకువచ్చి, రాజుగారు కచేరిన కూర్చునియుండగా మ్రొక్కువేసి నిలువబడి,

'మహాప్రభో, మనవి'

అనెను.

'ఏమి మనవి ?'

అని రాజు అడుగగానె

'మన స్వామికి కుంభహారతి పట్టపు యేనుగ చచ్చినది'.

ఆమాట వినగనే రాజు తోకద్రొక్కిన నాగుబాామువలె నెగిరి

'ఏనుగ యేమి, చావడమేమి ? ఎట్లు చచ్చినది?'

అని అడుగగానె, మేలు మేలు !

'మహాప్రభో, యేనుగకు ముదముదిగి పొలముమీద విడివడినది. కుమార రామయ్యగారు పట్నములోనికి వచ్చుచుండగా, యేనుగకు మేలు మేలు ! మదముదిగినది, దారి తొలగమన్నాను. లంజకొడుకా! కుయ్యకురా! యని ఏనుగ తొండము పట్టుకొని మూడుఊపులు ఊపి యేడు బారలు వెనుకకు యెగసి యేనుగ కుంభస్థలముమీద తన్నెను. ఒక్కతన్నునే యేనుగ చచ్చినది,'

అని రాజుతో చెప్పగనె, రాజు అందుకు ఒక సామెత చెప్పుచున్నాడు, అది యేమనగా,

"ఒక సంసారి యొక దున్నపోతునుకొని దానికి ఒక తనగామువేసి యొక కూలివానినిపెట్టి, 'మా యుంటికి నీళ్లు చేరబోయరా' యనిచెప్పెను. ఆ యింటికి యెనిమిది తడవలు గనుక తెచ్చిన సరిపోవును. ఆ కూలివాడు ఏమి చేసినాడు ? దబ్బున అవుగాకని మేలు మేలు ! యెనిమిది తడవలు తెచ్చు నీళ్లు ఒక తడవకే తనగాము నిండుగ పోసి తోలుక వచ్చెను. ఆ దున్నపోతు గుండెలు పగిలి చచ్చెను. దానికి సొమ్ము ఖామందు చెడినాడా ? కూలివాడు చెడినాడా ? కుమార రామయ్యాది యేమి పోయినది? నీదేమి పోయినది? నడుమ చెడినవాడను నేనే',

అని చెప్పెను. ఆమాట తిరిగివచ్చి కుమార రామయ్యతో తండ్రిగారు చెప్పిన సామెత చెప్పగానె కుమారరామునికి కోపమువచ్చి,

'తాను సొమ్ముఖావందు అయినట్టు, నేను కూలివాడను అయినట్టు'.

'వీడు ఎక్కడి తండ్రేమి
దున్నపోతు సాటువ తం॥
నాకు యిప్పుడు చెప్పెను
ఇక రాజు మొగము చూతునా?'
వసవల్లి దుర్గము తం॥
పెద్ద బజారున వచ్చెను
తమ తల్లియున్న మేడకు.
అరియాల దేవేమి
కుమారుని జూచేమి
సంతోషము నందెను.
'అమ్మా, అన్నము అయినదా?'
'నాయన, స్నానము చెయ్యండి.'
పోయి స్నానముచేసి వచ్చెగద
బంగారు పళ్ళెములో

పప్పులు పచ్చళ్లు తం॥
పరగనేతి కూరలు
నెయ్యి అన్నము భుజియించి
పాలు అన్నము భుజియించి
హస్తము వెల్చుక కూర్చుండి,
'అమ్మా! వినవే అరియాలి,
నాకు సెలవు యివ్వవె'.
'ఎందాక నాయనా?'
'నేను దేశాంతరము వెళ్ళెదను
నాలుగు భూములు చూడవలె.' తం॥
'నాయన వద్దు నాకుమరా
మఱియు మఱియు ఉన్నారా?
నీ వొక్కడవె ఉన్నావు
నాయన నీవు పోవద్దు.'
'ఎంతలేదు పోయెదను'.
'అలాగైతె నాయనా,
మీ తండ్రిగారిని అడగండి
అందుకు యేమి చెప్పనో'
'పీ డెక్కడి తండ్రేమి
నాకు దున్నపోతు సాటువా?
సాటువ నాకు చెప్పెను
రాజు మొగము చూడనుగా'.
తల్లిమాటను వినడాయె
గుఱ్ఱములుండు సావడిలో తం॥

అగాడిపిచాడి నున్నాది
మేఘరంజి గుఱ్ఱము
స్వామి వరమున బుట్టినది
పంచకల్యాణి తేజీగా.
దానిని బట్టుక వచ్చిరి;
దానికి పన్నెండు సేర్ల పాలేమి
గుఱ్ఱమునకు పెట్టించి
నల్లమందు బిళ్లలుగ
గుఱ్ఱమునకు వేయించి
రెండు సేర్ల మాజూము తం॥
గుఱ్ఱమునకు పెట్టించి
పచ్చగడ్డి వద్దనెను.
దానిని ముస్తాదు చేసిరి.
కుమార రామయ్య
ముస్తాదెట్లు అయినాడు: తం॥
పకీరు టెక్యా పాగేమి
తలను జుట్టెరామన్న
చీనా చుట్ట దగలేమి
తొడిగెను రామన్న
శిలేబత్తరు తొడిగెను
చంద్రాయుధము దీసికొని
తల్లికి దండము బెట్టెను
దీవించె నరియాళి
తాంబూలము నిచ్చెను. తం॥

మా. 'నాయనా, యే భూమికి వెళ్ళెదవు'.

'నాల్గు భూములు చూడవలెనను సంకల్పముచేత వెళ్లుచున్నాను. ప్రాప్తానుసారం ఏలాగు ఉండునో'.

నాయనా, పడమటి భూమికి వెళ్ళవద్దు, దక్షిణ భూమికి వెళ్ళవద్దు, ఉత్తరాదికి వెళ్ళవద్దు, తూరుపు భూమికి వెళ్ళిరా కుమారా'.

'అదేమమ్మా, ఆభూములకు యెందుకని వెళ్ళవద్దు?'

'నాయనా, యీ మూడు దిక్కులనుండు జమీందార్లు అందఱు మీనాయనకు పగవారలే. ఆ జమీందార్లు యెవరంటె పడమటిభూమి ఎఱ్ఱభూపతిరాజు మీ తండ్రికి పగవాడె, దక్షిణ భూమిని ఉండు మేలు మేలు! సుల్తాన్ భూపతిసింగు మీ తండ్రికి పగవాడె, ఉత్తర భూమిని ఉండే ఓరుగంటి ప్రతాపరుద్రుడు మీ తండ్రికి పగవాడె. ఆ భూములకు నీవు వెళ్ళవద్దు'.

'అమ్మా, ఆలాగంటి భూములకె వెళ్ళవలెను. మేలుమేలు! పగవారిని కన్నులజూచి వచ్చెదను',
అని తల్లిమాటలు వినక జాలె మొహరీలు తీసికొని అశ్వమునకు నమస్కారము జేసి యెక్కి,

ఎడమకాలనుదాటించె
నృత్యము రాజు త్రొక్కించె
మేఘములలో లేచెగద
మేఘరంజి గుఱ్ఱము
ప్రొద్దంతయు నడచెను త॥
ప్రొద్దు గ్రుంకువఱకేమి
ఎఱ్ఱ భూపతి మహారాజు
పట్ణము జేరను వచ్చెను.
పట్ణము ఊరి ముందర
మల్లెపూవుల వనమేమి
వనములోనికి వెళ్ళెను
అశ్వమునుండి దూకెను
జమఖానా పఱచుకొని
చెట్టుక్రిందను గూర్చుండె.
ఎఱ్ఱభూపతి నౌకర్లు

తూము గంపలు పుచ్చుకొని
ముగ్గురు వారు వచ్చిరి తం॥
మల్లె పూవులు గోయుటకు.
గంపల నిండుగ గోసిరి
ఆ గంపలు నెత్తిని పెట్టుకొని తం॥
తిరిగి పట్ణము పోగాను
కుమార రామయ్య చూచెగద.
'ఎవరోయి పోయేది?'
వారు గిఱ్ఱున దిరిగిరి.
'ఎఱ్ఱభూపతి మహారాజు
నౌకర్లము మే మన్నారు.
'నెత్తిన బరువు లవేమిటివి?'
'మల్లెపూవులని యన్నారు.'
'అవి యన్నియు నెందుకు?'

మా. 'అయ్యా, మారాజు మల్లెపూవులభోగి. నిత్యము యీ మూడు గంపల మల్లెపూవులు కావలెను'.

'ఇవి అన్నియు దీసుకవెళ్ళి యేమి చేయుదురోయి?'

రాజుగారికి పట్టెమంచము వాల్చి ఆ పట్టెమంచము మీాద సన్నపాటి పఱుపు పఱచి ఆ పఱుపుమీాద యీ మూడు గంపల మల్లెపూవులు పఱచెదము.

ఆ పూవులపై రాజుగారు పండుకొనియెదరు. ఈ పువ్వులు తక్కువైన రాజుకు నిద్దుర పట్టదు'

'ఇట్లా దింపండర్రా, ఆ పువ్వులు యేలాగంటివో చూచెదను',
అని మూడుగంపల మల్లెపువ్వులను దింపించి జమఖానామీద సోగుబోయించి ఆ మల్లెపువ్వులమీద పండుకున్నాడు.

'పోయి మీ యబ్బతో చెప్పకోండి పొండర్రా, మేలు మేలు!

మీ రాజుతో ఫిర్యాదు చెయ్యండి'.
ముగ్గురును వచ్చిరి తం॥
రాజుగారి కొలువుకు
'మహాప్రభో, విన్నారా!
ఒంటి గుబ్బపు రాతేమి
మన పూలతోటలో నున్నాడు.
మేము పువ్వులు దెచ్చుచు నుండంగ
మమ్ము గట్టిగను బిలచెను
గంపల లోనివి యేమనెను.
మల్లెపువ్వు లన్నాము.
ఏవీ చూతము దెమ్మనెను
మూడు గంపలు దీసికొని తం॥
తమ జమఖాన మీద పోయించి
మీ యబ్బతోటి చెప్పండ్రా
రాజుకు ఫిర్యాదు చేయమనెను
ఆ పాటుగనే వచ్చితిమి'.
'ఓరీ! కుంకలారా! మీరేమి
మీరు ముగ్గురు నుండేమి
ఒంటి గుబ్బపు రాతును
విడిచిపెట్టి వచ్చితిరా
తోటకు కావలి పెట్టకను?
ఉన్నాడా పోయినాడా?' తం॥
'అయ్యా! తోటలో పండుక యున్నాడు
మల్లెపువ్వుల మీదను,
యీ పాటికి నిద్రపోయుండు'. తం॥
ముప్పై ముగ్గురు నౌకర్ల
శీఘ్రముగాను బిలుపించి
'ఒంటి గుబ్బపు రాతేమి
మన తోటలోపల నున్నాడు

మా. వాని అధికార మేమి, వాని బిసాతు యేమి? నాకు తెచ్చు మల్లె పువ్వులు ప్రక్కను బోసికోని పడుకున్నాడట! త్వరగా మీరు ముప్పైముగ్గురు వెళ్ళి మన తోటకు వానిని కావలి పెట్టిర'మ్మనెను.
ముప్పైముగ్గురును మల్లెపూవుల తోటకు వచ్చి కుమారరామయ్య ఉండె చెట్టు కడ నిలబడిరి. ఈ అలికిడి విని కుమారరామయ్య మేలు మేలు!
కన్నెత్తిచూచి,

'ఎవరోయి మీరు?'

'మేము ఎఱ్ఱభూపతి రాజు నౌకర్లము'.

'ఇక్కడికి మీరందఱు యెందుకు వచ్చినారు'?

'మా రాజుగారి నిమిత్తము తెచ్చు మల్లెపువ్వులు ప్రక్కను బోసికొను టకు నీకు అధికారము ఎవరు యిచ్చినారు? నీపేరు యేమి? నీ బిసాతేమి? నీకు మరణకాలము సిద్ధము అయివుండగానె యీలాగంటి దుర్బుద్ధి పుట్టినది'.
అనగానె,

'సరే కాని అందుకు మీ రాజు ఏమన్నాడురా?'

'ఈ తోటకు నిన్ను కావలి పెట్టి రమ్మన్నాడు'. మేలు మేలు!
కిలకిల నవ్వి,

'సంతోషమే. కాని యీ పాపము పుణ్యము మీ ముప్పైముగ్గురును పంచుకొనెదరా? మీలో ఒక్కడే పంచుకుంటాడా?'

'ఒకడు పంచుకోవడ మేమి?, మేము ముప్పైముగ్గురమును పంచు కొనెదము'.

'ఆలాగున నయితేను
మీరు ముప్పై ముగ్గురు త్రవ్వండి
హెచ్చు తగ్గు లేకుండ
సమముగాను త్రవ్వండి.'
ముప్పైముగ్గురు త్రవ్విరి
కావు పాతర త్రవ్విరి.
'రండోయి! మీరేమి
వచ్చి మీరు ముప్పైముగ్గురు పట్టండి
నన్ను గట్టిగ బట్టుకొని
కావున బడగను ద్రోయండి.'
ముప్పైముగ్గురు పట్టిరి తం॥
కావువద్దకు దెచ్చిరి.
పడ ద్రోయగను బోగాను
తన సాదన మెరవడి చొప్పునను
త్రిప్పి ముప్పై ముగ్గురిని పడద్రోసె.
మన్నుబోసి బిగద్రొక్కి
'పరమపదము వెళ్లండి
కైలాసము ఎక్కుడనో
పోయి చూడం' డన్నాడు.
తిరిగి వచ్చెను రామన్న తం॥
మల్లెపూవుల మీదను
మరల పండుకొన్నాడు.

మా. అప్పుడు రాజుగారు యేమి చేసినారు.

'ఈ కుంకలు యెక్కడికి పోయినను అదే పోవడము. నాకు యే వర్త మానము దెలియజేయక బోయిరి. మఱల చూచి రమ్మ'
అని నలుగురిని పంపించెను. వారు కుమారరాముని దగ్గరకు చక్కగవచ్చి,

'ఎవరయా, ఇక్కడికి ముప్పైముగ్గురు బంట్రౌతులు వచ్చిరి. మీరు చూడలేదా?'

"ముప్పై ముగురిని చూచితిమి
వారు కైలాసము వెళ్ళిరి
వెళ్లేటప్పుడు వారేమి
నాతో చెప్పి పోయినారు,
'వెనుక నలుగురు వచ్చెదరు తం॥
వారినికూడ రమ్మని
నాతో జెప్పి పోయినారు,
మీరు పోయెదరా ఉందురా?
ఇప్పుడు గట్టిగ వెళ్లితిరా
పరమపదము కాడకు
కలసి పోదురు మీరేమి".
ఈ మాటకు వాండ్లు జడిసిరి
వెనుకకు వెనుకకు వచ్చిరి
పట్టణములోనికి నలుగురును తం॥
ఏక పరుగున వచ్చిరి
రాజుగారి కొలువునకు.
"మహాప్రభో! విన్నారా,
ముప్పై ముగ్గురు నౌకర్ల తం॥
నా యొంటి గుఱ్ఱపు రౌతేమి
చంపినాడు యీవేళ
మేము యిప్పుడు పోవగను
మమ్మును జూచి యేమనెను
'మీరు కైలాసమునకు బోయెదరా?
ఇప్పుడు గట్టిగ వెళ్ళితిరా
పరమపదము కాడకు
కలసి పోవుదురు పొమ్మనెను'.
మాకు గుండెలు పగిలెకదా
జడిసి వెనుకకు వచ్చితిమి". తం॥

మా. చెప్పగనె రాజు ఆగ్రహుడై,

'ఎవడు ఇటువంటి గుఱ్ఱపు రౌతు? కత్తలేని కత్తులు పుట్టించుచున్నాడు. నాకు శత్రుడు అయియుండవలెను',
అని రాజు దిగ్గున లేచి,

'ఎవరోయి! నీలి వెంకటచలం, దాట్ల బాపిరాజు, వంకాలపాటి శేషు', యీ ముగ్గురిని పిలిచి,

'అటువంటి గుఱ్ఱపురౌతు యేలాగంటివాడో చూడవలెను; మన ఆఱు వేల ఫౌంజు హాజరు చేయించు',
అనెను. అప్పుడు వారు శీఘ్రముగావచ్చి గంట వేయువఱకు మేలు మేలు! ఆఱువేల ఫౌంజును హాజరు అయిరి. ఈటెలవారు కొందఱు, బల్లెములవారు కొందఱు, పెనుకత్తులవారు కొందఱు, గుజ్జు కత్తులవారు కొందఱు, తుపాకీల వారు కొందఱు, కాలు కాలు కదలించిన ధరధూళి మేలు మేలు! ఆకాశము గప్పుచుండగా రాజుగారు అంబారీలో గూర్చుండిరి. ఎఱభూపతి రాజు కోటలోనుంచి పూవులతోటకు వచ్చుచుండుటను కుమారరాముడు చూచి

'మూలవిరాటు కదలి వచ్చుచున్నాడు. మనము తోటలోనుండడము యెక్కువ బాగుగ నుండదు',

అని గుఱ్ఱమును ఎక్కెను
పూవుల తోటకు దక్షిణము
రెండు క్రోసులు యెడమధ్యం
ఎడమధ్యానికి రామన్న
గుఱ్ఱమును ఎగవేసె
రాజు నౌకర్లు చూచిరి తం॥
'మహాప్రభో! విన్నారా,
మన బలమంతయు జూచేమి
జడిసినాడు రౌతేమి
అదుగో గుఱ్ఱము నెగవేసి
ఎడమధ్యానికి పోయెసిని.'
'పోనియ్యి వద్దనెను
వాని రక్తమును జూడవలె
నాలుగు వందల గుఱ్ఱమును
కూడ దఱుముక పొమ్మనెను.
'ఎగవేసి నఱకండి'. తం॥
వీరు గుఱ్ఱములను ఎగవేసి
వచ్చుటను జూచెను
పోవు గుఱ్ఱమును ద్రిప్పెను,
ఈ నాలుగువందల గుఱ్ఱముల తం॥
ఆ గుఱ్ఱాలమీది రౌతులను
వడ నఱికెను రాముడు.
రాజు కాలుబలముల మీదికి
గుఱ్ఱమును ఎగవేసి
తొలివీధి మరలించి
మలివీధి నఱకెను
జీరుకాడె పేగులు
దొర్లాడె మొండెములు
ఆవలించె శిరస్సులు తం॥
కొట్టి కొల్లలాడెను.
తుపాకి దెబ్బకు అందడుగా
కత్తి నఱకునకు అందడుగా
ఈటెపోటు తగులదుగా
ఎనిమిది వందల బలముల
చంపెను రామన్న
అంబారీలో రాజేమి
ఈ యుద్ధము జూచుచున్నాడు
ఆశ్చర్య పడినాడు.
'అబ్బ! ఎనిమిది వందల బలముల
ఒక్కడే చంపెను
ఇంకను కవ్వించుచుండినను తం॥
నా బలముల నన్నిటి జంపును.
ఈ చిన్నవానితో మనమేమి
గెల్వంగనులే' మనెను.
కాలుకు ముగ్గుర బొమ్మనెను.
కాలు జెండా లెత్తుకొని
కుమారరాముని యెదుటికి
ముగ్గురు పోయి నిలచిరి.
'విన్నావా, మహారాజా!
'మా రాజు భూపతి
యుద్ధమునకు రాలేదు; తం॥
బలముల నీవు చంపడము
నీకు ధర్మము గాదయ్యా
ఇవిగో కాలు జండాలు.'
కాలనగా రామన్న
'రాజుకు బుద్ధి వచ్చినదా?

మా. ఎదురు మరలినవాని వెన్ను దెగవేయ మన్నారు. పుట్ట లెక్కిన వాని, పూరిగఱచినవాని శవములక్రింద దాగినవాని, రణములో దల విరియబోసి కొని పరుగెత్తువాని కావమన్నారు. మనవికి వచ్చెడువానితో మేలు మేలు!

మత్సరమునకు వెళ్లుట న్యాయముకాదు', అని గప్పున గుఱ్ఱముదిగి ఆనెత్తురు బట్టలతోనె జముఖానా వేసికొని కూర్చునెను. ఈకొలుకు మేలు మేలు! వచ్చినవారు తిరిగివెళ్లి రాజుతో,

'మహాప్రభో! కొలనగానె కాచియున్నాడు. ఆయన వరప్రసాదిగా నగ పడుచున్నాడు. మీరు సిబ్బందితో వెళ్లక నలుగురు రాచకొమాళ్లను వెంట బెట్టుకొని యాచిన్నవాని దగ్గరకువెళ్లి, ఆచిన్నవానిని మనకోటకు తీసుకరండి'.

'మంచిది',

అని రాజుగారు పదిమంది రాజబంధువులను వెంటబెట్టుకొని కాలినడకను కుమార రామయ్య దగ్గరకువచ్చి,

'ఏ యూరయ్యా మీది? మీ తల్లి పేరేమి? మీ తండ్రి పేరేమి? మీ వంశము ఏమి',

అని అడుగగానె,

'మా వంశము సూర్యవంశము, మాకాపురం మేలు మేలు! వసవల్లి దుర్గము, మాతండ్రి వీరకుంభిణి రాజు, మాతల్లి అరియాద్దేవి, నా పేరు కుమార రామయ్య'.

'నీవు ఎందాక వెళ్లుదువయ్యా?'

'నేను నిన్ను చూడవలెననియె వచ్చినాను. మాతండ్రిగారికి పగరాజనని విని నీపగ యెటువంటిదో చూచెదమని వచ్చినాను'.

'నాయనా, మీకు మాకు పగలేమి? మీరాజ్యము మీరు చేయుచు న్నారు. మా రాజ్యము మేము చేసికొనుచున్నాము. వీరకుంభిణి రాజుకడుపున ఇంతటివాడవు సుపుత్రుడవు పుట్టితివా?' అని 'రానయ్యా, కోటలోనికి',

'ఆలాగే వచ్చెదగాని, యీ తాలూకా అర్థం మేలు మేలు! యెవరికి జమాబంది కట్టుచున్నావు.'

'ఢిల్లీకి కట్టుచున్నాను'.

'ఇప్పటినుంచి ఢిల్లీ పట్నానికి జమాబందికి వెళ్ల నక్కరలేదు.

మేలు మేలు!

మా వసవల్లి దుర్గముకు
వీరగుంభిణి కొలువునకు
జమాఖందికి రావలెను'.

'మంచిది రామయ్యా,
ఖామందులతో మీ కేమి
మాట్లాడుకునే శక్తుంటె

మే మట్లాగె వచ్చెదము
కోటలోనికి ర'మ్మనిరి. తం॥
'మంచి' దనుచు లేచెను
కోటకు వచ్చెను రాముడు
రాగానె రామునికి,
ఉదక మప్పుడు తోడించి
తొడిగిన బట్టలు విడిపించి
స్నానము జేసెను రాముడు.
పప్పులు పచ్చళ్లు
భోజనము జేసిరి.
'కుమార రామయ్యా, తం॥
పుణ్యానికి మాబలముల
నెనిమిది వందల జంపితివి
ముందు నీ వెట్లు చేసెదవో?'
'నేను తోటలో నుండంగ

నీ నౌకర్లను బంపించి
నన్ను పాతిపెట్ట మన్నావు
అంతకు యింత చేసితిని'.
అక్కడ మూడు రోజులు ఉన్నాడు.
అక్కడనుంచి లేచెను
గుఱ్ఱముమీద నెక్కెను
'ఎఱభూపతి మహారాజా!
నేను యెప్పుడు ఖబురు పంపినను తం॥
అప్పుడు నీవు ర'మ్మనెను.
అక్కడనుంచి కదలెను
ఆ గండభేరుండ వనములు
గడచెను రామన్న
మద్దులు మారేళ్లు
రుద్రవెలగలే కడచెను

మా. సుల్తాను భూపతియుండు పట్నము చేరవచ్చెను. దరవాజాకడకు వెళ్లి గుఱ్ఱమును నిలుపునటకు ఆ దరవాజాకాడ వ్రేలాడ మేలు మేలు! గట్టియున్నవి, డాలు, కత్తీ. వచ్చువారు, పోవువారు ఆ డాలు కత్తి క్రిందుగా దూరి పోవుచునున్నారు. కుమారరాముడు చూచి, పారా బంట్రౌతులను హెచ్చరించి, మేలు మేలు!

'ఈ కోటలో నుండు రాజు యెవరురా?'

అనెను.

'మహాప్రభో! కోటలోనుండే రాజు సుల్తాన్ భూపతిసింగు'

అని చెప్పిరి.

'ఏమిరా, దొమ్మరవాండ్లు కట్టుకొన్నట్లు డాలు కత్తి గట్టుకున్నాడు.'

'అయ్యా, తనకు మిక్కిలి సిపాయిలేడని కట్టించినాడయ్యా దరవాజలోను.'

'నేను లోపలికి వెళ్లవలెనే యెట్లు వెళ్లను?'

'మహాప్రభో! మీరైతే యెవరో మేమెఱుగముగాని మాఖావందు సెలవు తెప్పించుకొని యీ దరవాజగుండనె వెళ్లవలసినది',

‘ఒరే ! డాలు కత్తి క్రింపుగ నేను దూరిపోవుదునా?’ మేలు మేలు !
అని గుఱ్ఱమును గుబుక్కున దుమికించి డాలు కత్తి తెగ నఱికినాడు. పారా మీద వున్నవారు పన్నెండుమంది కలపటమైనారు. పదునొకండు మందిని నఱికి వేసినాడు. ఒక్కనిని వర్తమానం చెప్పుటకు విడిచిపెట్టినాడు. తానుపోయి కోటకు కూత వేటు నేల, దిరిశనపు చెట్టుక్రింద గూర్చున్నాడు. విడిచిపెట్టిన వాడు సుల్తాన్ భూపతిసింగు కచేరీకివచ్చి నెత్తిననున్న పాగాదీసి నేలనుగొట్టి,

“మహాప్రభో ! ఒంటి గుఱ్ఱపురాతు యెవరో మనదరవాజా కడకు వచ్చి ‘కోటలోనుండు రాజు యెవరు ?’ అని అడుగగా, మేలు మేలు !
తమ పేరు చెప్పినాము. ఏమిరా దొమ్మరివాడు కట్టుకున్నట్లు త్రోవలో డాలు కత్తి గట్టుకున్నాడని ఎగిరి తెగనఱికినాడు. మేము పన్నెండుమంది కలపటము అయినాము. కబురు చేయడానికి నన్ను ఉంచి కొొదవ పదునొకండు మందిని నఱికినాడయ్యా.”

సుల్తాన్ భూపతిసింగు ఆగ్రహుడై మండిపడి,

‘ఎఱభూపతిరాజువంటివాడు నాకు జడియును, వీడు ఒంటిగుఱ్ఱపురౌతేమి, వీని బిసాతు యేమి, నా డాలు కత్తి దెగనఱికినాడు. నాదొమ్మరి గంతున్న, వాని ఒడిగలతనమున్న చూడవలెను. వాడు యెక్కడనున్నాడు?’
అని అడిగెను.

‘దరవాజాకు యెదురుగనె కూత వేటు నేల గూర్చునియున్నాడు’,
అనగానె, మేలు మేలు !

‘ఒంటి గుఱ్ఱపురౌతును గొట్టుటకు నేను కూడా ఉండవలెనా ?’
అని పన్నెండు వేల సిబ్బంది గలవాడు గనుక ఆఱువందల వస్తాదులను బంపించెను.

‘వానిని చంపి నాయెదుటికి తీసుకరమ్ము’
అనెను. ఈ ఆఱువందల సిబ్బంది యీటెలు బల్లెములు భుజమున బెట్టుకొని కత్తులు ఒరల దూసికొని కోటగవనిలో గోవిందపెట్టి బైలుదేరినారు. ఈ ఆఱు వందల సిబ్బంది రాకజూచి కుమారరామయ్య,

‘సుల్తాన్ భూపతిసింగునకు గూడ అహంకారమే ఉన్నదా ?’
అని దిగ్గునలేచి గుఱ్ఱమును ఎక్కినాడు.

చేత కత్తిని దూసికొని
శ్రీరాముల వారిని
మతియందు తలచుకొని
అశ్వమును ఎగవేసి
త్రిప్పించి మరలించి తం॥
నఱికివేసెను రామన్న.
వీరు యీటెను పొడువ బోవగను
పోటుకు అందనివ్వదు గుఱ్ఱము
తొలివీథికి మరలించి
మలివీథిన నఱికెను.
రెండు మూడు గడియలకు
కోట గవని వఱకును
ఆఱువందలను నఱికెను.
ఈ వర్తమానమును
భూపతి సింగు విన్నాడు తం॥
గడగడ గడగడ వణకెను.

‘నరలోక మందున
పుట్టినవాడు అయితేను
ఇంతటి శౌర్య మున్నదా?
‘పునాది తెలియదు.
మంచిది పాలకి బైటను పెట్టండి’.
భజంత్రీలను దీసికొని
కళావంతుల దీసికొని
కాలి నడకను దా వచ్చె
ముందర జోడాల నంపెను. తం॥
‘మా భూపతిసింగు యిప్పుడుగ
నీతో మనవికి వచ్చెడిని,
ఆలాగనుచు జెప్పండి’.
జోడాల వారేమి తం॥
కుమార రాముని తావునకు
వచ్చిరి ఇద్దరుగా వారు.
జోడాలను జూచెను

మా. ‘ఎవరోయి మీరిద్దరు ? ఇక్కడకు యేమి పని యుండి వచ్చుచున్నారోయి ?’

‘అయ్యా, మా సుల్తాన్ భూపతిసింగు ఆటలపాటలవారిని వెంటదీసికొని చేతులు కట్టుకొని మీతో మనవికి వచ్చుచున్నాడు’.

‘మంచిది’,
అని సంతోషపడి కత్తినిఒరలో వేయువఱకు సుల్తాన్ భూపతిసింగు యెదుటికివచ్చి,

‘రాం రాం’ అంటే ‘రాం రాం’ అనుకొనిరి.

‘మీ దేవూరయ్యా ? మీతండ్రి పేరేమి ? మీ తల్లి పేరేమి ? మీవంశమేమి ?’ మేలు మేలు !

‘మాది కాపురము వసవల్లి దుర్గము, మావంశము సూర్యవంశము, మా తండ్రిపేరు వీరకుంభిణి మహారాజు, మాతల్లి పేరు అరియాద్దేవి, నాపేరు కుమార రాముడు’.

‘ఆ రాజు కడుపున ఇంతవాడవు పుట్టితివా !’
అని ‘ఇట్లు యెందాక వెళ్లుచున్నారయా ?’

'మేము యెందాక వెళ్లిననేమి? నీవు జమాబందికి యెక్కడికి వెళ్లుచు న్నావు? రూకలు యెక్కడ కట్టుచున్నావు?'

'ఢిల్లికి జమాబందికి వెళ్లుచున్నాను. రూకలు ఢిల్లీ పాహదుషాకు కట్టుచున్నాను'. మేలు మేలు!

'అట్లు మీరు ఇక ఢిల్లీ పట్నము వెళ్ల నక్కరలేదు. మా వసవల్లి దుర్గము నకు జమాబందికి రమ్మనెను.

'సరే, యెక్కడనైన మాకు డబ్బు కట్టవలసినది మానునా? ఆ ఢిల్లీ పాదుషాతో మాట్లాడు శక్తి మీదగ్గర నుండిన మీకె మేలు మేలు! చెల్లగట్టుచున్నాము. కోటకు వెళ్లుదము రమ్మనెను,

తాను తీసుకవచ్చిన పాలకీలో గూర్చుండబెట్టుకొని బాజాభజంత్రీలతో కోటలోనికి వెంటబెట్టుకొనివచ్చి మూడురోజులు ఆకోటలో నున్నాడు.

'విన్నావా, భూపతిసింగు! నేను ఊరికి వెళ్లెదను, నేను యెప్పుడు ఖబరు పంపుదునో అప్పుడు మీరు వసవల్లిదుర్గమునకు రావలసినది',
అని చెప్పి, మేలు మేలు!

అక్కడనుంచి లేచెను
గుఱ్ఱమును ఎక్కెను తం॥
మేఘములలో లెగసినది
మేఘరంజి గుఱ్ఱము
పన్నెండు ఆమడ
ప్రొద్దు గ్రుంక వచ్చెను.

ఉర్సునీ మహంకాళి పట్నముకు
రాజు చేరవచ్చెను.
ఆ రాత్రి అక్కడను
నిద్ర భోగించెను.
తెల్లవారు జామున లేచెగద తం॥
జాము ప్రొద్దు వేళకు

మా. ఓరుగంటి ప్రతాపరుద్రుని పట్నమునకు చేరవచ్చెను. వీరగుంభిణి రాజకుమారుడు కుమారరామయ్యవచ్చి ఎఱభూపతిరాజు బలములను జంపి ఢిల్లీ పట్నము జమాబందికి వెళ్లనీయకుండజేసి వసవల్లి దుర్గమునకు రమ్మని చెప్పిన వర్తమానమును, సుల్తాన్ భూపతిసింగు చేతులు కట్టుకొని యెదుటవచ్చిన సంగతియు ఈ యోరుగంటి ప్రతాపరుద్రుడువిని,

'అంతవారే జయించలేక పోయిరి. నేను జయించగలనా? అతడు అంత శూరుడు గాబోలును. మనకు కలత యెందుకు' మేలు మేలు! అని భజంత్రీలను పిలుపించి బంగారవు పల్లకీని బైట బెట్టించి వీథి వీథియందును మామిడాకు తోరణములు గట్టించి రెండువందల సిబ్బందిని వెంటదీసికొని భాజా

భజంత్రీలతో పొలిమేర మీదికి యెదురువచ్చెను. జోడాలవారిని ముందు ప్రయాణముచేసి ఓరుగంటి ప్రతాపరుద్రుడు దర్శనమునకు వచ్చుచున్నాడని కుమారరామయ్య దగ్గరకు పంపించెను. వారు వెళ్లి దగ్గర నిలువబడే వఱకు,

'ఎవడో మీకు తెలియునా?'

'మహాప్రభో, ఓరుగంటి ప్రతాపరుద్రుడు మీరు గొప్పవారు వచ్చినారని మీ దర్శనమునకు వచ్చుచున్నారు. మీతో యీసంగతి జెప్పమని మమ్ము పంపించినారయా.' సంతోషపడి గప్పున గుఱ్ఱముపై నుండి మేలు మేలు! దూకి కాలినడకను యెదురుగుండ వచ్చుచున్నాడు. వారు, మేలు మేలు! వీరు కలిసి ఒకరికి ఒకరు మ్రొక్కు వేసికొని,

'వీరగుంభిణి మహారాజు కడుపున యింతవాడవు పుట్టితివా?'అని సంతోషపడి 'పల్లకీ నెక్కవయ్యా, కోటలోనికి వెళ్లుదము' అనెను.

'ఆలాగుననే వచ్చెదగాని, యిదివఱకు మీరు జమాబందీ రూకలు యెవరికి కట్టుచున్నారు?'

'ఢిల్లీ పహదుషాకు కట్టుచున్నాము.'

'ఇక యిక్కడనుంచి మీరు ఢిల్లీకి జమాబందీకి వెళ్లవలసిన నిమిత్తము లేదు. మా వసవల్లి దుర్గమునకు జమాబందీకి రావలెను.'

'మంచిది, మీరు ఢిల్లీ పహదుషాతో మాట్లాడుకొను శక్తత కలిగిన మీకే రూకలు కట్టుదుము'.
అనగానె పల్లకీలో గూర్చుండి మేలు మేలు!

సకల సంభ్రమములతోడ
పట్నములోనికి వచ్చిరి.
చుట్టు యేడు కోటలు
సూర్య సోమ వీథులు
ఆటకూటములు దాటిరి
అభువనేశ్వరములు గడిచిరి
పొడుగైన మిద్దెలు
వారు చాల గడచిరి
కోటకు దీసుక వచ్చిరి తం॥
పల్లకినుంచి దిగినారు
మొగసాలకే వచ్చిరి

సాలలో కొలువై యున్నారు.
'భోజనంపు వేళాయె
కుమార రామయ్యా,
లెండయ్యా, స్నానమునకు
భోజనమునకు ప్రొద్దెక్కె'.
అప్పుడు దిగ్గున లేచెను
వెండి కాగుల వేనీళ్లు
పైడి కాగుల చలినీళ్ళు
సమముగా రాజుకు తోడిరి
అప్పుడు స్నానము జేసిరి.

మా. బంగారు పళ్లెరములో పప్పులు, పచ్చడులు మేలు మేలు!
పరగ నొక్క కూర నేయి నేతిబూరెలును రాజేంద్రుడు భోజనముచేసి లేచి తాంబూలము వేసికొని లక్ష్మీవిలాసములో పరుండెను. అప్పుడు ఓరుగంటి ప్రతాపరుద్రుడు యేమి ఆలోచన చేయుచున్నాడనగా, 'పన్నెండువేల బలము కలవాడనని తాలూకా మీద డబ్బు హద్దులేకుండ యిచ్చుచున్నాడనని యీసంగతి పైన ఖావందుకు తెలిసియున్నది. ఈయన మీద కత్తి కట్టిన మనబలమంతటిని చంపిపోవును. ఢిల్లీ పట్నము జమాబందీకి వెళ్ళకపోయిన వారు మనమీద కత్తి కట్టుదురు', అని ఆలోచన తోచక యేవిధమునైనను మేలు మేలు!
కుమారరామయ్యను చంపవలెనని, ఆలోపలనే పఱిగడ యేడు కుచ్చెలమేర అడవిని కొట్టించి అనపచేను వేయించినాడు. అది పంటకు వచ్చినది. ప్రొద్దు గ్రుంకగానె వందసిబ్బంది పోయి కావలి చుట్టు ఉండువారు. దేవతా అశ్వములు —పోతూ పెంటి రెండు—పైగానుంచి వచ్చి నడుమ వాలి కుంట, అరకుంట చేను మేసి పోవుచుండెడివి. రాజుగారితో నేమని చెప్పుచుండిరనగా,

'మహాప్రభో, చుట్టును కావలి అయితే ఉన్నాము. చేను నట్టనడుమనె మేసిపోవుచున్నవి, వానిజాడ తెలిసినదికాదు',
అని చెప్పగానె,

'ఓరీ! మీకు వాని ఆకళింపు తెలిసినదికాదు, దేవతా అశ్వములు యేమో వచ్చుచున్నది. అవి వచ్చినప్పుడు సడి కనిపెట్టి మేలు మేలు!
తుడుములు, తప్పెటలు, నగారాలు రద్దిచేయండి',
అని రాజు తాఖీదు చేసిరి. ఆలాగుననే వారు చేనిచుట్టు కావలికాచి జాడ గని పెట్టుకొని యుండగా రాతిరి రెండు జాములప్పుడువచ్చి చేను మేయుచుండగా రద్దిచేసిరి. ఆరద్దిచేత అవి రెండును పైకి లేవబోయి, పోతు అశ్వము లేచిపోయినది. పెంటి అశ్వము నిండు గర్భముతో నున్నది. అదియు లేవబోయిన పాటున దాని కడుపులో నున్న పిండము ఊడి భూమిమీదబడెను.

'పోయె పోయె, పట్టు పట్టు',
అని కమ్ముకునేవఱకు పిల్ల మట్టు ఆఱునప్పటికి ఆఱువందలను చంపెను. చచ్చినవారు చావగా బ్రతికినవారు పోరి పిల్లను పట్టుకొనివచ్చిరి. మేలు మేలు!
రాజు చూచి దేవతా అశ్వముపిల్ల దొరకినదని సంతోషపడి పట్నములో నుండిన మనుష్యుల జంపి పోవునని కొండను తొలపించి ఆకొండ గుహలో దానిని బందోస్తు చేసినారు. ముందర మున్నాఱు వెనుక యేనూఱు పట్టుపగ్గములతో అగాడీ

పిచాడీ చేసి దానికి దానాపాణీ పెట్టి పెంచుచున్నారు. ఎవ్వరిని దగ్గరకు రానీయదు. ముందరకు వచ్చిన కఱపు, వెన్కకు వచ్చిన తన్ను. ఈ ప్రకారముగా నుండుదానిని బందోబస్తుచేసి యుంటినిగదా! ఆ గుఱ్ఱమును కుమారరామయ్యను సవారి చేయుమనెదము. అదిలేచి దాని తల్లితో కలిసికొనును. ఈయనను ఆపైనుంచి పారవేసిన యెడల యెముకలు బొమికెలు విఱిగిపోవును. ఇదే ఉపాయముగాని యింతకంటె వేఱు ఉపాయములేదని నిద్రలేచి కూర్చునియున్న కుమారరామయ్యతో నేమని చెప్పుచున్నాడనగా, మేలు మేలు!

'నీవు గుఱ్ఱపు సవారీకి మంచిబంటువని విన్నాడను. మాది ఒక గుఱ్ఱము ఉన్నది. ఎవరికిని సాధ్యముగాదు. ఆగుఱ్ఱమును నీవు అలవఱిచి పెట్టవలె',
ననగానె బహుసంతోషించి లాగును కాసెకోకను ముస్తాదై యోరుగంటి ప్రతాపరుద్రుడును, కుమారరామయ్యయు ఆ అశ్వముకడకు వచ్చినారు. కుమారరామయ్యను జూడగనె ఆ యశ్వము,

కాలు తాటించినది
కిలారించెను అశ్వము తం॥
'నన్నెక్కెడు పాటి రౌతేమి
వచ్చె'ననుచు అశ్వము
ముంగలికాలు దువ్వినది. తం॥
అశ్వమునకు రామన్న
నమస్కారము జేసెను
అశ్వముమీద దుమికెను
అగాడిపిచాడి తాళ్ళేమి
కత్తిని నఱికెను రాముడు
అది మేఘములోనికి యెగసినది
మేఘరంజి గుఱ్ఱము
పన్నెండు గడియలకు
తూర్పు సముద్రము వెళ్ళెను తం॥
అక్కడ స్నానము జేసినది

కాశీకి వెళ్లెను
గయలో స్నానము జేసెను
కాల భైరవుని సేవించి
అక్కడనుంచి లేచెను
పన్నెండు గడియలకు
ఉత్తర సముద్రము వెళ్ళెను
అక్కడ స్నానము జేసెను
తిరిగి పడమటి సముద్రము వచ్చెను
అక్కడ స్నానము జేసెను తం॥
దక్షిణ సంద్రానికి వచ్చెను
అక్కడ స్నానము జేసెను తం॥
మేఘములలో లేచెను
యెనిమిది జాముల ప్రొద్దుకు
పట్ణము చేరగవచ్చెను.

మా. ఆ యోరుగంటి ప్రతాపరుద్రుని పట్ణానకు చేరవచ్చి మున్నుఉండు తావుననె గుఱ్ఱమును బందోబస్తుచేసి కచేరీకి వచ్చుచున్నాడు. ఓరుగంటి ప్రతాపరుద్రుడు ఏమి ఆలోచన చేయుచున్నాడనగా, కుమారరాముడు ఇంకను మన

పట్ణముసకు వచ్చునా? దేవతా అశ్వమును యెక్కుట మేలు మేలు! మరలివచ్చుట యెక్కడిది? అని అనుకొనుచు నుండగానె కుమారరామయ్యా కచేరీకి వచ్చెను. కుమారరామయ్యను చూచుచునె బహుసంతోషపడి కచేరీ మీద కూర్చుండబెట్టుకొని,

'ఎందాక స్వారిమార్గం వెళ్లి వచ్చినావయా?'

అనగానె నాలుగు సముద్రములలో స్నానముచేసి వచ్చినాము. కాశీ విశ్వనాథుని, కాలభైరవుని సేవించినాము',

అనగానె ఓరుగంటి ప్రతాపరుద్రునికి గుండెలలో గుబులు బుట్టి కుమార రామయ్యను బహువందనము చేయుచున్నాడు. మూడు రోజులు అక్కడనుండి నాలుగవ రోజున,

'లేవయ్యా, ప్రతాపరుద్రుడా, వసవల్లి దుర్గము వెళ్లుదము. వెనుకనున్న జమీందార్లకుకూడా వర్తమానము పంపించండి. మేలు మేలు! వారును మనమంత కలసి పోవుదము',

అనగానె,

'మంచిది'

అని ఎఱభూపతిరాజుకు సుల్తాన్ భూపతికి జాబులు బాపించెను మేలు మేలు! వారు ఆ జాబులు చూడగనే వారివారి బలములతో ప్రయాణామై ఓరుగల్లు చేర వచ్చిరి. అప్పుడు ప్రతాపరుద్రుడుకూడ ప్రయాణము అయి,

వసవల్లి దుర్గముకు
వారు చేర వచ్చెదరు
ముందరనున్న బలములు
వసవల్లికి వచ్చెను.
వెనుకనున్న బలములు

పన్నెండామడ పొడుగున తం॥
దారి బట్టుకున్నది
కుమార రామయ్యా
ప్రతాప రుద్రుడు
అంబారీలో నున్నారు.

మా. ముందు వచ్చిన బాహుబలములు డేరాలు వేయించిరి. వసవల్లి దుర్గము కోటచుట్టు ఎడములేకుండ, మంచుకు యెత్తించిరి, మైనపు డేరాలు ఎండకు ఎత్తించిరి. వెల్లపట్టు డేరాలు, గాలికి యెత్తించిరి గోడబారులు, నీడలకు యెత్తించిరి నీలిపట్టు డేరాలు. ఏడు డేరాలనడుమ కలంకారి డేరాలో ప్రతాపరుద్రుడు ఉండేది సిద్ధముగా డేరాలు వేసినారు. వచ్చుబలము వచ్చుచున్నది, దిగు బలము దిగుచున్నది. గుఱ్ఱముల మీద ఢంకాలు గుబులుగ వేయువఱకు వీరగుంభిణి మహారాజువిని మూళ్లబురుజు నెక్కి పాఱజూడగా ఓరు

గల్లే ప్రమోసినది, వసవల్లిదుర్గమే ప్రమోసినది, ఉజనీ మహంకాళి పట్ణమె ప్రమోసెను. 'అయ్యో, ఇక నేమున్నది. పగవారు పైకొనిరి. కొమారరామయ్య దేశములపాలై పోయెను. పోలికె రాముడుఉండిన తాలూక నిల్చును. ఎంత వెఱ్ఱి ఆలోచన జేసితిని. పోలికె రాముని ఎందుకు చంపుకొంటిని',

అని యేమియు దోచక రాజు బహు చింతాక్రాంతుడై మేలు మేలు! కూర్చునియుండగా రాజును గొల్చెడి చతురంగ బలములు రాజును క్రమ్ముకొని యున్నారు, జెట్టీల పినతండ్రులు ముగ్గురునువచ్చి,

'మహాప్రభో, మీకు చింత యేమిటికి? మీసెలవు గనుక అయినయెడల పోలికె రాముని దెచ్చెదము',

అనగానె రాజు ఆశ్చర్యపడి,

'చచ్చిన వానిని ఎట్లు తేగలరు ఏమి?'

అని అడిగెను.

'అయ్యా, పోలికె రాముని చంపిన తావుకు వెళ్ళి సంజీవి పుడక దెచ్చి మేము మంత్రములు జదివి మా మంత్రబలముచేత బ్రతికించెదమయా',

'సరే, మీయంతటి వారు ఇకలేరు, ఈ సమయములో గనుక పోలికె రాముని దెచ్చితిరా పదివేల రూపాయలు ఇనాము యిప్పించెద'

ననగానె వారు ముగ్గురు ప్రయాణామై అరణ్యమందుండు మేలు మేలు! గరిడీ కడకు వచ్చిరి. పోలికె రాముడు కావులో నున్నాడు. మేలు మేలు! కావులోనుంచి బైటికిచేది,

'పోలిక రామయ్యా, మీకు తాలూకా పొయ్యేటట్టుగా నున్నది',

అనగానె,

'అది యేమి?'

అని అడిగెను.

'మీ తండ్రిగారికి పగవారైన ముగ్గురు జమీందార్లు అనేక బలములు దీసికొని కోటముట్టడి వేసినారు'.

'అయితే, అన్నయ్య లేడా యింటియొద్ద?'

'మీఅన్నయ్యగారు ఇంటియొద్ద నున్న అంత కార్యము ఎందుకుపుట్టును? కుమారరామయ్య దేశాంతరము వెళ్ళినాడనియు, పోలికరాముడు చచ్చినాడు అనియు వారికి తెలిసి పైకొన్నారు. అందుకు మీతండ్రిగారు ఏమిచెప్పినా

రనగా 'నేను పెద్దవాడను అయినాడను, కాలము తీరినది, ఎదిరించి పోట్లాడు సత్తువ నాకు లేదు. ఈ సమయములో పోలికె రాముడు మేలు మేలు! వచ్చి యీజమీాదార్లనుగొట్టి తాలూకా నిలుపుకొనిన వసవల్లి దుర్గము పోలికె రామునికి పట్ణము గట్టుచున్నా'నన్నాడు'.

అనగా సంతోషపడి,

'ఎవరురా! నీలి వేంకటాచలం, ఎన్ని వేళ్ల బారు పెట్టినావురా వెండికట్ల తుపాకికి?

'ఆరువేళ్ల బారుతో నున్నదయా పోలికె రామయ్యా'.

ఆ తుపాకీ తానుచేత దీసికొని అడవికి పోయి పెద్దపులిని పడవేసి దాని చర్మము ఒలిపించి శిరసుకడనుంచి పాదముల పర్యంతము దేహము అగపడకుండ నేత్రములు మాత్రము గానవచ్చునట్టుగ అంగరకా కుట్టించి అదిచేత పుచ్చుకొని ఆ పదిమందిని వెంటబెట్టుకొని వసవల్లి దుర్గమునకు వచ్చుచు పట్ణము క్రోసెడు దూరము ఉన్నదనగానె డేరాలు, యీబలముచూచి,

'కోటలోనికి పోవుటకు దారిలేనట్టుగా నున్నది. మేలు మేలు! తగిన ఆయుధము చేతులో లేదాయెను, నాతో మీారు కలిసి రావద్దోయి', అని వాండ్లను కడగాపట్టించి పడమట ఎరగడియ ప్రొద్దుదాక అడవిలో కూర్చునియుండి యీపులిచర్మం అంగరకా తొడుగుకొని పొద్దుగ్రుంకునపుడు దండుజేర వచ్చెను. వాళ్లందఱు యుద్ధమునకు వచ్చినవారు గనుక ఆయుధములతో గూడ బందోబస్తుగా నుండిరా? అన్నము వండుకొనుచున్నారు. పోలికె రాముడు ఏమి చేసినాడనగా కాళ్లును చేతులును భూమిమీాద ఆనించి ఆ దండు లోపలికి మూడు విల్లెవిరాలు వేసినాడు.

'అదుగో పెద్దపులి',

అని దండంతయు గల్లంతుపడి,

'ఏదిరా కత్తి? తుపాకేదిరా? సాగేదిరా? బల్లెమేదిరా?'

అను వఱకు కోటలోపడెను. మేలు మేలు!

తండ్రి కొలువుకు వచ్చెను
వీరగుంభిణి మహారాజు
కొలువై కూర్చుని యున్నాడు
పోలిక రాముడు
తండ్రిని పడ జూచెను

గుడ్లెఱ్ఱగ జేసెను
వీర గుంభిణి మహారాజు
గడగడగడగడ వణకెను.
'నాయన! రావోయి రాముడ, తం॥
నామీాద నీకేమి

ఇంత కోప మెందుకు? తం॥
నాకు కాలము దీరె గదా
కడుపున బుట్టిన కొడుకేమి
దేశముల పాలాయె
పగవారు పైకొనిరి
ఈ రాజ్యము నీవు నిల్పుకొనుము
నీవల్ల శక్తుంటె
పగ రాజును కొట్టుమా
నీకు పట్ణము గట్టెదను
వసవల్లి దుర్గముకు
నీవు రాజ వయ్యెదవు'
అలాగనుచు జెప్పెను. తం॥
'మంచి' దనుచు రాముడు
తల్లి మేడకు వచ్చెను
చొక్కా విడిచెను రాముడు
'అమ్మా! రావే అరియాలి
అన్నము పెట్టు' మన్నాడు
భోజనముచేసి రాముడు
ఆవేళ రాతిరి
'ఎప్పుడు తెల్లవారును?
ఎప్పుడు యుద్ధము జేయుదును?'
అలాగంటు రాముడు
నిద్రబోవక యున్నాడు తం॥
తెల్లగ తెల్లవారెను
దంతధావనము జేసెగదా
పాలు అన్నము భుజియించి తం॥
'గుఱ్ఱాన్ని తయారుచేయండి
తయారుచేసి యుంచండి'.
తెచ్చి గవనిలో నిలిపిరి
లాగు దొడిగెను రాముడు
కాసె కోకను గట్టెను

పులిచర్మమును దొడిగెను
రెండు చంకలను రాముడు
జోడు పటాలు దొడిగెను
చంద్రాయుధము దీసికొని
అరియాలి దేవికి తం॥
అప్పుడు దండము బెట్టెను
నీలవేణికి దండము
దండము బెట్టెను రాముడు.
దీవించి తాంబూల మిచ్చిరి.
గుఱ్ఱమును ఎక్కెను
పక్షివలెను లేచెను
ఎఱభూపతి మహారాజు
దండు లోపలనె దూకెను
ఎడమ కుడి నఱికెను తం॥
చెలగి నఱికెను రాముడు.
వారు యుద్ధమునకు రాలేదు
మందు గుండు లేదేమి తం॥
వారు వీధులు గట్టుక దిగినారు.
ఆ వీధుల వెంబడె పడినాడు
నఱికి గుట్టలు బెట్టెగదా
తొలివీధి మరలించి
మలువీధి నఱికెను.
జీరుకాడె పేగులు
దొరలియాడె మొండెములు
ఆవలించె శిరసులు
అదరిపడెను మొండెములు. తం॥
కొట్టి కొల్ల లాడెను
రక్తధారలు గురిసెను
రావణయుద్ధ మాయెను.
రాజు డేరా దాకను
కోసి గుట్టలు పెట్టెగదా.

చచ్చిన వారు చావగను
మిగత బలము లేచెగదా.
'ఇదెక్కడి దీకర్మము
ఊరును పేరును లేకుండ తం||
అములు తెలియక నఱకును
వీడెక్కడి బంటేమి
ఇంత వానిని చూడలేదు'. తం||

రాజులు గుఱ్ఱము లెక్కిరి
వచ్చిన రాజులు కదలిరి
బలమంతయు దరలెను.
వెంబడిబడి రాముడు
నఱకుచు బోవుచునున్నాడు
మూడు క్రోసులు గొట్టెగదా.

మా. అక్కడనుంచి గుఱ్ఱమును మఱి యివతల అవతల పరంజుక పోవు బలనుమీద పడి నఱకుచున్నాడు. ఈ ముందర పోయిన వారు కుమార రామయ్యను కలియగనె కుమారరామయ్య, మేలు మేలు!

'ఏమిరోయి! మఱలి వచ్చుచున్నారు ?',

అని అడుగగనె,

'మహాప్రభో, ఏమి చెప్పను ? డేరాలు సిద్ధముగా వేసి పొద్దున అన్నము వండుకొనుచుంటిమి. పెద్దపులిచర్మము అంగరకా తొడుగుకున్నాడు. గుఱ్ఱము నెక్కి ఒక్కడే దండుమీదపడి అనేక బలమును నఱికివేసినాడు. ఇంకను వెంబడించి తఱుముకొని వచ్చుచునే యున్నాడు. ఆయన ఎవరైనది మాకు తెలియ లేదు. ఆయన యుద్ధానికి తాళలేక మేము జడిసి డేరాలు విడిచిపెట్టి పాఱిపోయి వచ్చినామయా'.

అనగానె, మేలు మేలు!

'వాడు మా తమ్ముడేను ; మీరు పోయిన సంగతి తెలియక మాతండ్రికి పగవారు వచ్చినారని యుద్ధము చేయుచుండును. ఈ శిఖామొహరు తీసికొని వెళ్ళి మా తమ్మునికి అగపఱచితిరా మీకు వచ్చు ప్రాణహాని లేదు',

అని చేతికి ఇచ్చి పంపించెను. వచ్చి పోలికె రాముని మేలు మేలు! గలసికొని,

'ఇదుగోనయా, మీయన్న కుమారరామయ్య శిఖామొహరు యిచ్చి పంపించినాడు'

అని చేతికి యివ్వగానె, అప్పుడు పోలికెరాముడు గుఱ్ఱమును గప్పున దుమికి,

'ఈ బాహుబలమంతయు నెవ్వరిది? మా అన్న కుమారరామయ్య ఎక్కడ నున్నాడు ?'

'వెనుక అంబారీలో వచ్చుచున్నాడయా. ముగ్గురు జమీందార్లను వస వల్లి దుర్గమునకు తీసికొని వచ్చుచున్నాడు'.

'అయ్యో, ఎంత వెఱ్ఱివాడ నయితిని, ఏల యుద్ధము జేసితిని? మాఅన్న మీద కత్తి గట్టినవాడనయితిని, ఇంకను నేను బ్రతికి యెందుకు? అన్నయ్య పాద ములకడ ప్రాణము వదలెదను'

అని ఎదురుగా చక్కగా వచ్చెను. వచ్చి అన్నయ్య పాదముల మీదబడి,

'ఇక నేను బ్రతుకను అన్నా',

అని బాకు దూసెను. తమ్ముని చేతిలోని బాకు అన్న నిల్వబట్టి,

'తమ్ముడా, నీకు వచ్చిన భారమేమి ?',

'అన్నా, నీమీద కత్తికట్టి ఇంకను నేను బ్రతుకుదునా ?'

'తమ్ముడా, తెలియక చేసినాడవు. ఇందుకు నామనస్సులో నెంత మాత్ర మును సందేహము లేదు. ముగ్గురు జమీందార్లను మనకోటకు జమాబందికి తీసికొని వచ్చినాడను',

అని రాజులను డేరాలలో నుండమని,

అన్నాదమ్ము లిద్దరును
గుఱ్ఱములను ఎక్కిరి తం||
తండ్రి కొలువుకు వచ్చిరి
నమస్కారమే చేసిరి. తం||
'విన్నావా! నాయనా,
వీరగుంభిణి మహారాజా !
మీ పగవారిని ముగ్గురను
జమాబందికి దెచ్చితిమి.'
రాజు ఆనందము నొందెను
ముగ్గురు రాజుల బిల్పించి

జమాబంది గావించి
రసీదులను ఇచ్చిరి
వారికి భోజనము బెట్టిరి
దుషాలువ లిచ్చిరి తం||
వారికి సెలవులు ఇచ్చిరి.
ఎవ్వరెవ్వరి భూములకు
వారి కోటలకు వచ్చిరి.
అన్నాదమ్ములు ఇద్దరికి
తండ్రి పెండ్లి ప్రయత్నము జేయించె
ఈ యత్నములో నుండంగ

మా. ఢిల్లినుంచి ఎఱ్ఱభూపతిరాజు పట్టము అర్థము నిమిత్తము గుఱ్ఱపు సవార్లను పంపించినారు. వారు వచ్చి, మేలు మేలు!

'లే లేవయ్యా, ఎఱ్ఱభూపతి రాజా, ఢిల్లీ పట్నము వెళ్ళవలెను. సాలు ఝూడాగా పైకము పట్టుకొని వచ్చిన నీ మానము దక్కుచున్నది లేక పోయిన నిన్ను కాచునని మాకేమియు దోచలేదు',

అనగానె,

'మేము ఢిల్లి పట్ణము వచ్చుటకు మాకు పనిలేదు. వసవల్లి దుర్గములో మేము జమాబంది తీర్చుకున్నారము. ఆ వీరగుంభిణి మహారాజు మనసు, ఆఢిల్లీ పహాదుషా మనసు',

అని వచ్చినవారికి భత్యమైనను యివ్వకపోయినారు. వారు తిరిగి ఢిల్లీపట్ణము వెళ్ళి వారి ఖావందుతో నీ వర్తమానము ఎఱుకచేసినారు. సమరు మీద కూర్చునియున్న ప్రభువుకు మహాకోపము వచ్చి,

'పాళెగాడు వీరగుంభిణి రాజుకు యింత శౌర్యము వచ్చినదా ?'

అని అసానల్లీ ఖానుని పిలుపించి,

'పన్నెండువేల లష్కరు వెంబడి బెట్టుకుని వసవల్లి దుర్గమును గొట్టి ముగ్గురు జమీన్దారులను వెంట బెట్టుకొని నా ఉదురుకు రమ్మ',

అని సెలవాయెను. అప్పుడు అసనల్లీ పన్నెండువేల బలమును వెంటబెట్టుకొని ఎఱ్ఱభూపతిరాజు పట్ణము వచ్చెను. సుల్తాను భూపతిసింగును మేలు మేలు ! ఓరుగంటి ప్రతాపరుద్రుని, ఎఱభూపతిని వెంట బెట్టుకొని వసవల్లి దుర్గము వచ్చెను. కోటచుట్టు దిగుచుండగానె కుమారరామయ్య చూచి, తమ్ముడును, తండ్రియు గచేరీలో నుండగా తండ్రితో జెప్పెను.

'ఢిల్లీ పహాదుషా బలమువచ్చి కోటచుట్టును దిగుచునున్నది',

అని చెప్పగానె,

'నాయనా, కార్యముపెంచితివి గదోయి, పహాదుషాలమీద మనముకత్తి గట్టి జయించగలమా నాయనా ?' మేలు మేలు !

'పహాదుషా అనగా నెంతలోనిది, ఢిల్లీ పట్ణములో హాసనల్లీకి గోరి కట్టించిననే నాపేరు కుమారరామయ్య అను', అని

అన్నాదమ్ములు లేచిరి
లాగులను దొడిగిరి తం॥
కాసె కోకలు గట్టిరి
అంగరఖాలు దొడిగిరి
పైన ఉక్కుజీరా తొడిగిరి
పట్టాలు దీసికొని
గుఱ్ఱముల నెక్కిరి
కోట బైలు వెడలిరి
శ్రీరాములను దలచిరి

బారులు బారులు నఱికిరి
వారు తుపాకీ పేల్చగను
వీరి యుక్కుజీరా మీదను తం॥
టక్కుటక్కున తగులును
దానికి లక్ష్యము పెట్టరుగ
డేరాల కాడకు
కోసి గుట్టలు వేసిరి
అసానల్లిఖానేమి
గుఱ్ఱముమీద ఎక్కెను

నాలుగువందల తురుఫుతో
వచ్చిన దారినె తిరిగెను.
ముగ్గురు జమీన్దారులు తం॥
అంతకు ముందే పోయిరి
ఇంతవాడు గనుకనె
ఇంత లెక్క సాధించె.
వారు ఢిల్లీ పట్ణము వెళ్ళిరి

వీరు వెంబడి తఱుముచు బోయిరి
పోవు పొడుగునను నఱికిరి
వారిని ఢిల్లికోటకు బాఱదోలి
వీరు బైట తాళము వేసిరి
తాళముల మీదను
శిక్కా మొహర్లు వేసిరి.
ఎఱభూపతి పట్ణము

మా. ఉత్తర భాగమున చెఱువుకడ వనములో దిగినారు. అక్కడ చొక్కాలు అవి విడిచి ఆ చెఱువులో స్నానముజేసి భోజనము ప్రయత్నము జేసికొనుచుండిరి. అక్కడ ఢిల్లీపట్ణములో అసానల్లిఖానుడు ఘుఖురుల్లా అనేవాడు ఇరువైవేల బలము వెంటబెట్టుకొని దిడ్డిదోవను బైలుదేరి అడవియంచున పట్టుకొని వచ్చుచున్నారు. శ్రీరాములవారు లక్ష్మణపెరుమాళ్లు అమ్మవారు కూర్చుని యుండి స్వామివారితో నేమని మనవిచేయుచున్నది, అమ్మవారు,

'స్వామీ, ఆలాగంటి రాజులకు మహత్తైన బలమువచ్చి ఇంతబలమును చంపుటకు కారణమేమి ?'

అనగానె, స్వామివారు పాఱజూడగా,

'వెనుక ఇంతబలము చచ్చియున్నది. ముందు యింకను చావబోవుచున్నది. కారణములేని యుద్ధము అయినది',

అని ఆంజనేయులను పిల్పించి,

"ఆంజనేయా, ఫలాని వనములో వారు ఇద్దరు భోజనము జేయుచున్నారు. నీవు మాయవేషముచేత వెళ్ళి 'శ్రీరాములవారు మిమ్ముల మెచ్చుకొన్నారు. ఆ! ఆ! ఎంత యుద్ధము జేసినారు. మీ దేహమంతట చెమట ఊరుచున్న'దని నొసటి వ్రాలు తుడిచి రావోయి",

అనెను. అప్పుడు, ఆంజనేయులు చక్కగావచ్చి వీరిద్దరిని కలసికొని చెమట దుడిచి అతను మాయమైపోయెను. వీరు భోజనముజేయువఱకు అడవి యంచు గుఱ్ఱము గలగలమని పోవుచున్నది.

'అన్నా, ఇంక నేమున్నది. అసనల్లీఖానుడు మరలి వచ్చెను',

అని దిగ్గునలేచి గుఱ్ఱము నెక్కిరి,

ఉక్కుజీరాలు మరచిరి
అడ్డముబోయి కలసిరి

విడువక గత్తుల నఱికిరి
అనేక బలముల జంపగను

అసానల్లీ ఖానేమి
అంబారీలో చూచెను
వారిద్దని జూచెను.
'మన మింత బలము ఉండగను
వెనుక దీసి పోవుదుమా ?
తుపాకులె మానండి
బల్లెములను దీసికొని
గట్టిగుండె చేసికొని
పోయి నూఱుమంది దుముకండి
బల్లెములచే గుమ్మండి
ముప్పై ముగ్గురు దుముకిరి
గుఱ్ఱములను పొడిచిరి
వీరు భూమి మీదికి దూకిరి
పరవడి యుద్ధము జేసిరి
ముప్పైమూడు బల్లెములు
అన్నాదమ్ము లిద్దరికి
ఒకసారె గ్రుచ్చిరి
భూమి మీద నొరగిరి.
శ్రీరామం రామం
శ్రీరాములను దలచుకొని
మోకారించుక నొరగిరి
స్వామి పూవుల రథమును బంపెను
పూవుల రథము మీదను
ఇద్దరిని ఉంచుకొని
బొందితోడ కైలాసం
వారిని తీసుక వెళ్ళిరి.
పాచ్చావులె చూచిరి
'ఇంతవారని యెఱుగము
ఎఱుగక మేము పొడిచితిమి
కుళ్లాయీలు తీసిరి
వంగి సలాములు జేసిరి.
వీర కుంభిణి రాజును
తమ యెదురునకే పిల్పించి
కొమాళ్లు వెళ్ళిన సంగతి
రాజుకు దెలియజేసిరి.
రాజు దుఃఖము పడగాను
'జడియకుమోయి మహారాజ !
వసవల్లి భూములు
నీకు జాగీరుగ నిచ్చితిమి
నీవే ఏలుకొను' మన్నారు
వీరు తిరిగి తిరిగివచ్చిరి.
వీరగుంభిణి మహారాజు
తిరిగి కోటకు వచ్చెను
వీరికి దినవారములను జేయించె
అనేక దానముల జేసెగదా
వసవల్లి భూములు
సుఖోపాయముగ మహారాజు
రాజ్య మేలుచు నున్నాడు.

కుమారరామయ్య కథను విన్నవారు అనేక సౌభాగ్యములు పొందుదురు.

—: సంపూర్ణము :—

—★—

అనుబంధము

★

అంగరఖా P. *angarkha*

A jacket చొక్కాయి—**Brown.**

పైన ధరించుకొను చొక్కాయి. (శ.ర.)

అంగములను రక్షించునది. (సూ.ఆం.ని.)

నిఘంటు కర్తలందరు దీనిని విదేశపదముగ గ్రహించిరి. సంస్కృత 'అంగరక్ష' శబ్దములనుండి యేర్పడిన తద్భవరూపమైనఁగా వచ్చును.

'పెద్దపులిచర్మము అంగరకా'— పుట 72

అగాడి పిచాడి. H. *agadi pichchhadi*

గుఱ్ఱము వెనుకటి కాళ్లకును ముందరి కాళ్లకును కట్టు పగ్గములు.

అదపు (రూపాంతరము హదపు) P. *adab*

Respect, politeness, awe. భయము.

అదబులో నుంచుట **to keep in awe—Brown.**

అములు (అమల్) P. *'amal*

Rule, reign, sway, government, an office or post, execution, fulfilment —Brown.

'ఊరును పేరునులేకుండ
అములుతెలియక నఱకును'—పుట 72

అమలు అనగా నిచట (నీతి) నిబంధనకు లోబడకుండ అని యర్థము జేసికొనవలసి నట్లున్నది.

అరమాషీ. P. *armashi*

'అరమాషీ పురుమాషీ'అనియే యీకథయందు ఈమాటలు వాడబడినవి. 'అరమాషీ పురుమాషీ ఖర్చు' అని పుట 9. బ్రౌనుగారు, 'అరమాషు ఫరమాషు' లేక 'అర్మాయిషి ఫరమాయిషి'అని యుదాహరించి, *farma'ish* **Provision supplied gratis,** 'దయను కోరి ఉచితముగా యిచ్చే సామగ్రి' అని అర్థము వ్రాసినారు. కిట్టల్ కన్నడ నిఘంటువులో 'అరమాయిషి పరమాయిషి, అరుమాసి పరమాసి' అని గ్రహించి, **A gift or gifts of rare and striking value** అని యర్థము వ్రాయబడియున్నది.

అరమాషీ పురుమాషీ ఖర్చు అనఁగా ఉచితముగానిచ్చు కానుకలు మొదలైన వానికగు వ్యయము.

అలకన. 'తనమెడ యలకన గున్నది'. పుట 46

ఇచట ఈమాటకు శూన్యము అని యర్థము. దీనిని శబ్దరత్నాకరకారులు దే.విణ. అనఁగా దేశ్యవిశేషణముగ గ్రహించి, 'సూక్ష్మత' 'సూక్ష్మము' అని యర్థము జెప్పినారు. వీని కాధారముగ హరివంశము ఉత్తరభాగము ౭-వ ఆశ్వాసములోని (౧౬౩) 'అలకనితెల్వి' యను పద్యమును, స్వారోచిష మను సంభవము ౬-వ ఆశ్వాసములోని (౩౧) 'అలకని జేబు'అను పద్యమును ఉదాహరించుచు. 'విశేషణమైనప్పుడు సమాసమునందు కడపటి అకారమునకు ఇకారము వచ్చెడి' అని వివరించినారు. సూర్యారాయాంధ్ర నిఘంటు కర్తలు, 'అలకన. వి. (√ అలక) పలుచఁదనము' అని యర్థనిర్ణయము గావించినారు. మఱియు, 'అలక'. విణ.(హిం. అల్కా. హల్కా).దీనికి కర్మధారయమందు నిగాగమము వికల్పముగా వచ్చును' అని వివరించి, మనుచరిత్ర లోని (౬-౩౧) 'అలకనిజేబులో' అను పద్యము నుదాహరించినారు. ప్రస్తుతము విచారణీయాంశమేమనఁగా ఈ 'అలకన' శబ్దము శబ్దరత్నా

శరకారులన్నట్లు దేశ్యమా లేక సూర్యా రాయ నిఘంటు కర్తలు జెప్పినట్లు హిందీ భాషయందలి 'అల్గా' లేక 'హాల్క' యను పదమునుండి పుట్టినదా ?' అని. పరిశీలించి చూడంగా నిది హిందీ శబ్దభవముగాదని తోంచుచున్నది. హిందీ మహమ్మదీయ యుగమున రూపందిన భాష. క్రీ.శ. ౧౫-వ శతాబ్దమున గాని దానియందు వాఙ్మయము బయలువెడలినదికాదు. హిందీ భాషకు దక్షిణదేశమున మహమ్మదీయుల రాకకుముందు ప్రసారము లేదు. శబ్దరత్నాకరకారు లుదాహరించిన మొదటిపద్యము ఎఱ్ఱాప్రగ్గడ హరివంశములోనిది. ఎఱ్ఱాప్రగ్గడ క్రీ. శ. ౧౪-వ శతాబ్ద మధ్యమున తీరాంధ్రదేశమున వెలసెను. అప్పటికింకను నాంధ్రభాష పరిశుద్ధతను గోల్పోలేదు. అరబీ పారసీ పదములు శ్రీనాథుని కాలమునుండియే యాంధ్ర గ్రంథములందు గానవచ్చుచున్నవి.

అలవగడ్డి. పశువుల గాడియందలి గడ్డి,

'పశుముకి తునుకను దీసెను
అలవాగడ్డి దూసెను'—పుట 45.

ఆకులమోద. ఆకులకట్ట.

A small packet or parcel of betel leaves. —Brown.

ఆగ్రహుండు. కోపము జెందినవాడు.

ఆటకూటము. నాట్యమందిరము.

A dancing hall.

'ఆటకూటంబులో నయోధ్యలోను
నట్టింట సీతమ్మ నాయకముజేసె'—పాట.

ఆదా. ఆదాయము.

ఇది ఒకవేళ పార్సీ |ɔ| కానవచ్చును. అగునేని దీనికి నిలువయని యర్థము జెప్పకొనవలయును.

ఇనాము. P. *in'am*

బహుమానము, మాన్యము.

'ఇనాము' అనియే వాడుకయందున్నను, శాసనములందును గ్రంథములలోను 'ఈనాము' అనియె కాన వచ్చుచున్నది.

'...జెలిపి। నంగని వీర్ణని రంగరాయని గారలీనా మొసంగిరి భూసుతముగ'

Further Sources I. No. 54.

'కరిమయూరమరాళికలకు నొయ్యార మీనామిచ్చి' —వరాహపురాణము ౪-౧౫౯.

ఉదురుకు. P. *huzur*

సమక్షమునకు, సముఖమునకు

to the presence.

'ముగ్గురు జమీన్దారులను వెంటబెట్టుకొని నా ఉదురుకు రమ్ము' అని సెలవాయెను. —పుట 74.

ఏకశోకము.

'హేకశోక'మని వాడుక భాషయందు రూపాంతరము.

విడువని దుఃఖము, నిలుపుదలలేని యేడ్పు.

ఏపుదిండు. పెద్ద లేక పుష్టియైన తలగడ.

కంఠీపట్టించు. సరిచూచు.

'సాలుగుదస్తా లెక్కలు కంఠీపట్టించగా ... ఖర్చుపోగా...ఆదా కనుపడివది'.

—పుట 9.

కచేరి. H. *kachheri*

అధికారవిచారణ జరిగేయిల్లు. Office.

కబరులు. P. *khabar* సమాచారములు.

కలంకారి. P. *qalamgari*

ఒక తరహా వ్రాతవన్నెగుడ్డ. తూలికతో వర్ణము వేసిన గుడ్డ.

కీర్ణాలకము. అల్లిబిల్లిగ నల్లుకొనిన.

కుంట. భూపరిమాణ విశేషము.

కుంటెన కుచ్చులు. కుంటెండ్లు. బంగారుతో జేసిన పెద్ద కర్ణభూషణ విశేషము. ఈడ్పులనెడు కర్ణభూషావిశేషము. జుమికీలు కావచ్చును.

కుంభిని. ఇంగ్లీషుమాట

Company దళము, సమూహము,

కుంభిణీ కోట.

దుర్గవిశేషము. కుమారరాముని కథయందు తప్ప ప్రయోగాంతరముగానరాదు.

కాంచి. (కంచీ) P. *qamchi* కొరడా, జాటి.

కుచ్చెల. ఎనిమిది గొఱ్ఱులకొలది భూమి.

కుప్పటము. కొప్పరము, శిఖరము, అగ్రము.

కుర్చి. పార్సీ (*kursy*) నుండి తెచ్చుకొనిన ఎరవుమాట. కూర్చుండుట కుపయోగించు నున్నత పీఠవిశేషము. A chair.

కుళ్లాయి. P. *kulah*

తెనుగుమాటకాదు. పార్సీనుండి ఎరవు తెచ్చుకున్నది. చిన్నటోపి.

'కుల్లాయుంచితి కోకసుట్టితి
జటికూర్పాసముఁ దొడ్గితిన్'

—శ్రీనాథుఁడు.

శబ్దరత్నాకరకారు లీమాట వైకృతమనిచెప్పినారు; సూర్యారాయాంధ్ర నిఘంటు కర్తలు ఇది 'ఖోలకః' అను సంస్కృత శబ్దమని సూచించినారు. శ్రీనాథునికి ముందరి వాఙ్మయమునం దీశబ్దము వాడుకయం దుండినట్లాధారమేమియు గానరాదు. శ్రీనాథుఁడే యరబీ, పార్సీ మున్నగు నన్యదేశ్య పదములను బ్రయోగించుటకు దారి చూపినట్లున్నది.

కౌలు P. *qaul* అభయపత్రము.

'కౌలుకు ముగ్గుర బొమ్మనెను'. పుట. 59

ఖజానా P. *khazana* ధనాగారము.

ఖర్చు P. *kharch* వ్యయము.

ఖామ(వ)ందు P. *khavand* ఒడయుడు.

ఖామందు అని సామాన్యముగ వాడుకయందున్నను ఖావందు అనునదియె సరియైన రూపము.

ఖాయిదా P. *qa'ida* విధి, నిర్ణయము, కట్టుబాటు.

ఖుశాల్. సంతోషము.

ఇది ఖుష్ (*khush*) అను పార్సీమాటనుండి పుట్టినది. తెనుగునందప్ప మఱియెచ్చటను గానరాదు. దీని కీరూపమెట్లువచ్చెనో తెలియదు. కుశాల్ అనియె సామాన్యముగ వాడుకలోనున్నది.

ఖైదు P. *qaid* చెఱ.

గజ్జెల యొడ్డాణము. గజ్జెలుగల యొడ్డాణము. ఒడ్డాణము. 'స్త్రీలు నడుమున బిగికై ధరించుకొనెడు బంగారులోనగువాని పట్టెడ'.

—(శ.ర.)

గల్లీ P. *galli* సందు.

గోరి P. *gor* సమాధి.

'ఢిల్లీపట్టణములో హసనల్లీకి గోరి కట్టించిననే నాపేరు కుమారరామయ్య'.—పుట 74.

చంద్రవంక. అర్ధచంద్రాకృతిగల స్త్రీ శిరోభూషణ విశేషము.

చిటికెన బొద్దులు. స్త్రీలు కాలి చిటికెనవ్రేళ్ళయందుంచుకొను భూషావిశేషము. (శ.ర.)

చేమపూవు కడియము. చేమపూవు జెక్కిన కడియము. స్త్రీలు హస్తముల ధరించునది.

జండా H. *jhanda* ధ్వజస్తంభము.

—Brown.

టెక్కెము, ధ్వజము. (శ.ర.)

జమఖానా. P. *jamkhanah*

జముకాళము, జముకాణము, బంబుకాణము, జమ్మఖాణము అనిరూపాంతరములు.

'కూర్చుండుటకై ముతుకనూలితో నేసి క్రింద పఱచెడి ఆస్తరణ విశేషము' (సూ.ఆం.ని.)

A Carpet—Brown.

'క్రిందవేసి కూర్చుండెడి ముతక నూలితో నేసిన పట్ట' —శ.ర.

జమాబంది P. *jama'bandi* సిస్తు యేర్పఱచుట

జర్రిపట్టిలు. బాలక్రీడా విశేషము,

జాగీరు. P. *jagir*
సర్కారువారు చేసినసేవకు బహుమానముగ గాని సేవజేయుటకు భృతికి బదులుగగాని ఇచ్చు భూమి.

జాతె. వాణ్యములుంచు వలసంచి.

జాహీరు P. *zahir* తెలియవచ్చు.

జీరా P. *zira* కవచము. armour, mail

'అంగరఖాలు దొడిగిరి
పైన ఉక్కుజీరా తొడిగిరి'. -పుట 74

జోడాలు. H. *joda*
వార్తావహులు, హర్కారాలు. జోడా అనగా జతయని యర్థము; కాని దీనికి సందేశహరులను నర్థమెట్లు కలిగెనో తెలియదు. వీరు జతలు జతలుగ సమాచారములు గొని పోవుటవలన నీమాట కీయర్థము రూఢియై యుండవచ్చును.

డెబ్బెరెండు కరపట్టాలు.
కరపట్టమనగా ఓడరేవు లేక రేవు పట్నము అని యర్థము. అనవేమారెడ్డి మోటుపల్లి శాసనమునం దది కరపట్ట మని పేర్కొనబడినది. షోడశకుమార చరిత్ర (౬:౯౭.) యందు గూడ ఈమాటకలదు.

'వీడుకొని బహుపర్వతవిపినరాష్ట్ర
పంక్తిఁ దటియించి యొక కరపట్టణమున
కరిగి యాద్వీపమునకు దా నరుగువారి
నెమ్మి దడవంగ దైవయోగమ్మునందు'.

వీనిని వేళాపురములనియు జెప్పుటకలదు. కాని వీని సంఖ్య ద్వాత్రింశ (3౨) దని శాసనములందు జెప్పబడియున్నది.
(Ep Car. vii. sk. 118)

తతిమ్మా P. *tatimmah* శక్కిన, కొఱవ.

తనగామా. నీళ్లు నించికొనిపోవు పీపావంటిపాత్రవిశేషము.

తయారు P. *tayyar* సిద్ధము,

తాఖీదు P. *takid* ఆజ్ఞాపత్రిక. 'అని రాజు తాఖీదు చేసెను', అనగా రాజు ఉత్తరవు చేసెను అని.

తుపాకి. P. *tufang*
మందుగుండువేసి గట్టించి కాల్చెడి యయోనాళాయుధ విశేషము.

తురుపు. troop. ఇంగ్లీషు మాట.
గుఱ్ఱపు దళము.

'అసానల్లీఖానేమి
గుఱ్ఱముమీద ఎక్కెను
నాలుగు వందల తురుపుతో
వచ్చినదారిని తిరిగెను' పుట. 75

తేజీ P. *tezi* అరబీదేశజమగు నశ్వము.
'హుర్మంజి బలు తేజిహరులు దెచ్చె'
అని శ్రీనాథుడు. హర. వి. ౧-౭౬
ఇదియె ఈమాట కాంధ్రమున బ్రథమప్రయోగమని తోచెడిని. అర్వాచీన వాఙ్మయమున విశేష్యముగ బ్రయోగింపబడినను, పై ఉదాహరణమున 'తేజిహరులు' విశేషణముగ గానవచ్చుచున్నది. శబ్దరత్నాకరకారులు 'తేజీ' దేశ్యమనిచెప్పిరి. కాని వాస్తవముగ నది పార్సీనుండి ఎరవు తెచ్చుకొన్నమాట.

తోరక (తోలక). తోలు, చర్మము.

దండపగడ.

ఇరువై నాలుగు మూరలది
దండపగడ తీసెను.
... ...
దగ్గరకు రానిచ్చి
వెదురుగడను ఎత్తెను
త్రిప్పి ఒక్క పెట్టుపెట్టెగద.
—పుట 34.

ఇందువలన దండపగడ యనునది యొక వెదురుగడయని తెలియుచున్నది. 'దండపగడ'

'పగడదండ' యు నొక్కటియగునా యన్నది విచారణీయాంశము.

'కవిరాజు కంఠంబు కౌఁగిలించెనుగదా పుర
వీథి నెదురెండ పొగడదండ'

అను సందర్భమున గూడ దీనికి వెదురు గడ యని యర్థము చెప్పుకొనుట సరియా?

దండెము. గరిడీలోజేయు నొక సాదన విధము.

దఖ్ఖలు. వశము, శాసకగా నిచ్చుట.

దగలా (దగళా) *daglah* A coat of mail.
ఉక్కుకవచము.

చీనాచుట్టు దగలేమి
తొడిగెను రామన్న. —పుట ?4

దరవాజా P. *darwazah* ద్వారము.

దరోబస్తు *darobast* యావత్తు.

దస్తు P. *dast* వసూలైన పైకము.
దస్తు అనగా చేయి; చేతిలోనికి వచ్చిన పైకమున కది రూఢిమైనది.

దానాపాణీ H. *danapani* గుఱ్ఱమునకుబెట్టు ఉలవలును నీళ్లును

దాయకట్టు. బందమువేయు, పశువుల కొండొంటికి లంకెలువేయు.

దివాన్ P. *diwan* మంత్రి.

దీనాపదిండు. ఒకవిధమైన తలగడ.

దుద్దుపెట్టు. వంచనసేయు.

దుపాలువ P. *dushalah* జోడు శాలువలు. దుశ్శాలువయని రూపాంతరము.

దుశ్శాలువ. చూ. దుపాలువ.

నగరికొమాళ్లు. నగరి బిడ్డలనియు జెప్పుటకలదు. నగరి యాండపాపలకు బుట్టి నగరియందే పెరిగినవారు. రాజులకును, రాజపుత్రులకును సేవజేయుటయే వీరి వృత్తి. రాయవాచకమున వీరు కుమాళ్ళనియు, హరిబాణంకుమాళ్ళనియు పేర్కొనబడి యున్నారు. 'హరిబా(వా)ణ'మనఁగా పళ్లెరము. రాజును రాజపుత్రులును భుజించిన పిమ్మట పళ్లెరములోని యుచ్ఛిష్టమును భుజించువారు గావున వీరి కాపేరు వచ్చినది.

నాలుగు స్తంభాలాట. బాలక్రీడా విశేషము.

నీళ్లుపోయు. తిలోదకము విడుచు, చంపు.

నౌకరి P. *nawkar* సేవకుఁడు.

పకీరు టెక్క్యము. ఆకుపచ్చయందు నీలిమగలసిన వర్ణముగల జండా.

పచ్చబద్దలవారు. బద్దలవారు అనఁగా వేత్రధరులు. వేత్రముల వర్ణమునుబట్టి పచ్చబద్దలవారు అను పేరు వచ్చియుండవచ్చును.

పటాని పాగారౌతు. పాగా యనగా గుఱ్ఱపు లాయము. పటానివారి గుఱ్ఱపు లాయమునకు జెందిన రౌతు.

పరంజాకపోవు. పాటిపోవు.

'మఱి యివతల అవతల పరంజాక పో
వు బలముమీద పడినఱకుచున్నాడు'.
-పుట. 72

పరగడ. బయట.

ఫలాన(ని) P. *falana* అట్టి, ఒకానొక.

పాంజేబు P. *pazib* స్త్రీలు కాలికి ధరించు వెండి గజ్జె గొలుసు.

పాచ్ఛావులు. పాదుశాహులు.

పారాచౌకీ P. *parahchawky* కావలివారు కాపుండు స్థలము.

పావడము (పాగడము, పాడగము). వంకరకడియము. అనగా స్త్రీలు పాదములందు వొంకెలుగా చేసియుంచే భూషణము. A silver anklet of a vandyked form'
—Brown.

పాహదుషా P. *padshah* పాదుశాహు. డిల్లీని పాలించిన మహమ్మదీయ చక్రవర్తుల బిరుదు.

పిల్లాణులు (పిల్లాండ్లు). పెండ్లియైన స్త్రీలు కాలి నాలవ వ్రేలికిబెట్టుకొను వెండి యుంగరము,

ఫునాది P. *bunyad* మూలబంధము.

> నరలోకమందున
> పుట్టినవాడు అయితేను
> ఇంతటి శౌర్యమున్నదా ?
> పునాది తెలియదు'. పుట 68.

ఇచ్చట 'పునాది' యనగా పుట్టుక అని యర్థము చెప్పుకొనవలసి యున్నది.

పురమాషి P. *faramash* చూ. అరమషీ.

పొడుగున. దూరము.

'పోవు పొడుగున నఱికిరి' —పుట 75

ఫిరంగి (పిరంగి, పిరంగీ) P. *firangi* శతఘ్ని.

ఫిర్యాదు P. *firyad* విన్నపము, మొఱ.

ఫౌంజు (పవుజు, పౌజు) P. *fauj* దండు, బారు.

బంట్రౌతుమానా (బంటు + రౌతు + మానా).

ఇందు బంటు రౌతులనునవి రెండును తెనుగు మాటలు. మానా హిందీ. (బంటు-పదాతి రౌతు-అశ్వికుడు, మానా-గుణము.) కాని ఇచట సిపాయిగిరీ బంట్రౌతుమానాయని యున్నది; కావున బంట్రౌతుమానా యనగా రౌతుఁదనమని యర్థము జేసికొనవలసి నట్లున్నది.

బందోబస్తు P. *bandobast* భద్రము, జాగ్రత.

బకషాయించు. ఇదిపార్సీ బఖ్షా లేక బఖ్షాన అను మాటలలో నొక్కదానికి తెనుగు రూపమై యుండును. ఇచ్చు, మన్నించు, క్షమించు అని యర్థము.

బగిలిమాటలు. బింకపుమాటలు.

బలముచెప్పుట. నాలుగు స్తంభముల ఆటలో 'నాలుగు స్తంభాలాట నడిమికి తోడిమికి తానక తప్పక తనపేరేమంటే' ఇత్యాదిచెప్పి దొంగను సూచించుట.

బవిరిరేకులు. స్త్రీలు కొనచెవిని ధరించు నాభరణములు.

బాజాభజంత్రీలు H. *baja bajantri* సంగీతమేళము. 'musical band'—Brown.

బాజారు P. *bajar* అంగడివీధి.

బజారని సామాన్యముగ వాడబడుచున్నది. ప్రాచీన తమప్రయోగము,

'బాజారేచూచికాంత పక్కననవ్వెన్' అని శ్రీనాథుఁడు.

బాజీ(జు)బందు P. *bajuband* సందిటి కడియము, రెట్ట కడియము.

బారుపెట్టు. తుపాకిలో మందుగుండువేసిగట్టించు.

బాలీసుదిండు P. *balish* ఒరగుదిండు.

బిడిగల్లుగ. అమాంతముగ, హటాత్తుగ.

బిసాతు. బిసాతు అని సామాన్య వ్యవహారభాష యందు చెల్లుబడిలో నున్నది. ఇదియే సరియైన రూపము. P. *bisat* శక్తి, బలము అని యర్థము.

బురుజు P. *burj* పిరంగిపెట్టి కాల్చె దిబ్బ, గడి, చిన్నకోట. —Brown.

బేడలు. కాయధాన్యముల పప్పు.

భజంత్రీలు H. *bajantri* చూ. బాజాభజంత్రీలు.

భువనేశ్వరము. చుట్టుబవంతి.

'A house, containing an open area which has rooms built at the corners and has roofs between.

నాలుగిండ్లు కలిసి నట్టినది' —Brown.

మచ్చు. మీద కట్టడములేని మిద్దెయిల్లు (శ.ర.) అనఁగా కప్పులేని మిద్దమీదియిల్లు.

> 'సోరణగండ్ల మచ్చుపై కెగసి'
> కట్టా రామాయణము.సుం॥కాం. పుట 3౨.

ఇందువలన మచ్చునకు గవాక్షములుండునని తెల్లము. స్త్రీలతోగూడ రాత్రులు వెన్నెలలో విహరించుట కొఱకు నిర్మింపబడునది. సాధారణముగ మహమ్మదీయ గృహము లందుగానవచ్చును.

మట్టిలాగులు. జెట్టీలు సాదనజేయునపుడు తొడుగుకొను మోకాలివఱకు వచ్చు ఇజారు.

మహాలుదారు. P. *mahaldar* చిన్నభూస్వామి. మహాలనగా రాష్ట్రమందుగాని పట్టణమందుగాని పాలనసౌకర్యమునకై చేసిన భాగము. మహాలుదారుడు మహాలున కధిపతి.

మాజూము. P. *m'ajum* బంగిఆకు బెల్లము మొదలయినవి వేసిచేసిన మదద్రవ్యము. —Brown.

ముస్తాదు P. *must'id* సిద్ధముగానుండు.

మైసాదు. ఒకవిధమైన యడవి మృగము.

మోయమాటి(మోయమతి). మోయమతి సరియైన రూపము. ఇది పార్సీ *mu'ayyan* నుంచి యేర్పడినది; బత్తెమునకు వలసిన అని దీనికి అర్థము,

మొహరీ. P. *muhr* పదునైదు రూపాయల విలువగల బంగారు నాణ్యము.

రద్ది. అల్లరి, గొప్పధ్వని.

రసీదు. ఇంగ్లీషుమాట reciept, చెల్లుపత్రము.

రుమాల P. *rumal* తుండుగుడ్డ, చేతిగుడ్డ.

లండీ. కుత్సిత పురుషుడు, కుత్సిత స్త్రీ.

లష్కరు P. *lashkar* దళము.

వడికాడు. వడిగలవాడు.

వస్తాదు P. *ustad* గడిదేరిన సాదనకాడు. సాదనజోదు.

విల్లెవిరాలు. గంతులు అని సందర్భమును బట్టి అర్థము దోచుచున్నది.

'కాళ్లను చేతులను భూమిమీద ఆనించి ఆ దండులోపలికి మూడు విల్లెవిరాలు వేసినాడు'. —పుట 70.

వెల్చుకొను. (వెలచుకొను) శుద్ధిచేసికొను, కడిగికొను.

శిఖామొహరు P. *sikkah muhr* ముద్ర.

> 'ఈ శిఖామొహరు తీసికొనివెళ్లి
> మాతమ్మునికి అగుపఱచితిరా...' పుట 72

సదురు (చదురు) P. *sadar* సభ.

> 'సదురుమీద కూర్చునియున్న ప్రభువుకు
> మహా కోపమువచ్చి,' —పుట 74

సముజాయించు. సముదాయించు, ఓదార్చు.

సముజాయించు కన్నడ 'సముజాయిసు' కాంధ్రీకరణము.

సరంజాము P. *saranjam* సామాను, వస్తువులు.

సరంబీ (మలయామాట). కూర్చునుట కుపయోగించు ఎత్తైన నాలుగుకాళ్ల పెద్దబల్ల. బలంపీటయనియు జెప్పుటకలదు.

సరకారు P. *sarkar* దివాణము, ప్రభుత్వ నిర్వాహకులు.

సర్వదుంబాల. నిశ్శేషము.

> సర్వ - సంస్కృతము.
> దుంబాల *dumbala* పార్సీ.

సాంబ్రాణిసాదులు. (సాంబ్రాణి యనగా నుత్తమాశ్వము, సాదు లనగా రౌతులు) ఉత్తమాశ్వములపై స్వారిచేయు రౌతులు. సాంబ్రాణి. అర్వాచీనాంధ్ర వాఙ్మయమును బ్రవేశించిన యన్యదేశ్యపదము. కిట్టెలునిఘంటువులో నీమాటకు N. of a country, a horse of that country' అని యర్థము వ్రాయబడియున్నది. ఇందువలన సాంబ్రాణి యను దేశమొక్కటి కలదని యూహసేయవలసి యున్నది. Tamil Lexicon లో 'చాంపిరాణి' சாம்பிராணி యను మాటకు Malay - *Samrani.* A district in Malacca famous for its horses అని వివరణగలదు. దీని కాధారముగ తిరువాలవా 27,78 'కాంబోజ మారియ ఛాంపిరాణి ... మున్నాన్ తురంగం' అను వాక్య ముదాహరింపఁబడి యున్నది. ఇందువల్ల మలకా ద్వీపములోని సామ్రాన్ మండల ముత్తమాశ్వములకు ప్రసిద్ధినొందినదనియు, నచ్చటినుండి దిగుమతియగు గుఱ్ఱములు సాంబ్రాణు లనబడుచు వచ్చెననియు తెలియవచ్చుచున్నది.

సాఫు P. *saf* ఏమియు మిగులకుండ.

సామాను P. *saman* వస్తువులు, పదార్థములు.

సాలుగుదస్తాలెఖలు. సరియైన రూపము సాల్ గుజాస్తా *salguzashta* అనగా గడచిన సంవత్సరపు లెక్కలు.

సాలుఝూడా H. *saljhada* పూర్తి సంవత్సరము, సంవత్సరము పూర్తిగా, సంవత్సరమున కంతకు.

'సాలుఝూడాగా పైకము బట్టుకొని వచ్చిన నీమానము దక్కుచున్నది'. —పుట 78

సిపాయిగిరి P. *sipahgiri* ఆయుధోపజీవనము, సిపాయితనము.

సిబ్బంది P. *sibandi* కట్టుబడివాండ్లు, బంట్రౌతులు.

సిలెబత్తరు. సిలాబగ్తర్ P. *silahbagtar* సరియైనరూపము. ఉక్కుకవచము.

సిస్తు P. *shist* పన్ను.

సూడిద. కానుక.

సూర్యవంక. స్త్రీలు తలయందు ధరించు సూర్యబింబమువంటి బంగారు ఆభరణము.

సూర్యసోమ వీథులు. ఇది నిఘంటువుల కెక్కని మాట. పురములందు ఒకదాని కడ్డముగ మఱియొకటి దాటు రెండు పెద్దవీథులు. బొబ్బిలివీరులు శత్రుసైన్యమును సూర్యసోమ వీథులంబొఱ నఱికినట్లు బొబ్బిలి కథయందు జదివినట్లు స్మరణ.

సోమవీథిని గూర్చి ప్రయోగ మొక్కటి.

'మల్లెల్ మొల్లలు సేమమా? శుభములా మాకందముల్ జాజులుక్
మొల్లంబారక యుండునా? సుదతులుక్ మోదంబు వాటింతురా?
విల్లుంగోలయు (యేమరూఢ మగునా?) వేమాలనూ యున్నదా?
నెల్లూరక్ జెదసోమవీథినికదా నీరాకజైవాతృకా'.

—చాటుపద్య మణిమంజరి. పుట 30.

సెమ్మె P. *shim'a* దీపస్తంభము.

స్వారి P. *sawar* సవారి, వాహ్యాళి.

హాజరు P. *hasir* వచ్చియున్న.